

3

జూన్‌లో శ్రీవారి హుండీ ఆదాయం
119.86 కోట్లు
రోజుకు సగటున 80 వేల మందికి దర్శనం

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 2-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 77 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: సప్తమి ఉ.11:59 తదుపరి అష్టమి, నక్షత్రం: ఉత్తర ఉ.11:07 తదుపరి హస్త, వర్జ్యం: రా.8:28-10:15, దుర్ముహూర్తం: ఉ.11:53-12:45, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 5:48, సూర్యాస్తమయం: 6:49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

- గత ప్రభుత్వంలో అధికార యంత్రాంగానికి జీతాలు ఎపుడొస్తాయో అర్థమయ్యేది కాదు. పింఛను ఎప్పుడిస్తారో రిటైర్డ్ ఉద్యోగులకు తెలిసేదికాదు. వారంతా వాటిపైనే ఆధారపడిన వారు. కానీ నేనూ, నా మిత్రుడు పవన్‌కల్యాణ్ ఒకటో తేదీనే అన్నీ ఇస్తున్నాం.
- అభివృద్ధి లేకపోతే ఆదాయం రాదు. ఆదాయం లేకపోతే అప్పులు చేయాలి. అప్పులు చేస్తే రాష్ట్రం దివాళా తీస్తుంది. అందుకే అభివృద్ధి చేస్తూ సంపద సృష్టించి ఆదాయం పెంచి ఈ రాష్ట్రాన్ని బాగు చేస్తామని ఆనాడే చెప్పాను.
- అగస్టు 15వ తేదీ నాటికి లక్ష బంగారు కుటుంబాలు చేయాలనేదే లక్ష్యం. 2029 నాటికి పేదరికం పూర్తిగా నిర్మూలించడమే పీ-4 లక్ష్యం. ఇది అందరి బాధ్యత. - సీఎం చంద్రబాబు



తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని మలకపల్లిలో చర్మకారుడు పోసిబాబుతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

ఆలోచించండి!

'రాజకీయ రౌడీ'లతో ప్రమాదం

- వివేకా హత్యలో నన్నే మోసం చేశారు
- ఆరోజే అరెస్టు చేసుంటే రాష్ట్రానికి మేలు జరిగేది
- ఆ ఐదేళ్లూ నన్ను బయటికి రానివ్వలేదు
- దుష్ప్రచారాన్ని నమ్మితే భవిష్యత్తు చీకటే
- నాటి విధ్వంసం నుంచి.. నేడు వికాసానికి
- 1న నిద్రలేచిన వెంటనే గ్రామాలన్నీ కళకళ
- ఇందుకు పింఛన్ల పంపిణీయే ప్రధాన కారణం
- ఆగస్టు 15 నాటికి లక్ష బంగారు కుటుంబాలు
- 2029కల్లా పేదరిక నిర్మూలనే పీ-4 లక్ష్యం: సీఎం

రాజమహేంద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'నేను ఇవాళ నేరస్థుడితో రాజకీయం చేయాల్సి వస్తోంది. పిల్లలకు పెళ్లిళ్లు చేసేటప్పుడు ఎన్ని ఆలోచిస్తాం.. ఏడు తరాలు ఆరా తీస్తాం. మరి ఒక నేతను ఎన్నుకునేటప్పుడు గుడ్డిగా ఓటేస్తారా? ప్రజలు ఆలోచించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కులం, మతం, తప్పుడు సమాచారాన్ని నమ్ముకుంటే భవిష్యత్ మృగ్యమవుతుందని హెచ్చరించారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం తాళ్లపూడి మండలం పరిధిలోని మలకపల్లి గ్రామంలో మంగళవారం మార్గదర్శులు-బంగారు కుటుంబాల పేరిట జరిగిన ప్రజావేదికపై ప్రజలనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు రాజకీయాల్లో రౌడీలు ఉండేవారు కాదన్నారు. ఇవాళ రాజకీయాల్లోకి రౌడీలు వస్తున్నారని.. నేతలు కూడా అవుతున్నారని..

మిగతా 13వ పేజీలో...

సీఎం కారులో చర్మకారుడు

2 కిలోమీటర్లు ప్రయాణం.. యోగక్షేమాలు, జీవన స్థితిగతులపై మాటామంతీ

సీఎం హెలికాప్టర్‌కు విజిబిలిటీ సమస్య

- ప్రతికూల వాతావరణంతో వెనుదిరిగిన వైనం
- ఉండవల్లి నుంచి తూర్పుగోదావరికి బయలుదేరిన బాబు
- గన్నవరం ఎయిర్‌పోర్టు దాటాక దట్టమైన మేఘాలు
- ప్రత్యేక విమానంలో రాజమండ్రికి వెళ్లిన ముఖ్యమంత్రి

నేటి నుంచి 'తొలి అడుగు'

ఏడాది పాలనపై ప్రజల్లోకి టీడీపీ

సరి 'దిద్దలేని' దందా!




కాకినాడలో వైసీపీ నేత భూదోపిడీ

కోట్ల విలువైన భూమిపై కన్ను

- కలెక్టరేట్‌లోని రికార్డులే మార్చేశారు
- సామాన్యుల పట్టా భూములు నొక్కేశారు
- అసలు యజమానుల స్థానంలో బినామీల పేర్లు
- నాడే నిర్ధారించిన జాయింట్ కలెక్టర్
- నేడూ ప్రభుత్వ పెద్దలకు బాధితుల ఫిర్యాదు
- 'దిద్దుడు' నిర్ధారించినా చర్యలు శూన్యం
- అండగా టీడీపీ నేత, ఆయన కుమారుడు

వైసీపీ హయాంలో జరిగిన భూదోపిడీ స్థాయికి ఇదో మచ్చు తునక! అధికారాన్ని అడ్డం పెట్టుకుని పాల్పడిన అరాచకాలకు మరో నిదర్శనం! ప్రభుత్వ భూములను స్వాహా చేయడం మాత్రమే కాదు... ఇతరులకు చెందిన భూముల రికార్డులనూ తారుమారు చేసి బొక్కేశారు! కాకినాడలో ఒక కీలక నేత కోట్ల విలువైన భూమిని సొంతానికి 'రాసేసుకున్నారు'! విచిత్రమేమిటంటే... ఈ తప్పును అప్పుడు సరిదిద్దలేదు. ఇప్పుడూ... సరిదిద్దలేక పోతున్నారు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



అది కాకినాడలోని సూర్యారావుపేట ప్రాంతం! బీచ్‌తోపాటు పలు పరిశ్రమలు అక్కడే ఉన్నాయి. వైసీపీ హయాంలో రకరకాల అక్రమాల ఆరోపణలు ఎదుర్కొన్న... నోటి దురుసు నేతగా పేరున్న ఒక నాయకుడి కన్ను అక్కడి భూములపై పడింది! అవేమీ... ప్రభుత్వ, పోరంబోకు భూములు కావు! పక్కాగా... పట్టా భూములు! బహిరంగ విలువ పక్కనపెడితే... రిజిస్ట్రేషన్ విలువ కోట్లలో ఉంది. వాటి యాజమాన్య పత్రాలు ట్యాంపర్ (తారుమారు) చేసేసి... ఆ భూములను ఎంచక్కా నొక్కేశారు. నిజానికి... సదరు వైసీపీ కీలక నేత సూర్యారావుపేటలో తన బినామీ పేరిట రెండున్నర ఎకరాల భూమిని దక్కించుకున్నారు. అంతటితో ఆయన ఆశ తీరలేదు. ఆ భూమి చుట్టూ... నాలుగు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న మరో 9 ఎకరాలపైనా

మిగతా 11వ పేజీలో...



11

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు

బీవీ పట్టాభిరామ్ ఇకలేరు!

- గుండెపోటుతో కన్నుమూత
- ఇంద్రజాలికుడు, హిప్నాటిస్ట్, కౌన్సెలర్‌గా అంతర్జాతీయ గుర్తింపు
- 57కు పైగా వ్యక్తిత్వ వికాస రచనలు
- హిప్నాటిజంపై పీహెచ్‌డీ చేసిన తొలి వ్యక్తి
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల మదింపు కమిటీ (ఈఏసీ) తిప్పిపంపడంపై అసంతృప్తిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. ఈ ప్రాజెక్టుపై ముందుకే వెళ్లాలని నిశ్చయించింది. దీని ఆమోదానికి ద్విముఖ వ్యూహాన్ని సిద్ధం చేసింది. వరద జలాలు, అంతర్రాష్ట్ర సమస్యలపై ఈఏసీ లేవనెత్తిన కొర్రీల పరిష్కారానికి.. కేంద్ర పర్యావరణం-అడవులు, జలశక్తి శాఖలకు చెందిన కీలక సంస్థల వద్ద బలమైన వాదనలు వినిపించేందుకు సమాయత్తమవుతోంది. ఇదే సమయంలో కేంద్రం, తెలంగాణ ప్రభుత్వంతో రాజకీయ నాయకత్వాల స్థాయిలో కూడా సంప్రదింపులు కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నెల 10 లేదా 11న ఢిల్లీ వెళ్లి కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నట్లు తెలిసింది. అలాగే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితోనూ భేటీ జరపాలని యోచిస్తున్నారు. ఇంకోవైపు.. రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం సైతం నిశ్చయించింది.

కేంద్రం అభ్యంతరాలు అసంబద్ధం

బనకచర్లకు కొర్రీలపై రాష్ట్రం అసంతృప్తి

- ద్విముఖ వ్యూహంతో ముందుకు.. ఈఏసీకి వరద లెక్కల సమర్పణ
- గోదావరిలో గత 30 ఏళ్లలో కడలిపాలైన నీటి వివరాల సేకరణ
- గతంలో కేసీఆర్, కేంద్రం తీసిన గణాంకాలు కూడా
- చంద్రబాబు ఆదేశం.. కేంద్రం, తెలంగాణతో రాజకీయ చర్చలు
- 10 లేదా 11న కేంద్ర మంత్రులు నిర్మల, పాటిల్‌తో సీఎం భేటీ?
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌తోనూ సంప్రదింపులు!
- ఇద్దరు సీఎంలతో భేటీ ఏర్పాటుకు ఇప్పటికే కేంద్రం నిర్ణయం

14

బీఆర్ఎస్‌ను బతికించుకునేందుకే

బనకచర్ల!

- బాబునూ, నన్నూ భూతంగా చూపే యత్నం
- బనకచర్ల రాచపుండు పెట్టింది కేసీఆరే
- 2016లో అపెక్స్ కౌన్సిల్‌లో ప్రతిపాదించారు
- అసెంబ్లీలో చర్చిద్దాం రండి: టీ-సీఎం రేవంత్

14

పాదయాత్ర చేస్తా

- కడప జిల్లా టూర్ తర్వాత మొదలెడతా..
- వైసీపీ బలోపేతానికి జిల్లాల్లో పర్యటన: జగన్
- యువజన విభాగానికి జోన్ల వారీగా వర్కింగ్ ప్రెసిడెంట్లు

14

సింగయ్య మృతి కేసులో తదుపరి

చర్యలు నిలుపుదల

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- కౌంటర్ దాఖలుకు 2 వారాల గడువు

వల్లభనేని వంశీకి బెయిల్

- నకిలీ ఇళ్ల పట్టాల కేసులో మంజూరు
- నేడు జైలు నుంచి విడుదల?

నందిగం సురేష్ బెయిల్‌పై విడుదల

గుంటూరు జైలులో 40 రోజులుగా రిమాండ్‌లో



మస్క్‌ను అమెరికా నుంచి పంపించేస్తాం!

- ప్రభుత్వ సబ్సిడీలు లేకుంటే మస్క్ తన దుకాణం మూసుకోవాల్సిందే
- తిరిగి దక్షిణాఫ్రికాకు పోవాల్సిందే
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరికలు
- 'సూటిగా చెబుతున్నా.. సబ్సిడీలు వెంటనే తొలగించండి' అంటూ మస్క్ ప్రతి సవాల్
- రిపబ్లికన్ పార్టీని పందుల పార్టీ అంటూ మండిపాటు.. కొత్త పార్టీ పెడతానని వెల్లడి

వాషింగ్టన్, జూలై 1: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు మరింతగా ముదిరాయి. మరోసారి ఒకరిపై ఒకరు బహిరంగంగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకున్నారు. "చరిత్రలోనే ఎవరూ పొందలేనంతగా ఎలాన్ మస్క్ సబ్సిడీలు పొందుతున్నారు. ఈ సబ్సిడీలే లేకుంటే రాకెట్ ప్రయోగాలు

మిగతా 2వ పేజీలో...

ఎన్నికల్లో ఎవరెవరికి ఎన్నికోట్లు పంచారు?

- రాజ్ కసిరెడ్డి వద్ద డబ్బు తీసుకోమన్నది ఎవరు?
- వెంకటేశ్‌నాయుడికి ఈ డబ్బులతో లింకేంటి?
- ముడుపులు దాచిన ఇంటికి మీరెందుకెళ్లారు?
- ఆఫ్రికాలో బిజినెస్ వ్యవహారం ఎంతవరకు వచ్చింది?
- చెవిరెడ్డిపై సిట్ అధికారుల ప్రశ్నల వర్షం
- తెలియదు.. సంబంధం లేదంటూ వైసీపీ నేత దాటవేత
- అధికారులపై చిందులు.. కేకలు వేస్తూ దబాయింపు
- లిక్కర్ వాసన కూడా చూడని వ్యక్తిపై నిందలేస్తారా?
- సంబంధంలేని కేసులు పెడతారా అంటూ అదే పాతపాట



విచారణ ముగిసిన తర్వాత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గత సార్వత్రిక ఎన్నికల్లో ఎవరెవరికి ఎన్నెన్ని కోట్ల మద్యం ముడుపులు పంచారు? లిక్కర్ స్కామ్‌లో ఏ-1 రాజ్ కసిరెడ్డి నుంచి ఎన్ని కోట్లు నగదు రూపంలో తీసుకున్నారు? ఎవరు చెబితే మీరు పంపిన వ్యక్తులకు ఆయన డబ్బులిచ్చారు? గరికపాడు చెక్‌పోస్టు వద్ద

మిగతా 11వ పేజీలో...

పెరిగిన జీఎస్టీ వసూళ్లు

12

- జూన్‌లో రూ.2,591 కోట్ల వసూలు
- తొలి త్రైమాసికం మొత్తం 8,860 కోట్లు



రైలు సేవలన్నీ ఒకేచోట

2

- సరికొత్తగా 'రైల్ వన్' యాప్
- రిజర్వేషన్, ప్లాట్‌ఫాం టికెట్ సహా అన్ని సేవలూ అందుబాటులో

రైలు సేవలన్నీ ఒకే చోట

» సరికొత్తగా 'రైల్ వన్' యాప్

» రిజర్వేషన్, ప్లాట్‌ఫాం టికెట్లు సహా అన్ని సేవలు అందులోనే



న్యూఢిల్లీ, జూలై 1: రైల్వే సేవలను ప్రయాణికులు మరింత సులభం పొందేందుకు వీలుగా ఆ శాఖ సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 'రైల్ వన్' పేరిట రూపొందించిన ఈ యాప్ ద్వారా అన్ని సేవలను ఒకే చోట పొందేందుకు వీలుకలుగుతుంది. టికెట్ల బుకింగ్, రిజర్వేషన్, టికెట్ల రద్దు, ప్లాట్‌ఫాం టికెట్లు, భోజనం సహా ఫిర్యాదులు, సమస్యలు వంటి అన్ని రకాల సేవలు ఈ యాప్‌లో ఒకే చోట అందుబాటులో ఉంటాయి. పీఎన్ఆర్ విచారణ, జర్నీ ప్లానింగ్ వంటివి కూడా ఈ యాప్‌లో ఉంటాయి. ఆండ్రాయిడ్ ఫోన్లు వినియోగించేవారు ప్లే స్టోర్, ఐఓఎస్ యాప్ స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్(సిఆర్ఐఎస్) 40వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. రైల్ వన్ యాప్ వన్ స్టాప్ సొల్యూషన్‌గా ప్రయాణికులకు ఉపయోగపడుతుందని మంత్రి చెప్పారు. ఈ యాప్ ద్వారా టికెట్ రిజర్వేషన్, అన్ రిజర్వ్‌డ్ వివరాలు, ప్లాట్‌ఫాం టికెట్ల కొనుగోలు, పీఎన్ఆర్ ఎంక్వయిరీ, జర్నీ ప్లానింగ్, రైల్వే స్టేషన్లలో బోగీల పొజిషన్, రైలు ప్రయాణ స్థితి, రైలు సహాయ సేవలు, ప్రయాణ సమయంలో మీల్స్ బుకింగ్‌వంటి పలు సేవలను ఒకే వేదిక ద్వారా పొందవచ్చన్నారు. గతంలో పలు సేవలకు వేర్వేరు యాప్‌లు ఉండేవని.. దీంతో వినియోగదారులు అనేక పాస్‌వర్డ్స్, లాగిన్‌లను వినియోగించాల్సి వచ్చేదని, కానీ.. రైల్ వన్‌లో ఒకే లాగిన్, ఒకే పాస్‌వర్డ్‌తో అన్ని సేవలను సులభంగా పొందవచ్చని మంత్రి వైష్ణవ్ వివరించారు. ఈ యాప్‌కు రైల్వే ఈ-వ్యాలెట్‌ను కూడా జోడించినట్టు తెలిపారు. లాగిన్ అయ్యేందుకు బయోమెట్రిక్ సహా 'ఎంపిన్' సౌలభ్యం ఉందన్నారు. 'సూపర్ యాప్'గా ఇది రైలు ప్రయాణికులకు మెరుగైన సేవలను అందిస్తుందని తెలిపారు.

50 కోట్ల చక్కెర డ్రైనేజీ పాలు

» చక్కెర మిల్లు పక్కన ఉన్న డ్రైనేజీ కబ్జా

» భారీ వర్షాలతో ఆ మిల్లులోకి వరద నీళ్లు



న్యూఢిల్లీ, జూలై 1: ఆసియా ఖండంలోనే అతిపెద్ద చక్కెర మిల్లు.. దాని పక్కనే మున్సిపల్ డ్రైనేజీ కాలువ. కాలువ పక్కన స్థలం ఆక్రమణకు పాల్పడటంతో అర్ధరాత్రి కురిసిన వర్షంతో డ్రైనేజీ ఉప్పొంగి.. వరద పోటెత్తడంతో పక్కనే ఉన్న మిల్లు ఆవరణలోని గోదాంలో నిల్వ ఉంచిన పంచదార కరిగిపోయిన ఘటన హరియాణాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీంతో రూ.50 నుంచి రూ.60 కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు చెప్పారు. మిల్లు ఆవరణలోని గోదాంలో నిల్వ ఉంచిన చక్కెరలో 40 శాతం నష్టపోయినట్లేనన్నారు. యమునా నగర్‌లోని సరస్వతి షుగర్ మిల్లులో సుమారు రూ.97 కోట్ల విలువైన 2.20 లక్షల క్వింటాళ్ల చక్కెర నిల్వలున్నాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత కురిసిన భారీ వర్షంతో.. గోదాంలోకి వరద నీరు పోటెత్తిందని షుగర్ మిల్లు జనరల్ మేనేజర్ రాజీవ్ మిశ్రా చెప్పారు. ఇలా జరగడం ఇదే తొలిసారని, పూర్తిగా మిల్లు, గోదాం పరిశీలించిన తర్వాతే ఎంత నష్టం వాటిల్లిందన్న సంగతి తెలుస్తుందన్నారు.

లోకం తీరు



నివాసం ఉన్నచోటే ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

» స్పష్టం చేసిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ, జూలై 1: ప్రజలు తాము ఎక్కడ నివాసం ఉంటున్నారో అక్కడే ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్(సీఈసీ) జ్ఞానేష్ కుమార్ మంగళవారం స్పష్టం చేశారు. తమకు సొంత ఇల్లు వేరే చోట ఉందని అక్కడ ఓటరుగా నమోదు చేసుకోకూడదన్నారు. బిహార్‌లో ఓటర్ల జాబితాలను ప్రత్యేకంగా ముమ్మర తనిఖీ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈమేరకు తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ప్రజలు తాము ఏ అసెంబ్లీ నియోజకవర్గంలో నివాసం ఉంటున్నారో అక్కడ మాత్రమే ఓటుహక్కు పొందాలని తనను కలిసిన బూత్ స్థాయి అధికారులకు సీఈసీ వివరించారు. ఢిల్లీలో నివాసం ఉంటూ పట్నాలో ఇల్లు ఉందని అక్కడ ఓటుహక్కు పొందలేరని పేర్కొన్నారు. ప్రజలు తాము వలస వెళ్లిన చోట ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, కాని పాత నియోజకవర్గంలో ఓటరు కార్డును ఉంచుకోవడం శిక్షార్హమైన నేరమని ఈసీ అధికారులు తెలిపారు.

సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు

న్యూఢిల్లీ, జూలై 1: సుప్రీంకోర్టు ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల్లో తొలిసారిగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్ల విధానం అమలు చేస్తూ కాంపిటెంట్ అథారిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానం జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చినట్టు జూన్ 24న జారీ చేసిన సర్క్యులర్‌లో పేర్కొంది. అభ్యంతరాలు ఉంటే రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావాలని ఉద్యోగులను కోరింది. ఉద్యోగాల్లో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 7.5% రిజర్వేషన్లు అమలవుతాయి. రిజిస్ట్రార్, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్, అసిస్టెంట్ లైబ్రేరియన్, జూనియర్ కోర్టు అసిస్టెంట్, చాంబర్ అటెండెంట్ల పోస్టులకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

హాసన్‌లో హడలెత్తిస్తున్న గుండెపోటు

40 రోజుల్లో 24 మంది మృతి.. ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం హాసన్ జిల్లాలో గుండెపోటు మరణాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గడిచిన 40 రోజుల వ్యవధిలో జిల్లాలో 24 మంది గుండెపోటుతో మృతిచెందారు. తాజాగా మంగళవారం సంజయ్(27) అనే యువకుడు గుండెపోటుతో చనిపోయాడు. హొళెనరసీపుర తాలూకా సోమనహళ్లికి చెందిన సంజయ్, తన మిత్రులతో కలసి పార్టీకి వెళ్లిన సమయంలో సోమవారం సాయంత్రం బీపీ ఎక్కువైంది. ఛాతీలో నొప్పి రావడంతో మిత్రులు స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అంతలోనే సంజయ్ గుండెపోటుతో మృతి చెందాడు. బీపీ ఎక్కువ కావడమే గుండెపోటుకు కారణమని జయదేవ ఆసుపత్రి మాజీ డైరెక్టర్, ఎంపీ మంజునాథ్ తెలిపారు. మధుమేహం, ఆహారశైలి కూడా దీనికి కారణం కావచ్చునని, ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సమీప ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలో వరుసగా గుండెపోటుతో మృతి చెందుతుండడంతో సీఎం సిద్దరామయ్య స్పందించారు. కారణాలను తెలుసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని జయదేవ హృద్రోగ ఆసుపత్రుల డైరెక్టర్ డాక్టర్ రవీంద్రనాథ్‌ను ఆదేశించారు. ఆయన నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి, పదిరోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

మూర్తిదో మాట... ఇన్ఫోసిస్‌ది మరో బాట!

» 70 గంటలు పని చేయాలన్న నారాయణమూర్తి

» ఉద్యోగులు ఓవర్ టైం చేయొద్దంటున్న ఇన్ఫోసిస్

బెంగళూరు, జూలై 1: ప్రపంచ దేశాలతో పోటీ పడాలంటే భారత్‌లోని యువత వారానికి 70 గంటలు పని చేయాలన్న ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఆయన సంస్థ వ్యవహరిస్తోంది. తమ సంస్థలో ఉద్యోగులెవరూ ఓవర్ టైం చేయొద్దని సూచిస్తోంది. ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడంతో పాటు వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ ఉద్యోగులకు ఈ-మెయిల్ పంపుతోంది. వారానికి 5 రోజులు చొప్పున రోజుకు సగటున 9.15 గంటలు మాత్రమే పని చేయాలని అందులో స్పష్టం చేసింది. ఓవర్ టైం చేయడం వల్ల ఆరోగ్య పరంగా ఎదురయ్యే ఇబ్బందులపై అందులో ఆందోళన వ్యక్తం చేసింది. పని మధ్యలో క్రమం తప్పకుండా విరామం తీసుకోవాలని, పని ఒత్తిళ్లు, ఇతరత్రా ఇబ్బందులుంటే వారి మేనేజర్‌ను సంప్రదించాలని సూచించింది. అత్యవసరమైతే తప్ప పని గంటల అనంతరం ఉద్యోగానికి సంబంధించిన విధులు నిర్వహించొద్దని పేర్కొంది. నిర్దేశించిన సమయానికి మించి అదనంగా విధులు నిర్వర్తించే ఉద్యోగులకు హెచ్ఆర్ విభాగం నుంచి ఈ మెయిల్‌ను పంపిస్తున్నారు.

కర్ణాటకలో నాయకత్వ మార్పుపై చర్చలు లేవు

» కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా

బెంగళూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో నాయకత్వ మార్పుపై ఎటువంటి చర్చలు లేవని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా అన్నారు. రెండురోజులుగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో వేర్వేరుగా సుర్జేవాలా భేటీ అవుతున్నారు. నాయకత్వ మార్పుకే ఈ ప్రక్రియ సాగుతోందనే ప్రచారంపై సుర్జేవాలా మంగళవారం మీడియా సమావేశంలో స్పష్టత ఇచ్చారు. కొంత మంది ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య విభేదాలు తలెత్తాయని, దీనికి కారణాలు తెలుసుకునేందుకే వచ్చానని పేర్కొన్నారు. శాసనసభ్యుల అభిప్రాయ సేకరణ అనేది లేదని కొట్టిపారేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీలపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందని నియోజకవర్గాలవారీగా తెలుసుకుంటున్నామని, నియోజకవర్గాల్లో సమస్యలు, ఇచ్చిన హామీలలో పెండింగ్ ఉన్నాయా అనే అంశాల గురించి విచారిస్తున్నామని వివరించారు. 5 గ్యారెంటీలు ఎప్పుడూ రద్దు చేయబోమని తేల్చి చెప్పారు.

థాయ్‌లాండ్ ప్రధానిపై సస్పెన్షన్ వేటు

బ్యాంకాక్, జూలై 1: ఫోన్‌కాల్ లీకైన వ్యవహారంలో థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రాపై సస్పెన్షన్ వేటు పడింది. షినవత్రాను విధుల నుంచి బహిష్కరిస్తూ.. ఆ దేశ రాజ్యాంగ న్యాయస్థానం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దేశ భద్రతకు సంబంధించిన విషయాలను పొరుగు దేశం కాంబోడియా మాజీ ప్రధాని హున్‌సేన్‌తో ఆమె చర్చించడంపై దేశ వ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. వీరి సంభాషణ లీక్ కావడంతో.. ఆమె రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని, నైతిక ప్రమాణాలు పాటించలేదని ఆరోపిస్తూ పదవి నుంచి తొలగించాలని పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ జరిపిన న్యాయస్థానం... 7-2 మెజార్టీతో ఆమెను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ తీర్పునిచ్చింది. రాజ్యాంగ తీర్పును సవాల్ చేస్తూ మరో 15 రోజుల్లోగా షినవత్రా తన వాదనలను వినిపించుకోవాల్సి ఉంటుంది.

సీఆర్పీఎఫ్ ఆధీనంలోనే నాగార్జున సాగర్

నాగార్జునసాగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు భద్రతను ఈ ఏడాది డిసెంబరు 31 వరకు సీఆర్పీఎఫ్ పర్యవేక్షిస్తుందని ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ మల్లికార్జున్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు సాగర్ ప్రాజెక్టు భద్రత ఎస్పీఎఫ్ ఆధీనంలో ఉండేది. ఎన్నికల సమయంలో తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదం తలెత్తడంతో 2023 డిసెంబరు 3 నుంచి సాగర్ ప్రాజెక్టుకు కుడి వైపున(ఏపీ) విశాఖకు చెందిన 234వ సీఆర్పీఫ్ బెటాలియన్, ఎడమ వైపున (తెలంగాణ) ములుగుకు చెందిన 39వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ సిబ్బంది విధులు నిర్వహించేవారు. అయితే ఖర్చు తగ్గించుకునేందుకు 234వ సీఆర్పీఎఫ్ బెటాలియన్‌కే ప్రాజెక్టు భద్రతను అప్పగిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 8న కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఉత్తర్వులు జారీచేసింది.

ఉపాధికి లక్ష కోట్ల ఊతం

రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ఈఎల్ఐ పథకానికి కేంద్ర క్యాబినెట్ పచ్చజెండా

» పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించే ఆర్డీఐ పథకానికీ ఓకే


కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, జూలై 1: వచ్చే రెండేళ్లలో 3.5 కోట్ల ఉద్యోగాల కల్పనకు ఉపకరించే ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి(ఈఎల్ఐ).. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతోపాటు.. 'ఖేలో భారత్ నీతి' పేరిట రూపొందించిన జాతీయ క్రీడా విధానానికి, వ్యూహాత్మక, నూతన రంగాల్లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలను ప్రోత్సహించే 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్'(ఆర్డీఐ) పథకానికి పచ్చజెండా ఊపింది. వీటిలో ఈఎల్ఐ పథకానికి కేంద్రం రూ.99,446 కోట్లు కేటాయించింది. వచ్చే రెండేళ్లలో ఈ పథకం ద్వారా లబ్ధి పొందేవారిలో 1.92 కోట్ల మంది మొదటిసారి ఉద్యోగం చేసేవారే ఉంటారని అంచనా. అన్ని రంగాల్లో ఉద్యోగాల సృష్టి, యువతలో నైపుణ్యాల కల్పన, సామాజిక భద్రతను పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తయారీ రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది. కాగా, ఈ పథకం కింద.. మొదటిసారి ఉద్యోగం చేసేవారు (ఈపీఎఫ్‌లో నమోదైనవారు) రూ.15 వేల గరిష్ఠ పరిమితితో ఒక నెల ఈపీఎఫ్ వేతనాన్ని రెండు విడతలుగా (ఉద్యోగంలో చేరిన ఆర్నెల్లకు తొలి విడత, 12నెలల సర్వీస్, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని పూర్తి చేసుకున్న తర్వాత రెండో విడత మొత్తాన్ని) పొందుతారు. ఆధార్‌తో అనుసంధానమైన చెల్లింపుల విధానం ద్వారా వారికి ఈ మొత్తాన్ని అందజేస్తారు. రూ.లక్ష దాకా జీతం అందుకునే ఉద్యోగులు ఈ ప్రోత్సహకాన్ని అందుకోవడానికి అర్హులు. ఉద్యోగుల్లో పొదుపు చేసే అలవాటును ప్రోత్సహించేందుకుగాను.. ఈ ప్రోత్సాహకాల్లో కొంత భాగాన్ని నిర్ణీత కాలావధికి డిపాజిట్ చేస్తారు. ఆ కాలపరిమితి పూర్తయ్యాక ఉద్యోగి ఆ మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చు. ఇక, యాజమాన్యాలకు విషయానికి వస్తే.. ఈ ప్రోత్సాహకాలను అందుకోవడానికి.. 50 మందిలోపు ఉద్యోగులు ఉండి, ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకున్న సంస్థలు ఏడాదికి అదనంగా ఇద్దరు ఉద్యోగులను.. 50 మంది కన్నా ఎక్కువ ఉద్యోగులు ఉండే కంపెనీలు ఏడాదికి అదనంగా ఐదుగురు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుంది. 2025 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 నడుమ అలా అదనపు ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు (రెండేళ్లపాటు) ఈ ప్రోత్సాహకాలు అందుతాయి. కనీసం ఆరు నెలలపాటు ఉద్యోగులను కొనసాగించే యాజమాన్యాలకు.. ప్రతి అదనపు ఉద్యోగికీ ఇచ్చే జీతం ఆధారంగా నెలకు గరిష్ఠంగా రూ.3 వేల చొప్పున రెండేళ్లపాటు ఇస్తారు. ఉద్యోగి వేతనం రూ.10వేల లోపుంటే నెలకు రూ.1000 చొప్పున, జీతం రూ.10వేల నుంచి 20 వేల లోపు ఉంటే నెలకు రూ.2000 చొప్పున, ఉద్యోగి జీతం రూ.20 వేల నుంచి రూ.లక్షలోపు ఉంటే నెలకు రూ.3000 చొప్పున ఈ ప్రోత్సాహకం ఇస్తారు. తయారీరంగంలో అయితే ఈ ప్రోత్సాహకాలను నాలుగేళ్లపాటు ఇస్తారు. ఇక.. నూతన రంగాల్లో పరిశోధనలు, నవకల్పనలకు ఊతమిచ్చేందుకుగాను రూపొందించిన 'రిసెర్చ్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ (ఆర్డీఐ)' పథకాన్ని రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌తో అమలు చేయనున్నారు. పరిశోధనలు, ఆవిష్కరణల్లో ప్రైవేటు రంగం పెట్టుబడులను ప్రోత్సహించడానికి తక్కువ/సున్నా వడ్డీ రేట్లతో దీర్ఘకాల వ్యవధిలో ఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యం.

వాణిజ్య ఎల్పీజీ ధర రూ.58.5 తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 1: వాణిజ్య అవసరాలకు ఉపయోగించే 19 కేజీల గ్యాస్ బండ ధరను తగ్గిస్తూ ఆయిల్ కంపెనీలు నిర్ణయించాయి. తగ్గింపు ధరలు జూలై 1 నుంచే అమలులోకి వచ్చినట్లు ప్రకటించాయి. ఒక్కో సిలెండరుపై రూ.58.50 తగ్గింది. వాణిజ్య సిలెండర్... 19 కేజీల బండ ధరను రూ.1,665గా కంపెనీలు నిర్ణయించాయి. తాజాగా వాణిజ్య సిలెండర్ ధర విజయవాడలో రూ.1,818.5 కాగా... హైదరాబాద్‌లో రూ.1,886.5గా ఉంది. కాగా, ఢిల్లీలో జీవిత కాలం ముగిసిన పెట్రోలు, డీజిల్ వాహనాలకు 'ఇంధనం లేదు' అంటూ పెట్రోలు బంకుల్లో బోర్డులను ఏర్పాటు చేశారు.

వాయుసేన రన్‌వేనే అమ్మేశారు!


పంజాబ్‌లోని హల్వారా ఎయిర్‌ఫోర్స్‌లోని 15 ఎకరాలను విక్రయించిన తల్లి, కుమారుడు

న్యూఢిల్లీ, జూలై 1: ఓ సినిమాలో రవీంద్ర భారతి, చార్మినార్ తనదేనని చెబుతూ అమ్మకానికి పెట్టి అమాయకుల నుంచి అందినకాడికి వసూలు చేసుకుంటాడో మోసగాడు! పంజాబ్‌లో అచ్చంగా ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. ఓ మహిళ, ఆమె కుమారుడు కలిసి వాయుసేనకు చెందిన ఓ రన్‌వే స్థలాన్ని తెగనమ్మేశారు! కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ తల్లీకొడుకులు ఈ అక్రమానికి పాల్పడటం పంజాబ్‌లో తీవ్ర సంచలనమైంది. నిందితులు పంజాబ్‌లోని డుమినివాలా గ్రామానికి చెందిన ఉషా అన్సాల్, ఆమె కుమారుడు నవీన్ చంద్! పాక్ సరిహద్దులోని ఫట్టువాలా గ్రామ శివారులో గల రక్షణ శాఖ పరిధిలోని 982 ఎకరాల్లో విస్తరించి ఉన్న 'హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్'లోని రన్‌వే స్థలం ఇది! మన మిలటరీకి అత్యంత వ్యూహాత్మక ప్రాంతంగా దీన్ని చెబుతారు. 1939-45 మధ్య రెండో ప్రపంచ యుద్ధంలో ఈ రన్‌వేను బ్రిటిషర్లు ఉపయోగించుకున్నారు. పైగా పొరుగు దేశాలతో 1962, 1965, 1971 జరిగిన యుద్ధాల్లో ఈ రన్‌వేను భారత వాయుసేన అత్యవసర ల్యాండింగ్ కోసం, రక్షణ పరమైన కార్యకలాపాల కోసం ఉపయోగించుకుంది. 1997లో ఉష, నవీన్ కలిసి తప్పుడు పత్రాలు సృష్టించి 15 ఎకరాల మేర విస్తరించి ఉన్న ఈ రన్‌వేను ప్రైవేటు వ్యక్తులకు విక్రయించారు. అప్పట్లోనే నిషాన్ సింగ్ అనే మాజీ రెవెన్యూ ఉద్యోగి ఫిర్యాదు చేయడంతో ఈ భూ కుంభకోణం వెలుగులోకొచ్చింది. అయితే 2021 వరకు అధికారులు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఈ భూకుంభకోణంపై మూడేళ్ల క్రితం హల్వారా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ అధికారులు కూడా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మళ్లీ నిషాన్ సింగే, ఈ భూకుంభకోణంపై పంజాబ్, హరియాణా కోర్టును ఆశ్రయించారు. స్పందించిన కోర్టు.. నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక అందజేయాలంటూ పంజాబ్ విజిలెన్స్ బ్యూరో చీఫ్‌ను ఆదేశించింది. అయితే ఈ ఏడాది మే నెలలోనే ఎయిర్‌ఫోర్స్ భూమిని తిరిగి రక్షణ శాఖకు స్వాధీన పరిచారు.

ప్రాణాలు తీస్తున్న ఒంటరితనం

» కుంగుబాటుకు, ఆత్మహత్య తలంపునకు కారణమవుతున్న ఏకాకి జీవనం

» ప్రతి గంటకూ దాదాపు 100 మంది మృతి



న్యూఢిల్లీ, జూలై 1: చుట్టూ అయినవాళ్లున్నా.. ఏదైనా కష్టం వచ్చినప్పుడు చెప్పుకోవడానికి 'తన' అనుకునేవారు ఒక్కరూ కనిపించని దురదృష్టవంతులు కొందరు! పట్టించుకునేవాళ్లు ఎందరున్నా.. తమను తాము ఒంటరిగా భావించుకునేవారు మరి కొందరు!! పైకి చూడ్డానికి ఇది చాలా చిన్న సమస్యగానే కనిపించవచ్చుగానీ.. ప్రపంచవ్యాప్తంగా ఇది ఒక పెద్ద సమస్యగా మారుతోంది. ఒంటరితనం కుంగుబాటుకు.. ఆపై ఆత్మహత్య ఆలోచనలకు దారి తీస్తోంది. ఇలా ఏటా ప్రపంచవ్యాప్తంగా కొన్ని లక్షల మంది మరణిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన 'కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్' తన తాజా అంతర్జాతీయ నివేదికలో పేర్కొన్న గణాంకాలే ఇందుకు నిదర్శనం. ఆ నివేదిక ప్రకారం..

- ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఆరుగురిలో ఒకరు ఒంటరితనంతో బాధపడుతున్నారు. ఇదే కారణంతో ప్రతి గంటకు దాదాపు 100 మరణాలు.. ఏడాదికి 8.71లక్షల మరణాలు నమోదవుతున్నాయి.
- ఒంటరితనానికి వయసుతో సంబంధం లేదు. దీంతో బాధపడుతున్నవారిలో అన్ని వయసుల వారూ ఉన్నారు. కాకపోతే.. పిల్లలు, వృద్ధులతో పోలిస్తే యువతలో ఈ సంఖ్య ఎక్కువ. వృద్ధుల్లో ప్రతి ముగ్గురిలో ఒకరు, కిశోర ప్రాయంలో ఉన్నవారిలో ప్రతి నలుగురిలో ఒకరు ఒంటరులే.
- ఏకాకి జీవితంతో విసిగిపోతున్నవారి సంఖ్య.. దిగువ, మధ్య ఆదాయ దేశాల్లో ఎక్కువగా ఉంది. అధికాదాయ దేశాల్లో ఒంటరితనం బాధితుల సంఖ్య 11 శాతంగా ఉంటే.. అల్పాదాయ దేశాల్లో ఆ సంఖ్య 24 శాతంగా ఉంది.
- 13 నుంచి 29 ఏళ్లవారిలో ఒంటరితనంతో బాధపడుతున్నవారి సంఖ్య 17 నుంచి 21 శాతంగా ఉంది. టీనేజర్లలో ఈ సమస్య చాలా ఎక్కువ.

విరుగుడు ఏంటి?

ఆరోగ్యం సరిగ్గా లేకపోవడం, ఆదాయం తక్కువగా రావడం, సరైన చదువు లేకపోవడం, ఏకాకి జీవితం.. ఇలా ఒంటరితనానికి పలు కారణాలు ఉంటాయని నివేదిక తెలిపింది. దీనికి విరుగుడు సామాజిక సంబంధాలను పెంచుకోవడమేనని సూచించింది. ఇతరులతో కలవడానికి అసంఖ్యాకమైన అవకాశాలున్న ఈ రోజుల్లో చాలా మంది తమను తాము ఒంటరివ్యక్తులుగా భావించుకుంటున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనోమ్ వ్యాఖ్యానించారు. డబ్ల్యూహెచ్‌వో కమిషన్ ఆన్ సోషల్ కనెక్షన్ సహాధ్యక్షుడు డాక్టర్ వివేక్ మూర్తి కూడా.. ఒంటరితనం అనేది ఈ తరం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా అభివర్ణించారు. 'డిజిటల్‌గా అనుసంధానమైన ఈ ప్రపంచంలో.. చాలామంది యువతీయువకులు తమను తాము ఒంటరి వ్యక్తులుగా భావించుకుంటున్నారు. పెరుగుతున్న టెక్నాలజీని మన బలంగా మార్చుకోవాలి తప్ప బలహీనతగా కాదు. అందుకే.. ప్రభుత్వ విధానాలన్నింటిలోనూ సామాజిక అనుసంధానాన్ని తప్పనిసరి చేయాలి' అని వివరించారు.

ఎగిరే రోబో!

» ఇటలీ శాస్త్రవేత్తల తయారీ

» ఐరన్ కబ్-3గా నామకరణం



పారిస్, జూలై 1: ఒకప్పుడు సినిమాలకు, సైన్స్ నవలలకు మాత్రమే పరిమితమైన రోబోలు.. ఇప్పుడు దైనందిన జీవితంలోకి వచ్చేస్తున్నాయి. వాటిని మరింత అభివృద్ధి పరుస్తూ.. ప్రపంచంలోనే తొలిసారిగా ఎగిరే హ్యూమనాయిడ్ రోబోను తయారు చేశారు ఇటలీ శాస్త్రవేత్తలు. ఇటాలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఈ పరిశోధకులు ఐరన్ కబ్-3 పేరుతో ఈ కొత్త తరహా రోబోను రూపొందించారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ఈ రోబో భూమి మీది నుంచి 50 సెంటీమీటర్ల ఎత్తుకు ఎగిరి అక్కడే కొద్దిసేపు స్థిరంగా ఉంది. 70 కిలోల బరువు ఉండే ఐరన్ కబ్ ముఖం ఒక చిన్నపిల్లాడిలా ఉంటుంది. అందుకే ఆ పేరు. గాలిలో ఎగరటం కోసం రోబోకు నాలుగు జెట్ ఇంజిన్లు అమర్చారు. రెండు ఇంజిన్లు చేతుల కింద ఉంటే.. మరో రెండు రోబో వెనుక భాగంలో ఉన్న జెట్‌ప్యాక్‌లో ఉంటాయి. ఈ ఇంజిన్ల నుంచి వెలువడే బలమైన ఉద్గారాలే రోబోను పైకి లేపుతాయి. ఉద్గారాల వేడిని తట్టుకోవటానికి వీలుగా ఐరన్ కబ్‌కు టైటానియం 'వెన్నెముక'ను అమర్చారు. రోబోకు తాను ఎక్కడ ఉన్నాననేది తెలియటం కోసం దాంట్లో సెన్సర్లను ఏర్పాటు చేశారు. ఇక రోబో కాళ్లు, చేతులు కదల్చటానికి వీలుగా పరిశోధకులు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఆ రోబో తయారీకి రెండేళ్ల సమయం పట్టింది. ఐరన్ కబ్-3ని మరింత అభివృద్ధిపరిచే దిశగా ఇటలీ శాస్త్రవేత్తలు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రకృతి విపత్తుల వేళ సహాయ చర్యల్లో వీటిని ఉపయోగించవచ్చని భావిస్తున్నారు.

మస్క్‌ను అమెరికా నుంచి పంపించేస్తాం!

(మొదటి పేజీ తరువాయి)



ఉండవు, శాటిలైట్లు ఉండవు, ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి ఉండదు. ఎలాన్ మస్క్ తన దుకాణం మూసుకుని సొంత ప్రాంతం దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లిపోవాల్సిందే. అమెరికాకు ఎంతో సంపద మిగులుతుంది" అని ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో పోస్టు పెట్టారు. ప్రభుత్వ ఖర్చులను నియంత్రించే 'డోగె' విభాగం ఎలాన్ మస్క్‌కు అందుతున్న సబ్సిడీల వ్యవహారంపై దృష్టిసారించాలని సూచించారు. 'ట్రంప్‌ను దేశం నుంచి వెళ్లగొట్టే ఆలోచన ఏదైనా ఉందా?' అని మీడియా ప్రశ్నించగా.. 'ఇప్పటికైతే తెలియదు. కానీ ఈ అంశంపై మేం దృష్టిపెట్టాల్సి ఉంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నిజానికి అమెరికా ప్రభుత్వ ఖర్చులను, సబ్సిడీలను తగ్గించేందుకు ఉద్దేశించిన 'బిగ్ బ్యూటీఫుల్ బిల్లు'ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎలాన్ మస్క్.. దానికి మద్దతిచ్చే ప్రజాప్రతినిధుల పదవులు ఊడగొడతానని ఇంతకుముందే హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ఎలాన్ మస్క్ కంపెనీలు టెస్లా, స్పేస్ ఎక్స్‌లకు అందే సబ్సిడీల అంశాన్ని ట్రంప్ లేవనెత్తారు. దీనిపై ఎలాన్ మస్క్ గట్టిగానే సమాధానమిచ్చారు. "నేను సూటిగా చెబుతున్నాను. వెంటనే సబ్సిడీలన్నింటికీ కోత పెట్టేసుకోండి" అని ఎక్స్‌లో పోస్టు చేశారు. తాను కొత్త పార్టీ పెట్టబోతున్నానని మరోసారి ప్రకటించారు. "ఇప్పుడు మన దేశం ఏక పార్టీ పాలన ఉంది. అదో పందుల పార్టీ. ఇప్పుడు దేశంలో ప్రజా సంక్షేమాన్ని నిజంగా పట్టించుకునే కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన సమయం ఆసన్నమైంది" అని మస్క్ పేర్కొన్నారు.

సిగాచి పరిశ్రమ ప్రమాదంలో 41కి చేరిన మృతులు

సంగారెడ్డి ప్రతినిధి, పటాన్‌చెరు, పటాన్‌చెరు రూరల్, దండేపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిగాచి రసాయన పరిశ్రమలో పేలుడు మృతుల సంఖ్య మంగళవారం అర్ధరాత్రి సమయానికి 41కి చేరింది. సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో జరిగిన ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య సోమవారం అర్ధరాత్రి సమయానికే 20కి చేరినట్టు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. శిథిలాల కింద మంగళవారం మరో 16 మృతదేహాలను వెలికితీశారు. మరోవైపు.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారిలో ఐదుగురు చనిపోయినట్లు తెలిసింది. తీవ్రగాయాలతో ఆస్పత్రుల్లో ఉన్న 30 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా.. మరో ఐదుగురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్టు సమాచారం. ఇక.. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడున్నవారిలో 14 మంది ఆచూకీ ఇంతవరకూ తెలియరాలేదు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పరిశ్రమలో పేలుడు తీవ్రతకు కూలిన మూడంతస్తుల భవనం శిథిలాలు తొలగించిన కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. ఇప్పటిదాకా దొరికిన మృతదేహాలను పటాన్‌చెరు ఏరియా ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచారు. వాటిలో ఇప్పటిదాకా 13 మృతదేహాలను గుర్తించగా.. మిగతా మృతదేహాలు ఎవరివో గుర్తించాల్సి ఉంది. గుర్తించలేనంతగా కాలిపోవడంతో ఏ మృతదేహం ఎవరిదో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో అన్ని మృతదేహాలకూ పోస్టుమార్టంతోపాటు డీఎన్ఏ పరీక్షలూ నిర్వహిస్తున్నారు.

ఖరీదైన సీసాలో చీప్ లిక్కర్!

రాష్ట్రంలో నకిలీ మద్యం హల్‌చల్

- ఎక్సైజ్ దాడులతో వెలుగులోకి
- కోనసీమ, పశ్చిమలో కల్తీ దందా
- అనకాపల్లి, కడపల్లోనూ కేసులు
- డిస్టిలరీల నుంచి స్పిరిట్ బయటికి
- దానికి రంగు, నీళ్లు కలిపి అమ్మకాలు
- మూతలు, లేబుళ్లు సొంతగా తయారీ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో నకిలీ మద్యం కలకలం రేపుతోంది. ఇటీవల నిర్వహించిన ఎక్సైజ్ దాడుల్లో పలుచోట్ల నకిలీ మద్యం ముఠాలు పట్టుబడ్డాయి. నాసిరకం మద్యాన్ని ఖరీదైన సీసాల్లో పోసి అమ్ముతూ భారీగా సొమ్ము చేసుకుంటున్న విషయం వెలుగు చూసింది. తాజాగా కోనసీమ జిల్లాలో కల్తీ మద్యం యూనిట్‌పై జరిపిన దాడిలో 1,065 లీటర్ల స్పిరిట్, 125 క్వార్టర్ సీసాలు, నకిలీ మూతలు, లేబుళ్లు పట్టుబడ్డాయి. అలాగే పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో చేసిన దాడిలోనూ స్పిరిట్, గ్లిజరిన్, కరమెల్, సీలింగ్ యంత్రం, ఖాళీ సీసాలు దొరికాయి. అంతకుముందు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో, కడపలో సైతం భారీగా నకిలీ మద్యం దొరికింది. అక్కడ రూ.110 విలువైన క్వార్టర్ సీసాను బెల్టు షాపులో రూ.80కే అమ్ముతుండటంతో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అనంతపురం జిల్లాలోనూ నకిలీ మద్యం అమ్మకాలు సాగుతున్నా అక్కడి అక్రమాలను బయటికి రాకుండా తొక్కిపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి.

ఎలా చేస్తున్నారు?

మద్యం తయారీకి ముడిసరుకు అయిన ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కాహాల్ డిస్టిలరీల మధ్య రవాణా అవుతూ ఉంటుంది. దీనినే స్పిరిట్ అని కూడా పిలుస్తారు. రవాణా సమయంలో లారీల నుంచి వందల లీటర్ల స్పిరిట్ పక్కదారి పడుతోంది. కొన్నిచోట్ల డిస్టిలరీల నుంచే బయటకు వస్తోందన్న అనుమానాలున్నాయి. ఈ విధంగా తీసుకొచ్చిన స్పిరిట్‌లో నీరు, రంగు కలిపి సీసాల్లో పోసి మద్యం తయారుచేస్తున్నారు. స్పిరిట్‌లో 100 శాతం ఆల్కహాల్ ఉంటుంది. నిబంధనల ప్రకారం మన దేశంలో విక్రయించే మద్యంలో 42శాతం మాత్రమే ఆల్కహాల్ ఉండాలి. ఈ శాతం దాటితే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. తగ్గితే వినియోగదారులకు పూర్తిగా మత్తు ఎక్కదు. అందుకే ఆల్కహాల్ కచ్చితంగా 42శాతం ఉండేలా డిస్టిలరీల్లో మద్యం తయారుచేస్తారు. కానీ దొంగతనంగా మద్యాన్ని తయారుచేసేవారు తమకు తోచినంత స్పిరిట్ వాడుతుంటారు. అలాగే స్పిరిట్ ఏ స్థాయిది అయినా ఖరీదైన సీసాల్లో పోసి అమ్ముతుండటంతో వాటిని కొనుగోలు చేస్తున్నవారు మోసపోతున్నారు.

నకిలీ మూతలు, లేబుళ్లతో మాయ

నకిలీ మద్యం తయారీకి స్పిరిట్ తర్వాత అవసరమయ్యేవి మూతలు, లేబుళ్లు. ఖరీదైన బ్రాండ్ల సీసాలను సేకరించి వాటికి సరిపడా మూతలు, లేబుళ్లను అక్రమార్కులు తయారు చేసుకుంటున్నారు. ఆ సీసాలో సొంతగా తయారుచేసిన నాసిరకం మద్యం పోసి ఒరిజినల్ తరహా మూతలు బిగిస్తున్నారు. వాటిపై నకిలీ లేబుళ్లు అతికిస్తున్నారు. వాటిని ఎక్సైజ్ అధికారులు స్కాన్ చేసినా వివరాలేవీ రావు. విజయవాడ, కడప తదితర ప్రాంతాల్లో నకిలీ మూతలు తయారుచేస్తున్నట్లు ఎక్సైజ్ దాడుల్లో గుర్తించారు. నకిలీ మద్యంతో వినియోగదారులు మోసపోవడం సంగతి అటుంచితే ఇది అత్యంత ప్రమాదకరమని అధికార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. డిస్టిలరీలో తయారుచేసిన స్పిరిట్‌తోనే నకిలీ మద్యం తయారు చేస్తున్నప్పటికీ దానిని బ్లెండింగ్ సరిగా చేయకపోతే ప్రాణాంతకంగా మారుతుంది. ఎక్కువ శాతం స్పిరిట్‌ను కలిపి తయారుచేసిన మద్యాన్ని తాగినవారికి తీవ్రమైన అనారోగ్య సమస్యలు వస్తాయి. స్పిరిట్ అనుకొని మరేదైనా కలిపితే అది మరింత ప్రమాదం అవుతుంది. స్పిరిట్‌కు రంగు, వాసన ఉండవు. ఈ కారణంతోనే గతంలో ఇథైల్ ఆల్కహాల్ అని పొరపాటుపడి మిథైల్ ఆల్కహాల్‌తో మద్యం తయారుచేయడం పెద్ద ప్రమాదాలకు దారితీసింది. ఈ తరహా అక్రమాలకు అడ్డుకట్ట వేయకపోతే రాష్ట్రంలో కూడా అవాంఛనీయ ఘటనలు జరిగే ప్రమాదం ఉందని, దానివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందనే వాదన వినిపిస్తోంది.



మల్లన్న స్పర్శ దర్శనానికి వచ్చిన భక్తులు

శ్రీశైలంలో ఉచిత స్పర్శ దర్శనం ప్రారంభం

నంద్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో సామాన్య భక్తులకు మల్లికార్జున స్వామి ఉచిత స్పర్శ దర్శనం మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఉదయం ఆలయ అధికారులు పర్యవేక్షణలో ఉచిత దర్శనం, స్పర్శ దర్శనాలను కల్పించారు. సుమారుగా ఏడాది తరువాత శ్రీశైలంలో ఉచిత స్పర్శ దర్శనం సేవలు ప్రారంభం కావడం విశేషం. గతంలో మాదిరిగా మంగళ, బుధ, గురు, శుక్ర వారాల్లో మధ్యాహ్నం 1:45 గంటల నుంచి 3:45 గంటల వరకు భక్తులకు అనుమతిస్తున్నట్టు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైల మల్లికార్జున స్వామి స్వయంగా స్పర్శించి, ఆధ్యాత్మిక అనుభూతిని ప్రతి భక్తుడు పొందాలనే భక్తుల కోరిక మేరకు కొత్తగా టోకెన్ విధానాన్ని అమలు చేశామన్నారు. అంతేకాకుండా ప్రతిరోజూ ఆఫ్‌లైన్‌లో శ్రీశైలంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా టోకెన్లను జారీ చేస్తామన్నారు. భక్తుడి పేరు, ఆధార్, ఫోన్ నంబర్ నమోదు చేసి టోకెన్లు ఇస్తామన్నారు. స్కానింగ్ చేసిన తర్వాతే ఉచిత దర్శనానికి అనుమతిస్తామని తెలిపారు.


ల్యాండ్ పూలింగ్ స్కీం-2025కు నోటిఫికేషన్

- రాజధాని నగరం మినహా మిగిలిన ప్రాంతంలో అమలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని నగరం అమరావతి మినహా మిగిలిన రాజధాని ప్రాంతంలో భూసమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఏపీ రాజధాని ప్రాంత ల్యాండ్ పూలింగ్ స్కీం-2025 రూల్స్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రజా రాజధాని నిర్మాణానికి అవసరమైన ప్రాజెక్టులు ఎయిర్‌పోర్టులు, పోర్టులు, ఇతర వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద భూసేకరణ యంత్రాంగం అవసరమని సీఆర్‌డీఏ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. భూ యజమానులు, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మధ్య పరస్పర సమన్వయంతో భూసమీకరణ పథకం చేపట్టాలని నిర్ణయించారు. రైతులు లేదా రైతుల బృందం నుంచి భూమిని సమీకరించి అభివృద్ధి చేసేందుకు నిబంధనలు నిర్దేశిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత భూసమీకరణ పథకం(సూత్రీకరణ, అమలు) రూల్స్ 2025ను రూపొందించారు. ఈ నిబంధనలు రాజధాని నగరం మినహా మిగిలిన రాజధాని ప్రాంతంలో ప్రాజెక్టులకు భూమి సమీకరించేందుకు వినియోగిస్తారు. ఆ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి నోటిఫికేషన్ జారీచేసింది.

జూన్‌లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.119.86 కోట్లు

- రోజుకు సగటున 80 వేల మందికి దర్శనం



తిరుమల, జూలై 1(ఆంధ్రజ్యోతి): జూన్ నెలలో తిరుమల శ్రీవారికి భారీగా హుండీ ఆదాయం లభించింది. గత నెలలో 24.08 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీకి రూ.119.86 కోట్లు ఆదాయం వచ్చింది. సగటున రోజుకు 80 వేల మంది స్వామిని దర్శించుకున్నారు. అత్యధికంగా 14వ తేదీన 91,720 మంది శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఐదు రోజులు 90 వేలకు పైగా, పది రోజులు 80 వేల మందికిపైగా శ్రీవారిని దర్శించుకోవడం విశేషం. వేసవి సెలవులు ముగింపునకు రావడంతో ఈ సంఖ్య భారీగా పెరిగిందని అంచనా. ఇక, హుండీ ద్వారా రోజుకు సగటున రూ.4 కోట్ల కానుకలు రాగా, అత్యధికంగా 30వ తేదీన రూ.5.30 కోట్లు లభించింది. అలాగే జూన్‌లో 10.05 లక్షల మంది తలనీలాలు సమర్పించుకున్నారు. అత్యధికంగా 7వ తేదీన 45,068 మంది తలనీలాలు ఇచ్చారు. ఇలా ఉండగా మే నెలలో 23.77 లక్షల మంది శ్రీవారిని దర్శించుకోగా, హుండీ ద్వారా రూ.106.83 కోట్లు లభించింది.

చెత్త తరలించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చెత్త తరలించేందుకు 2,260 ఎలక్ట్రిక్ వాహనాలను సర్వీసు మోడల్ కింద అనుమతిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పట్టణ స్థానిక సంస్థల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేసేందుకు ఒక టన్ను అంత కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన నాలుగు చక్రాల ఎలక్ట్రికల్ వాహనాలను కొనుగోలు చేయనున్నారు. ఈ వాహనాలకు నిర్వహణ వ్యయం ఆయా పట్టణ స్థానిక సంస్థల 15వ ఆర్థిక సంఘం నిధులు లేదా సాధారణ నిధుల నుంచి ఖర్చు చేస్తారు.

శిక్షణపై 'సీత'కన్ను!

దేవదాయ ఉద్యోగులకు నిలిచిన శిక్షణ



- ఐదేళ్ల క్రితం వేల మంది ఉద్యోగులకు 'సీత'లో శిక్షణ
- వైసీపీ అధికారంలోకి వచ్చాక శిక్షణ కేంద్రానికి తాళం
- దేవుడి ఆస్తుల రక్షణలో విఫలమవుతున్నారని ఉద్యోగులపై విమర్శలు
- కొత్త ఏసీలు, గ్రేడ్-3 ఈవోలకు చట్టాలపై అవగాహన శూన్యం
- శిక్షణా కార్యక్రమాల కోసం ఉద్యోగుల డిమాండ్

దుర్గగుడికి ఆదాయానికీ గండి!

కనకదుర్గమ్మ ఆలయానికి చెందిన భవనంలోనే ఈ 'సీత' కార్యాలయం ఏర్పాటు చేశారు. గతంలో ఈ భవనంలో ఉన్న గదలు భక్తులకు అద్దెకు ఇవ్వడం ద్వారా కొంత ఆదాయం వచ్చేది. ఇప్పుడు సీత కార్యాలయం ఉందనే ఉద్దేశంతో భక్తులకు ఇవ్వడం లేదు. అలా అని శిక్షణ కార్యక్రమాలు జరగడం లేదు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ ఆదాయానికి కూడా గండిపడుతోంది. ఇప్పటికైనా ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు మళ్లీ ప్రారంభించాలని ఉద్యోగుల నుంచే డిమాండ్లు వస్తున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

దేవదాయశాఖ ఉద్యోగుల్లో చాలామందికి ఆ శాఖ చట్టాలపైనా, ప్రభుత్వ నిబంధనలపైనా కనీసం అవగాహన కూడా లేదన్న విమర్శలొస్తున్నాయి. అధికారులకు తోచింది అమలు చేస్తున్నారని.. చట్ట నిబంధనలు పరిగణలోకి తీసుకోవడం లేదన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. దీనివల్ల దేవుడి ఆస్తులకు తీవ్ర నష్టం జరగడంతో పాటు ఆలయాల్లో పరిపాలన సక్రమంగా నడవడం లేదు. దీనికి కారణం దేవదాయ శాఖ చట్టం, ప్రభుత్వ నిబంధనలపై ఉన్నతాధికారులు, ఉద్యోగులకు శిక్షణ లేకపోవడమే.

ఉమ్మడి ఏపీలో ఇలా..

ఉమ్మడి ఏపీలో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎంసీహెచ్ఆర్‌డీఐ)లో ఉద్యోగులకు శాఖాపరమైన శిక్షణలు ఇచ్చేవారు. కలెక్టర్ల దగ్గర నుంచి జూనియర్ అసిస్టెంట్ల వరకూ ప్రభుత్వ చట్టాలు, నిబంధనలు, జీవోలపైన శిక్షణ ఇవ్వడంతో పాటు ఆలయాల ఆచార సంప్రదాయాలు, సాంస్కృతిక వారసత్వంతో పాటు ప్రభుత్వంలో ఫైల్స్ ఎలా పెట్టాలన్న దానిపై పూర్తిగా అవగాహన కల్పించేవారు. ఈ శిక్షణల వల్ల ఉద్యోగులకు అవగాహన పెరగడంతో పాటు ప్రభుత్వ పాలన పారదర్శకంగా సాగేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్ర విభజన తర్వాత ఇలాంటి శిక్షణలు చాలా వరకూ తగ్గాయి. 2016-19 మధ్య ఎక్కువగా చట్టాలపై ఉద్యోగులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేవారు. మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల శిక్షణ ప్రస్తావనే లేదు. ముఖ్యంగా దేవదాయ శాఖ విభజన తర్వాత ప్రకాశం బ్యారేజీ సమీపంలోని సీతానగరంలో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెంపుల ఆడ్మినిస్ట్రేషన్(సీత)ను ఏర్పాటు చేసుకుంది. 'సీత' ద్వారా 2016 నుంచి 2019 వరకూ వేల మందికి శిక్షణ ఇచ్చింది. జాయింట్ కమిషనర్ల దగ్గర నుంచి కింద స్థాయి ఉద్యోగుల వరకూ ఇక్కడ శిక్షణ తీసుకునేవారు. గతంలో సీతకు ఒక డైరెక్టర్, కో- ఆర్డినేటర్ ఉండేవారు. వారి పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమాలు జరిగేవి. కొంత కాలంగా ఈ పోస్టుల్లో ఎవరినీ ప్రభుత్వం నియమించ లేదు. గతంలో వేర్వేరు సంస్థల నుంచి ఫ్యాకల్టీని తీసుకువచ్చి శిక్షణలు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి ఈ కార్యాలయానికి తాళం వేశారు. శిక్షణ కార్యక్రమాలు నిలిచిపోవడం వల్ల శాఖలో కొత్తగా వచ్చిన అసిస్టెంట్ కమిషనర్లు, గ్రేడ్-3 ఈవోలకు చట్టంపై కనీస అవగాహన లేదు. ప్రధానంగా జిల్లాల నుంచి ప్రధాన కార్యాలయానికి వచ్చే ఫైల్స్‌లో స్పష్టత లేకపోవడంతో ప్రధాన కార్యాలయం అధికారులు, ఉద్యోగులు వాటిని మళ్లీ మార్పులు, చేర్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిదంటున్నారు. ప్రధానంగా క్షేత్రస్థాయిలో గ్రేడ్-3 ఈవోలు, పదోన్నతుల ద్వారా జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు అయ్యే ఉద్యోగుల దగ్గర నుంచి ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. కొందరు దేవదాయ శాఖ చట్టాన్ని వారికి అనుకూలంగా, నచ్చిన విధంగా మార్చుకుని అమలు చేస్తున్నారన విమర్శలు ఉన్నాయి. దీంతో పాటు ఆంధ్రప్రదేశ్ సంప్రదాయాలు, ఆలయాల ప్రతిష్ఠతలు, సంప్రదాయాల గురించి కూడా ఉద్యోగులు, అర్చకులకు అవగాహన కల్పించే శిక్షణలు కూడా నిలిచిపోయాయి.

పెళ్లయిన రెండు నెలలకే

విషాదాంతం

సిగాచి ఫార్మా పేలుడులో ఏపీ యువజంట మృతి

- కడప జిల్లా అబ్బాయి.. ఎన్టీఆర్ జిల్లా అమ్మాయి
- ఇటీవలే ప్రేమ వివాహం... త్వరలోనే రిసెప్షన్
- విధుల్లో ఉండగా ఇద్దరినీ కబళించిన మృత్యువు



నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య

విజయవాడ (తిరువూరు, విస్సన్నపేట), ముద్దనూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని సిగాచి ఫార్మా ప్లాంట్‌లో సోమవారం జరిగిన పేలుడు ఏపీలో తీవ్ర విషాదం నింపింది. రెండు నెలల క్రితమే ప్రేమించి పెళ్లి చేసుకున్న కడప జిల్లా అబ్బాయి, ఎన్టీఆర్ జిల్లా అమ్మాయి ఈ ప్రమాదంలో ప్రాణాలు విడిచారు. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పెనికెలపాడు గ్రామానికి చెందిన రైతు దంపతులు ప్రసాద్‌రెడ్డి, మాధవికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నిఖిల్ కుమార్‌రెడ్డి (33) కొన్నాళ్లుగా హైదరాబాద్‌లోని సిగాచి ఫార్మా ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అదే ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్న ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన శ్రీరమ్య (23)తో అతనికి స్నేహం కుదిరింది. అది ప్రేమగా మారడంతో రెండు నెలల క్రితమే వారు తిరుపతిలో వివాహం చేసుకున్నాడు. కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో వారు తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆశ్రయించారు. ఆయన వారికి ధైర్యం చెప్పి ఇరు కుటుంబాలనూ ఒప్పించారు. దీంతో ఆషాఢం వెళ్లిన తర్వాత రిసెప్షన్ చేయాలని ఇరుకుటుంబాలు నిర్ణయించాయి. గత నెలలో దంపతులిద్దరూ పెనికెలపాడుకు వచ్చి వెళ్లారు. కాగా, సిగాచి ఫార్మా ప్లాంట్‌లో సోమవారం జరిగిన పేలుడులో నిఖిల్ కుమార్‌రెడ్డి, శ్రీరమ్య ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు.

విధులకు ముందుగా వెళ్లి మృత్యుఒడికి..

ఫార్మా కంపెనీలో ఉదయం పది గంటల షిఫ్టు వెళ్లాల్సిన రమ్యశ్రీ ప్రమాదం జరిగిన రోజు ఉదయం ఐదు గంటల షిఫ్టుకే విధులకు హాజరైంది. అప్పటికే నిఖిల్‌కుమార్‌రెడ్డి విధుల్లో ఉన్నాడు. ప్రమాదంలో ఇద్దరూ సజీవ దహనమవడం ఇరు కుటుంబాల్లోనూ తీవ్ర విషాదం నింపింది.

ప్రజల ఆయుష్షు 85 ఏళ్లకు పెరగాలి

- మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రణాళికలు
- వైద్యులపై దాడులు సరికాదు: మంత్రి సత్యకుమార్



డీఎంఈ డాక్టర్ నరసింహానికి ఉత్తమ డాక్టర్ అవార్డు ప్రదానం చేస్తున్న మంత్రి సత్యకుమార్

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజల సగటు ఆయుష్షును ప్రస్తుతం ఉన్న 71ఏళ్ల నుంచి 85ఏళ్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రసవకాల మాతృ మరణాలను 45 నుంచి ఐదుకు, శిశు మరణాలను 24 నుంచి రెండుకు తగ్గించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి, ప్రజల ఆరోగ్యానికి అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం శ్రమించే వైద్యులను అందరూ గౌరవించాలని కోరారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో వైద్యుల పాత్ర కీలకమని, ఈ దిశగా ప్రజాసేవ పట్ల చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తున్న వైద్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు ఆఖరి క్షణం వరకు శ్రమించే వైద్యులపై దాడులు, జులుం చేయడం సరికాదన్నారు. చికిత్సలో నిర్లక్ష్యం జరిగిందని భావిస్తే ప్రభుత్వం, ఆస్పత్రి యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సిబ్బంది పనితీరుపై నిఘా పెంచామని, ప్రజారోగ్యం విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ నిర్వాకంతో గాడితప్పిన ప్రజారోగ్య రంగాన్ని కూటమి ప్రభుత్వం మొదటి ఏడాది పాలనలో తిరిగి పట్టాలెక్కించిందని వివరించారు. 'జాతీయ వైద్యుల దినోత్సవం' సందర్భంగా వివిధ విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన పది మంది వైద్యులను మంత్రి సత్కరించారు. ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ పద్మశ్రీవాత్సవ, డీఎంఈ, ప్రముఖ శస్త్రచికిత్స వైద్య నిపుణుడు డాక్టర్ నరసింహంకు ఉత్తమ వైద్యులుగా అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీఎంసీ చైర్మన్ శ్రీహరిరావు, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ రాధిక రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



రాధిక, యశ్వంత్‌కు టిఫిన్ బండిని అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

యశ్వంత్ కుటుంబానికి ఆసరా

- స్పందించిన గివింగ్ బ్యాక్ టూ సొసైటీ
- కలెక్టర్ చేతుల మీదుగా టిఫిన్ బండి అందజేత

గుంటూరు(తూర్పు), జూలై 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని వెంకట్రావుపేటకు చెందిన అలవాల యశ్వంత్ అనే బాలుడి కుటుంబానికి మంగళగిరికి చెందిన గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ఆసరాగా నిలిచింది. జీజీహెచ్ వద్ద రైల్వే స్టేషన్ వైపు ఉన్న తమ టిఫిన్ బండిని తొలగించారని, ఆస్పత్రి బయట ఎక్కడైనా కుటుంబానికి జీవనాధారమైన టిఫిన్ బండి పెట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్ నాగలక్ష్మికి యశ్వంత్ అనే పదేళ్ల బాలుడు సోమవారం విజ్ఞప్తి చేశాడు. ఈ ఉదంతంపై మీడియాలో విస్తృత ప్రచారం కావడంతో గివింగ్ బ్యాక్ టూ సొసైటీ స్పందించింది. టిఫిన్ బండి అందజేయాలని నిర్ణయం తీసుకుంది. కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా బాలుడి తల్లి అలవాల రాధికకు మంగళవారం టిఫిన్ బండి అందజేశారు. తమ కుటుంబానికి జీవనోపాధి కల్పించే విధంగా కొత్త టిఫిన్ బండి అందజేసిన గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతినిధులకు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గివింగ్ బ్యాక్ టూ సొసైటీ ప్రతినిధుల సేవా కార్యక్రమాలను అభినందించారు. సేవా భావంతో చేసే కార్యక్రమాలు ఎంతో సంతృప్తినిస్తాయన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వారు సమాజం కోసం తమ సంపాదనలో కొంత భాగాన్ని కేటాయించాలన్నారు. ముఖ్యంగా ఉన్నత కుటుంబాలకు చెందిన వారు దీనిని బాధ్యతగా భావించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలు బాధాకరం

- నియంత్రించేందుకు చర్యలు: తనిఖీ అధికారి జి.విజయలక్ష్మి



విద్యుత్ ప్రమాదాల నియంత్రణకు కరపత్రాలు అందజేస్తున్న విజయలక్ష్మి

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏటా విద్యుత్ ప్రమాదాలు పెరిగి ఆస్తి, ప్రాణ నష్టం జరగడం ఆందోళన కలిగిస్తోందని విద్యుత్ తనిఖీ అధికారి జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. విజయవాడలోని విద్యుత్‌సౌధలో మంగళవారం నిర్వహించిన "విద్యుత్ భద్రతా దినం"లో ఆమె మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగించే ప్రతి ఒక్కరిలో భద్రతపై అవగాహన పెంచడంతో పాటు విద్యుత్ ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియపరచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఏటా జూన్ 26 నుంచి జూలై 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తునామని తెలిపారు. విద్యుత్ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. ప్రతి ఇంటికి ఎర్తింగ్ ఇచ్చినప్పుడు రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లను అమర్చుకోవాలని సూచించారు. ఇళ్లలో వినియోగించే ఇన్వర్టర్లను సరైన గాలి, వెలుతురు తగిలే ప్రాంతంలో ఉంచాలన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని లేదంటే బ్యాటరీ పేలి ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని ఆమె పేర్కొన్నారు. ఇళ్లపై ఏర్పాటుచేసుకునే సౌరవిద్యుత్ పలకలను నియమాలకనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ పంపు సెట్లకు సంబంధించిన మోటార్ స్టార్టర్ల స్విచ్‌ల కోసం ఇనుప బోర్డును ఏర్పాటు చేయకపోవడం మంచిదని తెలిపారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే ప్రయత్నంలో చేతులతో తాకకుండా ఎండు కర్ర, ప్లాస్టిక్ వస్తువులతో తీగలను వేరు చేయాలని చెప్పారు. హైటెన్షన్ విద్యుత్ తీగల కింద భవనాలు నిర్మించొద్దని విజయలక్ష్మి హెచ్చరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

విలువలు కోల్పోతున్న కోల్‌కతా!

బ్రిటిష్ సామ్రాజ్యంలో రెండో మహానగరంగా వర్ధిల్లి నవ భారత జాగృతికి ఆలంబనగా నిలిచిన నాటి కలకత్తా నేడు కోల్‌కతాగా నవ జీవన నిర్మాణ సామర్థ్యాన్ని కోల్పోయి నాగరీక విలువలను నిర్వీర్యపరుస్తోంది. భారతావని మేధో, సాంస్కృతిక, ఆర్థిక హృదయంగా నీరాజనాలు అందుకున్న బెంగాల్ రాజధాని, రాజ్యాధినేత్రి మమతా బెనర్జీ రాజనీతిజ్ఞతకు, ప్రజాహితంలో పథ నిర్దేశకత్వానికి కాకుండా పాలనా అస్తవ్యస్తతకు పదే పదే వార్తల కెక్కుతోంది. ఇందులో తాజా ఘట్టమే దక్షిణ కోల్‌కతాలోని ఒక న్యాయ కళాశాల ప్రాంగణంలో విద్యార్థినిపై పైశాచికత్వం, ఈ అమానుషాన్ని ఆసరాగా చేసుకున్న రాజకీయుల విశృంఖల స్వార్థ క్రీడలు.

దక్షిణ కలకత్తా న్యాయ కళాశాలలో గత నెల 25న మొదటి సంవత్సరం విద్యార్థిని ఒకరిపై మూకుమ్మడి అత్యాచారం జరిగింది. కోల్‌కతా నగరమూ సమస్త బెంగాలీ సమాజమూ ఈ దురాగతానికి దిగ్భ్రాంతి చెందాయి. నగరంలోని ఆర్‌జీ కర్ వైద్యకళాశాలలో యువ డాక్టర్ ఒకరు అత్యాచారం, హత్యకు గురై ఏడాది కూడా కాకముందే న్యాయకళాశాలలో చోటు చేసుకున్న దురాగతం అందరినీ నివ్వెరపరిచింది. ఆగ్రహపరిచింది. ఆందోళనలకు పురిగొల్పింది. పాలక ప్రతిపక్షాలు యథావిధిగా తమ చాణక్యాలు ప్రదర్శిస్తున్నాయి. అందునా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణమిది. నిందితులు పాలక తృణమూల్ కాంగ్రెస్‌తో సంబంధమున్న వారు కావడంతో ముఖ్యమంత్రి మమత రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. బీజేపీ నిజనిర్ధారణ సంఘాన్ని పంపించింది. బెంగాల్ కంచుకోటను జయించేందుకై ఈ ఘటనను పూర్తిగా ఉపయోగించుకునేందుకు ఆ పార్టీ అన్ని విధాల సమయాత్తమవుతోంది.

మన సమాజంలో మహిళలపై హింసాకాండ వ్యవస్థాబద్ధమైనది. దీన్ని నివారించేందుకు చట్టాలు చాలా ఉన్నాయి. అయితే వాటిని అమలుపరచడంలో చిత్తశుద్ధి చూపుతున్నారా? ఈ బాధ్యతా రాహిత్యం కారణంగానే చిన్నారులు, యువతులు, మహిళలపై లైంగిక దాడులకు పాల్పడినవారు శిక్ష నుంచి తప్పించుకోగలుగుతున్నారు. 2012లో సమస్త భారతీయులను కలవరపరిచిన నిర్భయ ఉదంతంతో అత్యాచారాలను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చారు. చిత్రమేమిటంటే ఆ చట్టాలు వచ్చిన తరువాత అత్యాచారాల సంఖ్య మరింతగా పెరిగిపోయింది. శిక్షలకు గురవుతున్న సంబంధిత నేరస్తుల సంఖ్య మాత్రం ఎప్పటిలానే తక్కువగా ఉంటోంది. ఎందుకిలా జరుగుతోంది? ఒక విద్యార్థిని మానహాని భయం లేకుండా విద్యాలయానికి వెళ్ల లేని పరిస్థితికి, ఒక గృహిణి వైద్యం నిమిత్తం నిర్భయంగా ఆసుపత్రికి వెళ్లలేని అగత్యానికి ఎవరు బాధ్యులు? పాలకులేనా? తప్పకుండా. అయితే సమాజానికి నైతిక బాధ్యత లేదూ?

కోల్‌కతాలో దాదాపు ఏడాది క్రితం ఒక ప్రభుత్వాసుపత్రిలో సంభవించిన హత్యాచారం, ఇప్పుడు న్యాయకళాశాలలో చోటుచేసుకున్న దురాగతం రెండిటి వెనుక ప్రభుత్వ పాలనా వైఫల్యమూ, విశాల సమాజ నైతిక దౌర్బల్యమూ ఉన్నాయి. ఒప్పుకుని తీరాల్సిన కఠోర వాస్తవాలివి. ఒక మహిళ ప్రభుత్వాధినేతగా ఉన్న సమాజంలో ఈ ఘోరాలు పదే పదే జరగడమేమిటి? మహిళలు అర్ధరాత్రి పూట స్వేచ్ఛగా బజారులలో తిరగగలిగిన నాడే మనకు నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు అని మహాత్మా గాంధీ అన్నారు. అలా తిరగలేని దుస్థితిని కేవలం ఒక వర్తమాన పరిణామంగానే కాకుండా చారిత్రక కోణంలో కూడా వివేచించవలసి ఉన్నది.

'భారతదేశంలో తొలి ఆధునిక మానవుడు' రామమోహన్ రాయ్ నడయాడిన గడ్డ బెంగాలీ సమాజం. దారుణమైన సతీసహగమన దురాచారాన్ని రూపుమాపేందుకు ఫలవంతమైన కృషి చేసిన మానవతామూర్తి ఆయన. మహిళాభ్యుదయానికి విశేష దోహదం చేసిన రామమోహన్ రాయ్ స్ఫూర్తి కాలానుగుణంగా సమాజ జీవితంలో ప్రతిఫలిస్తుందా? బెంగాలీల అభిమాన ఆట ఫుట్‌బాల్‌ను నడి రాత్రి వీధుల్లో ఆడాలనే బెంగాలీ యువతుల కలలు కలలుగా మిగిలిపోని రోజులు వచ్చేనా? అటువంటి శుభదినాల రాకతో మాత్రమే బెంగాల్ జీవనవాహిని భ్రష్టత్వాన్ని వదిలించుకుని భవ్యత్వాన్ని సంతరించుకుంటుంది. అలా జరగాలన్నదే ప్రతి భారతీయుడి ఆకాంక్ష.

పోలీసులు ఎవరి కోసం పనిచేయాలి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

రాజకీయ నాయకులు చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితుల్లో పోలీసులు ఎన్నో ఒత్తిళ్లకు గురవుతారని, తమ నియంత్రణలో లేని పనులు చేయడం వారికి కత్తి మీద సాములాంటిదని 'ఇండియన్ పోలీస్ జర్నల్' తాజా సంచికలో వచ్చిన ఒక వ్యాసం వ్యాఖ్యానించింది. కేంద్ర హోంశాఖ పరిధిలోని 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్' (బీపీఆర్‌డీ) ఈ జర్నల్‌ను ప్రతి ఆరునెలలకోసారి ప్రచురిస్తుంటుంది. దాదాపు 72 శాతం మంది పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లకు లోనవుతారని, ఏది తప్పో, ఏది ఒప్పో ఆలోచించకుండా పనులు చేయాల్సి ఉంటుందని ఇది పోలీసుల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుందని ఈ వ్యాసకర్తలు రాశారు. పోలీసులు తీసుకునే ప్రతి నిర్ణయమూ ఒక నైతిక యుద్ధంలాగా మారుతుందని, చట్టాన్ని అమలు చేయాలా లేక రాజకీయ ప్రయోజనాలను పరిరక్షించాలా తేల్చుకోలేకపోతారని ఆ వ్యాసరచయితలు తెలిపారు.

'మీరు అయిదు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉంటారు. కాని మేము అంతకంటే ఎక్కువ కాలం బాధ్యతల్లో ఉంటాం. రాజ్యాంగాన్ని కాపాడడం మా విధి' అని ప్రభుత్వాధినేతలకు ధైర్యంగా చెప్పిన అధికారులు సినిమాల్లోనే కాదు, నిజజీవితంలోనూ కనపడక పోరు. రూల్ ఆఫ్ లా, ప్రాథమిక హక్కులను కాపాడేందుకు, రాజకీయ జోక్యాన్ని ఎదుర్కొనేందుకు, దర్యాప్తు నిజాయితీగా కొనసాగిస్తూ ప్రజల మన్ననలు పొందేందుకు ప్రయత్నించిన అధికారులు ఎందరో ఉన్నారు. అదే సమయంలో ఇందుకు విరుద్ధంగా చాలా సందర్భాల్లో పోలీసు అధికారులు పార్టీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తూ అధికార పార్టీ అడుగులకు మడుగులొత్తి అనేక దారుణాలకు పాల్పడిన సందర్భాలు కూడా మనకు ఎదురవుతున్నాయి. ఇవాళ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలువురు ఐపీఎస్, ఇతర పోలీసు అధికారులు గతంలో తాము చేసిన పాపాలకు సస్పెండ్ కావడం, విచారణను ఎదుర్కోవడం, శంకరగిరి మాన్యాలు పట్టడం మొదలైన పరిణామాలు సంభవిస్తున్నాయి.

రాజకీయ ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు, వారిని భయభీతులను చేసేందుకు, మీడియాను నియంత్రించేందుకు, తమ వ్యక్తిగత కోరికలను తీర్చుకునేందుకు అధికార పార్టీ నేతలు పోలీసు యంత్రాంగాన్ని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించుకునే ఉదంతాలు గడచిన పది సంవత్సరాలుగా ఎక్కువైపోయాయి. పార్లమెంట్ సభ్యులనే అరెస్టు చేసి చితకబాదేందుకు, గడచిన ప్రభుత్వాల హయాంలో జరిగిన పాపాలను కప్పిపుచ్చేందుకు, హార్డ్ డిస్కుల వంటి సాక్ష్యాధారాలను మాయం చేసేందుకు కూడా పోలీసులు వెనుకాడలేదు. ఒక వ్యక్తిని అరెస్టు చేసేందుకు అవసరమైన సాధారణ నిబంధనలను కూడా పాటించాలన్న విజ్ఞతను కోల్పోయి రాజకీయ బాస్‌లు చెబితే చాలు, తప్పుడు కేసులు బనాయించే విషయంలో నిర్విచక్షణగా, అత్యుత్సాహంతో వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నవారు చేసే నేరాలను విస్మరిస్తున్నారు. సామాన్యులపై హింసాత్మకంగా వ్యవహరించే పోలీసులు పలుకుబడిగల వారి పట్ల శీత కన్ను వేస్తున్నారు. గ్లోబల్ టార్చర్ ఇండెక్స్ ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘనలో భారత్ ముందువరుసలో స్థానం సంపాదించింది. ప్రజా ప్రయోజనాలకు, సుపరిపాలనకు టెక్నాలజీని ఉపయోగించుకోవాల్సి ఉండగా, దాన్ని పూర్తిగా దుర్వినియోగం చేయడం దేశంలో రోజురోజుకూ ఎక్కువైపోతోంది. రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థలు పూర్తిగా నైతికత కోల్పోతున్నాయన డానికి ఈ సంఘటనలు ప్రత్యక్ష నిదర్శనం.

నిజానికి గతంలో కూడా రాజకీయ ప్రయోజనాలకు పోలీసు యంత్రాంగాన్ని ఉపయోగించుకున్న దాఖలాలు లేకపోలేదు. కాని అత్యంత కీలకమైన పరిస్థితుల్లోనే అలా జరిగేది. 2000లో అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వాన్ని ఇబ్బందుల్లో పెట్టే విధంగా తరుణ్ తేజ్‌పాల్, అనిరుద్ధ్ బహల్ అనే ఇద్దరు జర్నలిస్టులు ఆపరేషన్ వెస్ట్ ఎండ్ పేరుతో కొన్ని సంచలనాత్మక వార్తలు రాశారు. ఈ జర్నలిస్టులు అప్పటి బీజేపీ అధ్యక్షుడు బంగారు లక్ష్మణ్, మరికొందరు ఎన్డీఏ నేతలు, సీనియర్ సైనిక అధికారులపై స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. దీనితో బంగారు లక్ష్మణ్ రాజీనామా చేశారు. వాజపేయి ప్రభుత్వం జవాబు చెప్పుకోలేని పరిస్థితిలో పడింది. ఇదే సమయంలో ఈ కథనాలు రాసిన జర్నలిస్టులను హత్య చేస్తే ఆ పాపం కూడా వాజపేయి ప్రభుత్వంపై పడుతుందని, అంతర్జాతీయంగా సంచలన వార్తగా మారి మొత్తం ప్రభుత్వమే కుప్పకూలిపోతుందని పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ కుట్రపన్నింది. అప్పటికే 1993లో పీవీ హయాంలో ఐఎస్ఐకి ముంబైలో సీరియల్ పేలుళ్లకు పాల్పడిన చరిత్ర ఉంది. దీన్ని నిర్వహించడంలో పాత్ర పోషించిన దావూద్ ఇబ్రహీం లాంటి వారు పాకిస్థాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు. స్టింగ్ ఆపరేషన్ నిర్వహించిన ఇద్దరు జర్నలిస్టులను హత్య చేసే కుట్రలో ఈసారి బిహార్‌కు చెందిన మాఫియా నేత, ఆర్జేడీ పార్లమెంట్ సభ్యుడు షాబుద్దీన్ పాలుపంచుకుంటున్నారన్న విషయం సీబీఐ దృష్టికి వచ్చింది. షాబుద్దీన్ పేరు చెబితే అప్పుడు పోలీసులకే కాదు, అనేకమందికి సింహస్వప్నం. తనను అరెస్టు చేయడానికి వచ్చిన పోలీసులను కొట్టి చంపించిన ఘనుడు షాబుద్దీన్. తనకు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన మెజిస్ట్రేట్‌ను నిండు కోర్టులోనే హతమారుస్తామని హెచ్చరించినవాడు. నీరజ్‌కుమార్ అనే సీబీఐ జాయింట్ డైరెక్టర్ పాట్నా నుంచి ఢిల్లీ వస్తుండగా, షాబుద్దీన్‌ను విమానంలోనే చూశాడు. దీనితో ఢిల్లీలో స్పెషల్ పోలీసులకు వర్తమానం పంపించాడు. విమానం ఢిల్లీ చేరుకోగానే అతడ్ని అరెస్టు చేయాలన్నది నీరజ్ కుమార్ ప్లాన్. విచిత్రమేమంటే ఢిల్లీలో విమానం దిగిన తర్వాత అక్కడ ఢిల్లీ పోలీసులెవరూ కనిపించ లేదు. ఆరా తీస్తే షాబుద్దీన్‌ను ముట్టుకోవద్దని, నీరజ్ కుమార్‌కు సహకరించవద్దని ఢిల్లీలో రాజకీయ పెద్దలు చెప్పినట్లు తేలింది. ఈ విషయం గురించి తన పదవీ విరమణ తర్వాత నీరజ్ కుమార్ 'ఖాకీ ఫైల్స్' అనే పుస్తకంలోనే పూసగుచ్చినట్లు వివరించారు. తన ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు ప్రయత్నించిన షాబుద్దీన్‌ను వాజపేయి ప్రభుత్వం ఎందుకు అరెస్టు చేయకుండా అడ్డుకుంది? బిహార్‌లో అప్పుడున్న ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు స్థానిక రాజకీయనాయకులు షాబుద్దీన్‌తో ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నాలు సాగిస్తున్నారనీ, అదే అతడిని రక్షించిందని నీరజ్ కుమార్ రాశారు. తర్వాతి కాలంలో షాబుద్దీన్ అరెస్టు అయి, తిహార్ జైలులో మరణించాడు. అది వేరే సంగతి.

షాబుద్దీన్ లాంటి ఓ మాఫియా డాన్ అటు ఆర్జేడీ రాజకీయ సమీకరణాలకు, ఇటు బీజేపీ రాజకీయాలకూ కూడా ఉపయోగపడడం, ఈ క్రమంలో పోలీసు అధికారులు నిస్సహాయ స్థితిలో పడడం భారత రాజకీయాల్లో వికృత పరిణామం. పప్పుయాదవ్, ఆనంద్ మోహన్, ముఖ్తార్ అన్సారీ, అతీఖ్ అహ్మద్‌తో పాటు అనేక మంది చట్టసభల్లో రాజ్యమేలారు. తానున్న వేదికపైనే మాఫియాడాన్‌లు ఉన్నారంటూ ఫైజాబాద్‌కు చెందిన బీజేపీ మాజీ ఎంపీ గత ఏడాది ఆ సమావేశాన్ని బహిష్కరించి వార్తల్లో కెక్కారు. యోగి ఆదిత్యనాథ్ హయాంలో యూపీలో అనేకమంది మాఫియాడాన్ లను అంతం చేసినప్పటికీ బీజేపీతో సహా అన్ని రాజకీయ పార్టీలు నేర చరితులకు చట్టసభల్లో స్థానం కల్పించాయని 'అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) తన నివేదికలో వెల్లడించింది. గత లోక్‌సభలో ఎన్నికైన 543 మందిలో 251 మందిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. రాజ్యసభలో 36 శాతం మంది నేరచరితులే. ఇవాళ అనేకమంది నేరచరితులైన రాజకీయనాయకులపై కేసులు ఏళ్లతరబడి కొనసాగేందుకు కేంద్ర సంస్థలు కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. పోలీసు, దర్యాప్తు అధికారులు తమ పనులు తాము చేసేందుకు అనుమతిస్తే ఈ ఆరోపణలకు తావెక్కడుంటుంది?

భారతీయ పోలీసులపై కేవలం 30 శాతం మంది ప్రజలకే విశ్వాసం ఉన్నదని లోక్ నీతి–సీఎస్‌డీఎస్ నిర్వహించిన సర్వేను ఇండియన్ పోలీసు జర్నల్ ఉటంకించింది. దాదాపు 42 శాతం మంది ప్రజలు పోలీసుల నిజాయితీని శంకిస్తున్నారని, పోలీసుల ప్రతి చర్యా ప్రజల దృష్టిని దాటిపోవడం లేదని తెలిపింది. ఈ విషయం తెలిసినందువల్లే అనేకమంది పోలీసులు మానసిక ఒత్తిళ్లకు లోనవుతున్నారని, ఈ క్రమంలో భారతీయ పోలీసుల్లో ఆత్మహత్యలు కూడా పెరిగిపోతున్నాయని ఈ జర్నల్ తెలిపింది. 2021లో 405 మంది పైగా పోలీసులు ఆత్మహత్య చేసుకున్నట్లు జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో రికార్డు చేసింది. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌లలో పోలీసుల ఆత్మహత్యల సంఖ్య ఎక్కువ. 83 శాతం పోలీసులు తమ విధి నిర్వహణలో మానసిక ఆరోగ్య ప్రభావాలకు లోనైనట్లు 2024లో జరిగిన ఒక సర్వే పేర్కొంది. నిరంతర వృత్తిపరమైన ఒత్తిళ్లు, ఆర్థిక కష్టాలు, తమ స్వంత వ్యవస్థ నుంచే మద్దతు లభించకపోవడం ఇందుకు కారణమని ఈ సర్వే తెలిపింది. ఇటీవల ఢిల్లీ పోలీసుల్లో వృత్తిపరమైన ఒత్తిళ్లపై కూడా ఒక సంస్థ శాస్త్రీయంగా సర్వే నిర్వహించింది. సిబ్బంది, వనరుల కొరత, పని పరిస్థితులు, సహచరుల నుండి మద్దతు లేకపోవడం, వ్యక్తిగత, సామాజిక జీవితం కోల్పోవడం, అలిసిపోవడం వల్ల అనేకమంది పోలీసులు ఒత్తిళ్లకు లోనవుతున్నట్లు పేర్కొంది. అత్యధిక శాతం మంది డయాబెటిస్, హైపర్ టెన్షన్ వంటి జబ్బులకు లోనయ్యారని గుర్తించింది.

ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులు సమాజంలో శాంతి భద్రతలను సమర్థంగా కాపాడేలా చూడాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థపై ఉన్నది. ఈ విద్యుక్త ధర్మాన్ని విస్మరించి రాజకీయవేత్తలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకే పోలీసులను ఉపయోగించుకుంటే పోలీసులే కాదు, మొత్తం సమాజం మానసిక ఒత్తిళ్లకు గురికాక తప్పదు. గత కొద్ది సంవత్సరాలుగా చోటు చేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా చూడడం తక్షణ కర్తవ్యం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



ప్రభుత్వ యంత్రాంగంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న పోలీసులు సమాజంలో శాంతి భద్రతలను సమర్థంగా కాపాడేలా చూడాల్సిన బాధ్యత రాజకీయ వ్యవస్థపై ఉన్నది. ఈ విధ్యుక్త ధర్మాన్ని విస్మరించి రాజకీయవేత్తలు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకే వారిని ఉపయోగించుకుంటే పోలీసులే కాదు, మొత్తం సమాజం మానసిక ఒత్తిళ్లకు గురికాక తప్పదు. గత కొద్ది సంవత్సరాలుగా చోటు చేసుకున్న పరిణామాలు పునరావృతం కాకుండా చూడడం తక్షణ కర్తవ్యం.

మరలిపోయిన మనసు మాంత్రికుడు

ఆయన సినీ నటుడు కాదు, రాజకీయ నాయకుడు కాదు, కాని ఆయన్ని వినటానికి వందలాదిగా జనం వస్తారు. నిశ్శబ్దంగా వింటారు. కొందరయితే చిన్న పుస్తకం తెచ్చుకొని చెప్పినవి శ్రద్ధగా రాసుకుంటారు. ఆయనతో సంభాషించటానికి ఉవ్విళ్లూరుతారు. ఆయన మనసుతో మాట్లాడగలిగిన మనిషి, మనసు మర్మాన్ని తెలుసుకున్న మాంత్రికుడు. మాటలతో వైద్యం చేయగల డాక్టర్. ఆయనే బి.వి. పట్టాభిరామ్.

సుమారు మూడు దశాబ్దాల పాటు ఇంద్రజాలికుడిగా, హిప్నాటిస్టుగా, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్‌గా, రచయితగా... తను పని చేసిన ప్రతి రంగం లోనూ అగ్రస్థానంలో నిలిచిన వ్యక్తి పట్టాభిరామ్. ఆయనతో నా ప్రయాణం సుమారు 30 ఏళ్లు. ఈ కాలంలో ప్రతిరోజు కనీసం 15 నిమిషాలు ఆయనతో మాట్లాడేవాడిని. వివిధ సామాజిక అంశాల గురించి చర్చించేవాళ్లం.

మొన్న ఆదివారం వాళ్ల అబ్బాయి, కోడలు, మనవరాళ్లు, భార్య జయగారితో గంటసేపు గడిపాం. "ఈరోజు ఆయన లేడు" అనేది నాకు వెలితిగా అనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలలో కొన్ని లక్షల కుటుంబాల్లో ఆయనకు అభిమానులు ఉన్నారు. తెలుగులో అత్యధిక పాఠకాదరణ కలిగిన రచయితగా సుమారు 25 ఏళ్లుగా ఆయన కొనసాగుతున్నారు.



2002 సెప్టెంబర్‌లో నేను, పట్టాభిరామ్ కలిసి ఢిల్లీ వెళ్లాం. పూర్వ ప్రధాని పీవీ నరసింహారావు ఉదయం అల్పాహారానికి పిలిచారు. ఆయనతో చాలా సమయం సరదాగా గడిపాం. పీవీగారు చిన్న పిల్లాడిలా మ్యాజిక్‌లు చూస్తూ చప్పట్లు కొట్టడం నాకు ఆశ్చర్యం కలిగించింది. పట్టాభిరామ్‌ని పీవీగారు మ్యాజిక్ రహస్యాలు అడిగారు. "అయ్యా, ఇవీ రాజకీయల్లోలాగానే, వ్యూహం ముందే తెలిసిపోతే ఇంద్రజాలికుడు విఫలం అవుతాడు" అని నవ్వుతూ తప్పించుకున్నారు పట్టాభిరామ్. అలాంటిదే మరో సంఘటన: మంగళంపల్లి బాలమురళీకృష్ణ, సిరివెన్నెల సీతారామశాస్త్రి, పట్టాభిరామ్, నేను ఒకరోజు సాయంకాలం కాలక్షేపానికి కూర్చున్నాం. పట్టాభిరామ్ కొన్ని మ్యాజిక్‌లు చేశారు. మంగళంపల్లి, సిరివెన్నెల ఆ మ్యాజిక్‌ల వెనకాల లాజిక్ చెప్పమని పట్టుపట్టారు. దానికి పట్టాభిరామ్ చెప్పిన సమాధానం ఇప్పటికీ నాకు గుర్తుంది: "సంగీతం, సాహిత్యం మీకు ఎంత తెలిస్తే అంతగా ఎంజాయ్ చేస్తారు, మ్యాజిక్ మాత్రం మీకు ఎంత తెలియకపోతే అంత ఎంజాయ్ చేస్తారు" అని తక్కున సమాధానం చెప్పారు. అదే ఆయన సమయస్ఫూర్తి.

> ఆ మ్యాజిక్ వెనక ఉన్న లాజిక్ చెప్పమని బాలమురళీకృష్ణ, సిరివెన్నెల పట్టుపట్టారు. "సంగీతం, సాహిత్యం మీకు ఎంత తెలిస్తే అంతగా ఎంజాయ్ చేస్తారు, మ్యాజిక్ మాత్రం మీకు ఎంత తెలియకపోతే అంత ఎంజాయ్ చేస్తారు" అని తక్కున సమాధానం చెప్పారు పట్టాభిరామ్. అదే ఆయన సమయస్ఫూర్తి.

మ్యాజిక్‌లో ఉండే సమయస్ఫూర్తిని ఆయన కౌన్సిలింగ్‌లోనూ అద్భుతంగా ఉపయోగించేవారు. మా అమ్మాయి శారద సైకాలజీ కౌన్సిలర్. ఆయన దగ్గర కొంతకాలం శిక్షణ తీసుకుంది. తరువాత ఆయనతో కలిసి కొంత ప్రాక్టీస్ కూడా చేసింది. పట్టాభిరామ్ కౌన్సిలింగ్ శైలి సాంప్రదాయికమైంది కాదనీ, ఒక విలక్షణమైన ఆకర్షణ శక్తితో ఆయన తన మాటల్ని ఎదుటివాళ్ల మెదడులోకి జొప్పిస్తారనీ ఆమె చెప్పేది. ఎమెస్కో ప్రచురించిన 'మైండ్ మ్యాజిక్' చరిత్ర సృష్టించినా, 'కష్టపడి చదవొద్దు – ఇష్టపడి చదవండి' లక్షలాది కాపీలు అమ్మినా, ఆయన రచించిన సుమారు 100 పుస్తకాలు ఎంతో విజయవంతమైనా దాని వెనకాల పట్టాభిరామ్ విలక్షణమైన ఆకర్షణ శక్తి ఉంది.

ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి రాధాకృష్ణగారు, పట్టాభిరామ్, నేనూ ఒక సమావేశంలో కలిసాం. "అయ్యా అందరినీ ఇరుకునపెట్టే ప్రశ్నలతో ఇబ్బందిపెట్టే మీరు, పట్టాభిరామ్‌తో 'ఓపెన్ హార్ట్ కార్యక్రమంలో ఆయనకి ఒక్క ఇబ్బందికరమైన ప్రశ్నా వేయలేదు" అన్నాను నేను రాధాకృష్ణగారితో. దానికి సమాధానంగా రాధాకృష్ణగారు, "కొంతమందిని మనం ఇబ్బందిపెట్టకూడదు, వాళ్లను అలా ఉండనివ్వాలి," అంటూ పట్టాభిరామ్ భుజం మీద చేయివేసి దగ్గరికి తీసుకున్న సంఘటన నాకు ఇంకా గుర్తుంది.

పట్టాభిరామ్ వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే చిన్న సంఘటన ఒకటి ఇక్కడ పంచుకోవాలి. అనంతపురంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సుమారు 3000 మందికి పైగా విద్యార్థులు, 300 మందికి పైగా అధ్యాపకులు, సిబ్బంది పట్టాభిరామ్‌ని వినటానికి యూనివర్సిటీ కాన్వొకేషన్ హాల్‌లో గుమిగూడారు. గంటసేపు ఆయన అనర్గళంగా ప్రసంగించారు. అందరూ నిశ్శబ్దంగా విన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రశ్నలు వేసే సమయం ఆసన్నమైంది. ఒక విద్యార్థి లేచి "దేశభక్తి అంటే ఏమిటి?" అని అడిగాడు. ఆయన ఆ కుర్రాణ్ణి ముందు వరుసలోకి వచ్చి కూర్చోమని చెప్పారు. "అందరూ వెళ్లిపోయేదాక ఇక్కడే కూర్చో నీకు సమాధానం చెబుతాను" అన్నారు. సమావేశం ముగిసింది. ఆయన వేదిక దిగి ఆ కుర్రాడి దగ్గరకు వెళ్ళి, "బాబు, అందరూ వెళ్లిపోయారు కదా, ఇప్పుడు ఏం చేద్దాం" అన్నారు. "సర్, నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి?" అని అడిగాడు ఆ కుర్రాడు. "సరే, బయటకు పోతున్నాంగా లైట్లు అన్నీ స్విచ్ ఆఫ్ చేసి రా," అంటూ బయటకు నడిచారు. బయటకు వచ్చిన తర్వాత మళ్లీ ఆ కుర్రాడు అడిగాడు. అప్పుడు పట్టాభిరామ్ అన్నారు గదా: "ఇప్పుడు నువ్వు చేసిన పనే దేశభక్తి అంటే. అందరూ వెళ్లాక చివరికి వెళ్లేవాళ్లు గదిలో లైట్లు ఆర్పివేయటం, రోడ్డు మీద చెత్త పారేయకుండా ఉండటం, ఎక్కడన్నా నీరు వృథాగా పోతుంటే దాని గురించి పట్టించుకోవటం... ఇదే దేశభక్తి. దేశభక్తి అంటే మనం బాధ్యతగా ఉండటం". ఈ మాట చెప్పిన పట్టాభిరామ్ ఇప్పుడు తన బాధ్యతను పూర్తిచేసుకొని తనకున్న శక్తిమేరకు లక్షలాదిమందిలో స్ఫూర్తిని నింపి నిష్క్రమించారు. మన పట్ల, సమాజం పట్ల సానుకూల దృక్పథంతో ఉండటమే ఆయనకు మనం ఇచ్చే నివాళి.

■ 'ఎమెస్కో' విజయ్‌కుమార్

రాష్ట్రానికి విదేశీ విమాన సర్వీసులు ఏవీ?

రాష్ట్రం విడిపోయి పదకొండేళ్ళు అవుతున్నా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి గాని, ఎప్పుడో అంతర్జాతీయ హోదా ఉన్న విశాఖపట్నం విమానాశ్రయానికి గాని, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి గాని కనీసం ఒక్క డైలీ ఇంటర్నేషనల్ ఫ్లైట్ సర్వీస్ తెచ్చుకోలేకపోయాం. రాష్ట్ర రాజధానికి ముఖద్వారంగా ఉండాల్సిన విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కి ఒకే ఒక్క అంతర్జాతీయ విమానం, అది కూడా వారానికి రెండు సార్లు మాత్రమే వస్తుంది. అది కూడా ఎప్పుడు లేట్ అవుతుందో, ఎప్పుడు కేన్సిల్ అవుతుందో తెలియని పరిస్థితి.

2003 వరకు మన దేశంలో ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ అంతర్జాతీయ విమాన సర్వీసులు నడపటానికి పర్మిషన్ లేదు. దేశీయంగా మాత్రమే ఎయిర్ సహారా, ఎయిర్ డెక్కన్, జెట్ ఎయిర్‌వేస్ సర్వీసులు నడిపేవి. కేవలం ఎయిర్ ఇండియా, ఇంకా ఇతర దేశాల విమానాలు మాత్రమే అంతర్జాతీయ సర్వీసులు నడిపేవి. ఆ సమయంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌కి ఎమిరేట్స్ ఫ్లైట్ రప్పించడానికి భగీరథ ప్రయత్నమే చేశారు. 2001లో చంద్రబాబు ఆదేశాలతో దుబాయ్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త దివంగత కోనేరు రాజేంద్ర ప్రసాద్ అక్కడి ఎమిరేట్స్‌కి ఇక్కడ ఎన్డీఏ ప్రభుత్వానికి సమన్వయకర్తగా వ్యవహరించి మూడు నెలల పాటు ఢిల్లీలో మకాం వేసి రోజుకి మూడు సర్వీసుల ఎమిరేట్స్ ఫ్లైట్‌ను హైదరాబాద్‌కి తెచ్చారు. ఇది ఆయన నాతో స్వయంగా చెప్పిన మాట. "కానీ క్రెడిట్ చంద్రబాబుదే!" అని ఆయనే చెప్పారు. జూలై 2, 2001న మొట్టమొదటి ఎమిరేట్స్ ఫ్లైట్ హైదరాబాద్‌లో దిగింది. ఆ తర్వాత ఎన్డీఏ ప్రభుత్వం 'ఓపెన్ స్కై' పాలసీ తీసుకు వచ్చాక 2004 నుండే 'ఇండిగో', 'జెట్', స్పైస్ జెట్ లాంటి ప్రైవేట్ ఎయిర్‌లైన్స్ బయట దేశాలకి నేరుగా విమానాలు నడుపుతున్నాయి. ఇప్పుడు హైదరాబాద్ నుంచి సగటున రోజుకి 2500 మంది కేవలం దుబాయ్ ఫ్లైట్స్‌లోనే ట్రావెల్ చేస్తారు. అందులో సగం ఆంధ్రా, రాయలసీమ వాళ్ళే. వీళ్ళంతా కేవలం గల్ఫ్ వరకూ మాత్రమే ప్రయాణించేవారు కాదు, అక్కడి నుండి అమెరికా, ఐరోపా దేశాలకి కనెక్టింగ్ ఫ్లైట్స్‌లో వెళ్ళేవారు కూడా ఉంటారు.



'ఓపెన్ స్కై' పాలసీ లేని రోజుల్లోనే బేగంపేటకు వంటి చిన్న ఎయిర్‌పోర్టుకు మూడు నెలల్లోనే వేరే దేశం ఎయిర్‌లైన్స్ నుంచి విమాన సర్వీసులను రప్పించగలిగిన చంద్రబాబు తలచుకుంటే విజయవాడ ఎయిర్‌పోర్టుకూ విమాన సర్వీసులు సాధించగలరు. 2014లో గెలిచిన కొద్ది కాలంలోనే విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కి అంతర్జాతీయ హోదా తీసుకొచ్చి, సింగపూర్‌కి ఫ్లైట్ సాధించారు. పాత టెర్మినల్ పక్కనే కొత్త టెర్మినల్ వెంటనే నిర్మించారు. రన్‌వేని పెద్ద విమానాలు దిగేందుకు వీలుగా విస్తరించారు. వెంటనే మరో పెద్ద ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌కి శంకుస్థాపన చేశారు. కానీ ఆ నిర్మాణం మందకొడిగా సాగుతోంది. తరువాత వచ్చిన ప్రభుత్వం ఉన్న ఒక్క సింగపూర్ సర్వీస్‌ని రద్దు చేసింది. పైగా నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ విషయంలో కూడా పట్టనట్లుగా వ్యవహరించింది. ఇప్పుడు కేవలం ఒక ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లైట్ మాత్రం వారానికి రెండు సార్లు విజయవాడ నుండి షార్జాకి వెళుతోంది. ఈ సర్వీసు కూడా షార్జా వరకే పరిమితం, అక్కడి నుండి ఎటువంటి కనెక్టింగ్ ఫ్లైట్ ఉండదు. ఇప్పుడు ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది, విమానయాన శాఖ మంత్రిగా సొంత పార్టీ ఎంపీ రామ్మోహన్ నాయుడు ఉన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ మీద అమితమైన శ్రద్ధతో త్వరితగతిన నిర్మాణం అయ్యేలా పర్యవేక్షిస్తున్నారు. మంచిదే. కానీ రాష్ట్ర రాజధానికి అవసరమైన అత్యంత కీలకమైన విజయవాడ ఎయిర్‌పోర్ట్‌కి అంతర్జాతీయ సర్వీసులు తీసుకురావటం మీద మాత్రం అంత ఫోకస్ చేస్తున్నట్లు కనిపించటం లేదు. ఎప్పుడో పూర్తయ్యే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ కోసం చూడకుండా ఉన్న వనరులతోనే అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉన్నా ఆ దిశగా ప్రయత్నాలు సాగటం లేదు.

ఇటీవల ఎమిరేట్స్ ప్రతినిధులు వచ్చి నూతన టెర్మినల్‌నూ, రన్‌వేనూ సర్వే చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కాని ఎమిరేట్స్ లాంటి పెద్ద సర్వీసులు అంత సులువుగా కొత్త సర్వీసులు ప్రారంభించవు. ఇప్పుడు వాళ్ళ దగ్గర ఉన్నవన్నీ బోయింగ్ 777 విమానాలే. అందులో 350–400 మంది సీటింగ్ కెపాసిటీ ఉంటుంది. వయబిలిటీ చూసుకున్నా అంత సులువుగా రావటం కష్టమే. ఇండిగో, స్పైస్ జెట్ విస్తారంగా నడిపే 180 సీట్ల విమానాలు ఇప్పుడు విజయవాడలో ఉన్న సౌకర్యాలతో దేశీయ స్థానాలకి నడుస్తున్నాయి.

ఎప్పుడో పూర్తయ్యే ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ కోసం ఎదురు చూడకుండా, ఆ తర్వాత మరెప్పుడో వచ్చే ఎమిరేట్స్ విమాన సర్వీసు కోసం ఎదురు చూడకుండా ఏదైనా ప్రైవేట్ సంస్థ విమానాలు ముందుగా గల్ఫ్ దేశాలకి నడిపితే వెంటనే మనకి అంతర్జాతీయ కనెక్టివిటీ వస్తుంది. ప్రస్తుతం ఉన్న వనరులతో ముందు సర్వీసులని ప్రారంభించి కనెక్టివిటీ సాధిస్తే, దానికి సమాంతరంగా ఇంటిగ్రేటెడ్ టెర్మినల్‌ని పూర్తి చేసుకుంటూ భవిష్యత్తులో పెద్ద విమాన సర్వీసులను ప్రారంభించవచ్చు.

◆ రాజేష్ వేమూరి

పోలవరం పునరావాసం కాగితాలకే పరిమితమా!?

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు సుమారు అయిదు లక్షల మందిలో మూడు లక్షల మంది ఆదివాసులే! ప్రాజెక్టు రాకముందు వరకూ వారికి ఇదేమిటో ఏమాత్రం తెలియదు. తమ గ్రామాలు, అడవులు, నదులు, వాగులు... మొత్తంగా తమ జీవన ప్రపంచంలో నుంచే వారు హఠాత్తుగా గెంటివేయబడినారు.

ప్రాజెక్టు ప్రారంభమై ఇరవయ్యేళ్ళు గడిచాయి. ఒక లక్ష ఆరు వేల కుటుంబాలలో కేవలం 13వేల కుటుంబాలకే కాగితాలపై పునరావాసం కల్పించారు. వీరిలో కూడా కొందరికి ఆర్ అండ్ ఆర్ (రీహాబిలిటేషన్ & రీసెటిల్మెంట్) పరిహారాలు అందితే, కొందరికి వాళ్ళ ఇళ్ళ నష్ట పరిహారాలు కూడా అందలేదు. కత్తెనపల్లి గ్రామంలో 70 కుటుంబాల్లో ఏ ఒక్కరికీ ఇళ్ళకు నష్టపరిహారం కానీ, ఆర్ అండ్ ఆర్ పరిహారం కానీ ఈ రోజుకూ అందలేదు. కొండమొదలు పంచాయితీకి చెందిన నేలదోనెలపాడు ఆర్ అండ్ ఆర్ కాలనీ లోని మొత్తం 500 కుటుంబాలలో 87 మందికి అన్ని అర్హతలు ఉన్నా నష్టపరిహారాలు, ఆర్ అండ్ ఆర్ పరిహారాలు అందలేదు. వారి వారి గ్రామాల నుంచి ఖాళీ చేయించడానికి అధికారులు ఎన్నో మాయ మాటలు చెప్పారు. "మీరు ముందు ఖాళీ చేయండి, మీ డబ్బులు మీకు పడతాయ"నో చెప్పారు. బలవంతంగా ప్రజలను తరలించారు. గ్రామాలకు కరెంటు సరఫరా నిలిపివేసారు. రేషన్ ఆపివేసారు, వైద్య సహాయకులను గ్రామాలకు వెళ్ళకుండా ఆపివేసారు. ఆదివాసులు ఖాళీ చేసి వచ్చాక ఇప్పుడు– "పోర్టల్ ఓపెన్ కావడం లేదు. అది ఓపెన్ అయినప్పుడు మీకు డబ్బులు పడతా"యనో చెప్తున్నారు.



చివరకు తమ భూములను, తమ అడవినీ కోల్పోయిన ఆదివాసులు ఈ కాలనీలలోకి వచ్చారు. దున్ను కోవడానికి భూమిలేదు. అడవి లేదు, కూలి పనులు తప్ప మార్గం లేదు. వీరంతా ఇప్పుడు తీవ్ర శ్రమదోపిడీకి గురౌతున్నారు. మహిళలు అర్ధరాత్రి పనుల కోసం చాలా దూరాలు ప్రయాణించి మరలా సాయంత్రాలకు ఇళ్ళకు చేరుతున్నారు. అక్కడా కూలీ ఎగవేతలు జరుగుతున్నాయి. నిరాశ నిస్పృహలతో తాగుడుకు బానిసలవుతున్నారు. పునరావాస కాలనీలలోకి తరలించే వరకూ ప్రతి ఆదివాసీ కుటుంబమూ రైతు కుటుంబమే. ఆదివాసులను రైతు జీవితం నుంచి తొలగించి వారిని చౌక కూలీలుగా మార్చడమే ఇప్పుడు పునరావాసంలో వెల్లడవుతున్న అసలు నీతి!

ఆదివాసులకు భూమే ఆత్మవిశ్వాసం. వారి భూమి హక్కులు కాలరాచే ప్రయత్నాలు జరుగుతున్నప్పుడు, 2015లో హైకోర్టుకు వెళ్ళి స్టే తెచ్చుకొన్నారు. అధికారులు "మీరు కేసులు వెనక్కి తీసుకొంటే మీ భూములు 426 ఎకరాలు కొనుగోలు చేసి అప్పగిస్తాం" అని చెప్పారు. దీనికోసం ఒక అవగాహనపూర్వక ఒప్పందం (ఎం.ఓ.యూ) చేసుకొందామని చెప్పారు. మీరు ఇదే విషయంగా, హైకోర్టులో చెపితే మేము అంగీకరిస్తామని ఆదివాసులు చెప్పారు. అలా 22–6–2017న ప్రభుత్వం వారితో ఒక ఎం.ఓ.యు.ను కుదుర్చుకుంది. చెప్పిన విధంగానే ఆదివాసులు హైకోర్టులోని నాలుగు కేసులను ఉపసంహరించుకొన్నారు. ఇది జరిగి ఎనిమిదేళ్ళు అవుతున్నా, భూములలో ఒక్క సెంటు కూడా ఈ రోజుకూ ఆదివాసులకు ఇవ్వలేదు. అయినా ఆదివాసులు, వారి నాయకులు నిరంతరం గిరిజన సంఘ నాయకత్వాన పోరాడుతూనే వస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వం భూములకు నోటిఫికేషన్లు ఇచ్చింది. భూముల కొనుగోలు కోసం రూ.43కోట్లు కేటాయించింది. 426 ఎకరాలలో 167 ఎకరాలు ఇప్పటికే సేకరించింది. కానీ ఈ తొలకరి నాటికి మొదటి విడతగా ఈ భూములనైనా ఇమ్మని ఆదివాసులు కోరుతున్నారు.

పంచాయతీ కేంద్రానికి 2కి.మీ.లో దూరంలో ఉండి, 500మందికి పైగా ఓటర్లు ఉన్న ఆదివాసీ గూడేలను ప్రత్యేక పంచాయితీలుగా గుర్తించాలన్న జి.ఓ. ఎం.ఎస్.63 ప్రకారం కొండమొదలు పెదకాలని (నేలదోనెలపాడు), పెదభీంపల్లి – 3 కాలనీ తదితర కాలనీలను ప్రత్యేక ఆదివాసీ పంచాయితీలుగా వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి. ఇప్పుడు ఒక పంచాయితీ లోని గ్రామాలు దూరంగా విడిపోయాయి. వాటికి నిధులను ప్రభుత్వం కేటాయించనందున తీవ్రమైన ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. ఆ విధంగా ప్రత్యేక పంచాయితీలు ఏర్పరచాలని అక్టోబరు 2024 లోనే గ్రామసభలు తీర్మానాలు చేసి పంపాయి. కనుక జీవో 63ను అమలు చేయాలి. పోలవరం నిర్వాసితుల కష్టాలు, బాధలు లోతైనవి. ఆదివాసీలలో ఒక తెగ తమ పూర్తి ఉనికిని కోల్పోయిన తీవ్రమైన సంక్షోభం ఇది. భూమి, వనరులపై జీవించే అవకాశం ఆదివాసుల జీవితాలకు కీలకం. పోలవరం నిర్వాసితుల మౌలిక సమస్యను అర్థం చేసుకొని, దాన్ని పరిష్కరించేలా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలి.

• సింహాద్రి ఝాన్సీ
ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం అధ్యక్షులు

చెదిరిన కలలు

హైదరాబాద్‌లోని సిగాచి ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

ప్రేమ వివాహం చేసుకున్న నవ దంపతులు దుర్మరణం

పుత్రేలలో విషాదం ● కంటతడి పెట్టుకున్న ఎమ్మెల్యే కొలికపూడి

వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు కష్టపడి చదువుకున్నారు. పీజీ పట్టాలు అందుకుని ఫార్మా కంపెనీలో కొలువులు సాధించారు. విధుల్లో ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. జీవితాంతం ఒక్కటిగా ఉండాలని భావించారు. పెద్దల అనుమతితో పెళ్లి పీటలు ఎక్కాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కొద్దిరోజుల కిందటే తిరుపతిలో వివాహం చేసుకున్నారు. తిరువూరు ఎమ్మెల్యే చొరవతో చివరకు పెద్దలను ఒప్పించారు. ఆషాఢం తర్వాత విందు కార్యక్రమాలు అనుకోవడంతో ఆనందంగా ఉన్నారు. వీరి ఆనందాన్ని తెలంగాణలోని పాశమైలారంలో సిగాచి ఫార్మా కంపెనీలో జరిగిన అగ్ని ప్రమాదం ఆవిరి చేసింది. నవ దంపతులను పొట్టన పెట్టుకుంది. ఇరు కుటుంబాల్లో విషాదం నింపింది.

విజయవాడ/తిరువూరు/విస్సన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుత్రేల దక్షిణ మాలపల్లికి చెందిన శ్రీరమ్య, కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నికిల్‌రెడ్డి ఫార్మా కంపెనీ మంటల్లో మరణించారు. శ్రీరమ్య తల్లిదండ్రులు రామాల నారయ్య, పద్మ దంపతులు వ్యవసాయ కూలీలు. పెద్దకుమార్తె జోత్స్న భర్తతో కలిసి హైదరాబాద్‌లో ఉంటోంది. చిన్న కుమార్తె శ్రీరమ్య తిరుపతిలోని పద్మావతి యూనివర్సిటీలో ఎమ్మెస్సీ పూర్తి చేసింది. హైదరాబాద్‌కు వెళ్లి సిగాచి ఫార్మా కంపెనీలో ఉద్యోగం సంపాదించింది.



ఎమ్మెల్యే కొలికపూడి దంపతులతో శ్రీరమ్య, నిఖిల్‌రెడ్డి (ఫైల్)





విలపిస్తున్న శ్రీరమ్య తల్లిదండ్రులు

విధుల్లో కలిసిన మనసులు

కడప జిల్లా జమ్మలమడుగుకు చెందిన నిఖిల్‌రెడ్డి ఎమ్మెస్సీ చేసి ఇదే కంపెనీలో కెమిస్ట్‌గా చేరాడు. శ్రీరమ్య, అతడు కలిసి ల్యాబ్‌లో పనిచేసేవారు. అలా పెరిగిన పరిచయం ప్రేమగా మారింది. కలిసి పనిచేస్తున్న ఇద్దరూ వివాహ జీవితంలోనూ కలిసే ఉండాలని నిర్ణయించుకున్నారు. ఇద్దరూ తల్లిదండ్రులను ఒప్పించి ఒక్కటవ్వాలని భావించారు. ఈ ప్రేమ విషయాన్ని ఇద్దరూ వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీనికి ఇద్దరు తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఎప్పటికీ అంగీకరించబోమని తేల్చి చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలియని ఇద్దరూ చివరికి పెద్దల నిర్ణయాన్ని వ్యతిరేకించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. తిరుపతిలో కొద్దిరోజుల క్రితమే పెళ్లి చేసుకున్నారు. అక్కడి నుంచే తాము పెళ్లి చేసుకున్నామన్న విషయాన్ని ఇంట్లో పెద్దలకు ఫోన్ ద్వారా చెప్పారు. ఆ తర్వాత అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ వెళ్లిపోయారు.

తిరువూరు ఎమ్మెల్యే చొరవతో ఒప్పుకున్న తల్లిదండ్రులు

పెద్దల నిర్ణయాన్ని ఎదిరించి పెళ్లి చేసుకోవడంతో గొడవలు జరిగే అవకాశం ఉందని భావించిన నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య అక్కడే ఉంటున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును ఆశ్రయించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో ఉంటున్న ఆయన ఇంటికి వెళ్లి జరిగిన విషయం చెప్పారు. ఎమ్మెల్యే దంపతులు నవ జంటకు నూతన వస్త్రాలను బహూకరించారు. తర్వాత నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య మిగతా 6లో..

చీకట్లో చకచకా!

జక్కంపూడి వడ్లకొండపై గ్రావెల్ మాఫియా కన్ను

- రాత్రి వేళ యథేచ్ఛగా తవ్వకాలు
- లారీల్లో భారీగా గ్రావెల్ తరలింపు
- అడ్డుకున్న స్థానికులు.. లెక్కచేయని అక్రమార్కులు
- జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



జక్కంపూడి వడ్లకొండ వద్ద తవ్వకాలు

జక్కంపూడిలో మళ్లీ అక్రమ తవ్వకాలు ఆరంభమయ్యాయి. వడ్లకొండను రాత్రికి రాత్రే గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు తవ్వేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తవ్వుకున్న మాఫియానే మళ్లీ రంగంలోకి దిగి లారీల్లో భారీగా గ్రావెల్‌ను తరలించుకుపోతోంది. స్థానికులు అడ్డుకున్న లెక్కచేయకుండా ముందుకు సాగుతోంది. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్‌ను కలిసి గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి గ్రామంలోని సర్వే నెంబర్ 88లో వడ్లకొండ ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వడ్లకొండను అక్రమార్కులు మిగతా 6లో..

జ్యోతిషం చూసి పెట్టుబడి

ఏజెంట్ల ద్వారా వచ్చిన డబ్బులను ఎందులో పెట్టుబడిగా పెట్టాలి? ఏ తిథులు కలిసి వస్తాయి? ఏ ఘడియలు నోట్లకట్లను మన మెట్లు ఎక్కిస్తాయి? ఇలా జ్యోతిషం చెప్పించుకోవడానికి అద్విక ట్రేడింగ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఎండీ తాడేపల్లి శ్రీవెంకట ఆదిత్య ప్రత్యేకంగా జ్యోతిష్కురాలిని నియమించుకున్నాడు. తిథులు, వర్జ్యాలు చూసి ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలి అని భవిష్యవాణిని వినిపించిన ఆమెకు కోట్లాది రూపాయలను చెల్లించినట్టు తెలిసింది.

అద్విక మోసంలో వెలుగులో మరో ఘట్టం

- జ్యోతిషం కోసం ప్రత్యేకంగా సలహాదారు
- ఓ మహిళను నియమించుకున్న ఆదిత్య
- జ్యోతిషం చెప్పినందుకు రూ.కోట్లలో చెల్లింపు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : విజయవాడ ఎన్టీఆర్ కాలనీ ఈఎస్ఐ రోడ్డులో అద్విక ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేసిన తర్వాత ఆదిత్య తన కార్యాలయంలో మహిళా సిబ్బందిని దండిగానే నియమించుకున్నాడు. ట్రేడింగ్‌కు సంబంధించిన సలహాల కోసం లబ్బీపేటకు చెందిన కీర్తిని సలహాదారురాలిగా నియమించుకున్న విషయం తెలిసిందే. ఆమెకు నెలకు రూ.20లక్షల వరకు జీతం ఇచ్చాడు. ఆదిత్యకు సెంటిమెంట్ చాలా ఎక్కువ. ఏ పని ప్రారంభించినా బలమైన మంచి ఘడియలను చూసుకుంటాడు. ఏజెంట్లు, ఖాతాదారులు పెరిగే సరికి ఆదిత్య బాగా బిజీ అయిపోయాడు. ఈ నేపథ్యంలో ఖాతాదారుల ద్వారా వచ్చిన డబ్బులను ఏ సమయంలో, ఏ తిథిలో మరో రంగంలో పెట్టాలో ఎప్పటికప్పుడు తెలియజేయడానికి ఒక మహిళా జ్యోతిషురాలిని ప్రత్యేకంగా నియమించుకున్నాడు.

సొంతంగా చెప్తే కలిసిరాదని...

అద్విక కార్యాలయంలో సిబ్బంది వివరాలు, వారికి చేసిన చెల్లింపుల గురించి పోలీసులు ఆరా తీస్తున్న సమయంలో జ్యోతిష్కురాలి జాతకం బయటపడింది. అద్విక కార్యాలయం ప్రారంభం నుంచి ఆమె ఇక్కడ పనిచేసినట్టు గుర్తించారు. చివరికి ఖాతాదారులకు, ఏజెంట్లకు చెల్లింపులను బకాయి పెట్టిన ఆదిత్య ఆమెకు మాత్రం నోట్ల కట్టలను చేతిలో పెట్టాడు. పోలీసులు ప్రశ్నించినప్పుడు ఆమె చెప్పిన సమాధానాలకు షాక్ తిన్నారు. స్టాక్ మార్కెట్లో షేర్ల కొనుగోలు, అమ్మకాలు, ఇతర రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆమె ముహూర్తాలను నిర్ణయించేది. ఆదిత్య జాతక చక్రాన్ని దగ్గర పెట్టుకుని ఈ ముహూర్తాలు నిర్ణయించింది. ఆమెకు నెలకు లక్షల్లోనే జీతం ఇచ్చినట్టు తెలిసింది. ఇలా ఆమెకు రూ.2-3 కోట్ల వరకు చెల్లించినట్టు సమాచారం. ఇంత మొత్తంలో వేతనం తీసుకోవడం కంటే సొంతంగా జ్యోతిష్యం చెప్తే ఇంకా ఎక్కువ సంపాదించవచ్చు కదా అని పోలీసులు ప్రశ్నించారు. ఎదుటి వారి నుంచి డబ్బులు తీసుకుని జ్యోతిషం చెప్పకూడదని ఒట్టు పెట్టుకున్నట్టు పోలీసులకు వివరించింది. నెలనెల జీతం తీసుకుని మాత్రమే జ్యోతిష్యం చెప్పాలని నిర్ణయించుకున్నట్టు స్పష్టం చేసింది. ఈ సమాధానంతో పోలీసులకు ఏం చేయాలో తోచలేదు.

ప్రహసనం..!

ఇరిగేషన్ కృష్ణా ఈస్టన్ కార్యాలయం తరలింపులో తీవ్ర జాప్యం

- గుడివాడలోని డీఈ కార్యాలయం వద్ద సిద్ధమైన ఈఈ కార్యాలయ భవనాలు
- విజయవాడ నుంచి కదిలేందుకు ససేమిరా అంటున్న ఉద్యోగులు
- దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న రైతులు, నీటి సంఘాలు

ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్టన్ కార్యాలయం బెజవాడ నుంచి గుడివాడ తరలింపు ప్రక్రియ ప్రహసనంగా నడుస్తోంది. రాష్ట్ర విభజన సమయంలో చేసుకున్న తీర్మానం అమలుకు నోచుకోవడలేదు. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఆగిపోయిన ఉద్యోగులు నేడు నూతన భవనాలు సిద్ధమైనా అడుగు ముందుకు వేయడంలేదు. విజయవాడను వదిలి వెళ్లేందుకు సిద్ధపడటంలేదు. దీంతో రైతులు, నీటి సంఘాలు దశాబ్ద కాలంగా కార్యాలయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.



కొత్తగా నిర్మించిన భవనం

(ఆంధ్రజ్యోతి, గుడివాడ): కృష్ణా తూర్పు విభాగం పరిధిలోని రైవస్ కాలువ పూర్తిగా గుడివాడ పరిసరాల గుండా వెళ్తోంది. పక్కనే ఉన్న గన్నవరం నియోజకవర్గం గుండా ఏలూరు కాలువ వెళ్తోంది. ఈ రెండు కాలువల పర్యవేక్షణ చేయాల్సిన కృష్ణా ఈస్టన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఈఈ కార్యాలయం విజయవాడలో కొనసాగుతోంది. ఈ క్రమంలో గుడివాడ డీఈ కార్యాలయ పరిధిలో ఈఈ కార్యాలయం కార్యకలాపాల కోసం కోట్లాది రూపాయలు నిధులు వెచ్చించి నూతన భవనాలను నిర్మించారు. రైవస్, ఏలూరు కాలువల పరిధిలోని నీటి సంఘాలు, రైతులు గతంలో పలుమార్లు ఇరిగేషన్ ఎస్ఈ, అప్పటి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును కలిసి కృష్ణా ఈస్టన్ కార్యాలయం గుడివాడలో ఏర్పాటు చేయాలని వినతిపత్రాలు మిగతా 6లో..

రైతులకు ఎంతో మేలు

కేఈ డివిజన్ కార్యాలయం గుడివాడకు తరలిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పటివరకు రైతులు, రైతు సంఘాలు, నీటి సంఘాల సభ్యులు ఈఈతో పని ఉంటే విజయవాడ వెళ్లాల్సి వస్తోంది. గుడివాడకు కార్యాలయాన్ని తరలిస్తే రైతులకు, నీటి సంఘాల సభ్యులకు డబ్బుతో పాటు సమయం కూడా ఆదా అవుతుంది. పనులు కూడా వేగంగా జరుగుతాయి.

ముందుకురాని ఉద్యోగులు

రాష్ట్ర విభజనకు ముందు నుంచే ఇరిగేషన్ ఈఈ కార్యాలయ ఉద్యోగులు విజయవాడలో పాతుకుపోవడంతో గుడివాడకు తరలివెళ్లేందుకు సుముఖత చూపడం లేదు. దాదాపుగా 70 మంది వరకు ఉద్యోగులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా విజయవాడ, చుట్టూ పక్కల్లోనే నివాసముంటున్నారు. గుడివాడలో ఈఈ కార్యాలయానికి అవసరమైన భవనాలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడికి కార్యాలయాన్ని తరలిస్తే ఉద్యోగులంతా గుడివాడకు రావాలి, లేదంటే రోజు విజయవాడ నుంచి గుడివాడకు సర్వీస్ చేయాలి. అందుకే కార్యాలయ తరలింపును అడ్డుకుంటున్నారని ఉద్యోగ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

మంటగలిసిన మానవత్వం

ఆస్తుల కోసం అనుబంధాలను మరచి హత్యలకు దిగుతున్నారు. అల్లారు ముద్దుగా పెంచిన బిడ్డలు వ్యసనాలకు బానిసలైతే చూసి తట్టుకోలేక కన్నతండ్రులే కడతేరుస్తున్నారు. మానవత్వం మంటగలిసే ఇలాంటి ఘటనలు ఎన్టీఆర్ జిల్లాలో మంగళవారం రెండు చోట్ల వెలుగుచూశాయి.

ఆస్తి కోసం వృద్ధురాలి దారుణ హత్య

- పట్టపగలు కర్రతో కొట్టి పెట్రోల్ పోసి నిప్పు
- మనమడి పనే అని అనుమానం!
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు



హైమావతి మృతదేహం



హైమావతి (ఫైల్)

జి.కొండూరు, జులై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెవుటూరు గ్రామానికి చెందిన ఉమ్మడి హైమావతి (70) దారుణ హత్యకు గురైంది. రోజులానే పొలానికి గేదెలు తోలుకెళ్లిన ఆ వృద్ధురాలికి ఇదే ఆఖరు రోజు అవుతుంది అనుకోలేదు. గేదెలు తోలుతున్న ఆమెను ఒక వ్యక్తి కర్రతో తలపై బలంగా కొట్టి పెట్రోల్ పోసి నిప్పు పెట్టడంతో కాలిపోతూ కనిపించింది. కొద్ది సేపటికి అక్కడకు చుట్టు పక్కల వారు, పోలీసులు వచ్చి కాలుతున్న ఆమెపై దుప్పటి కప్పి మంటలను ఆర్పేశారు. మనుమడే ఈపని చేసి ఉంటాడని పోలీసులతో పాటు పలువురు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఆస్తి విభేదాలే కారణమా!

ఉమ్మడి చలపతిరావు - హైమావతి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు. వీరికి 2 ఎకరాలు మెట్ట, ఎకరన్నర మాగాణి, ఒక భవనం, 50 సెంట్ల ఖాళీ దొడ్డి, కొంత నగదు ఉంది. పిల్లల పెళ్లిళ్లకు రెండెకరాలు మెట్టను అమ్మేశారు. పెద్ద కుమారుడు శివ సత్యేంద్ర కుమార్‌కు హైమావతి తన తమ్ముడు కుమార్తె (మేనకోడలు)ను ఇచ్చి పెళ్లి చేసింది. వీరికి ఒక కుమారుడు వేణు (20), ఒక పాప ఉన్నారు. రెండో కుమారుడు శివకి సొంత కుమార్తె కూతుర్ని ఇచ్చి పెళ్లి చేసింది. వారికి ఒక కుమారుడు. ఈ క్రమంలో కుటుంబంలో గొడవల కారణంగా పెద్ద కుమారుడు భార్య పుట్టిల్లు అయిన కంచికచర్ల మండలం పరిటాల వెళ్లి స్థిరపడిపోయాడు. చిన్న కుమారుడు శివ కామెర్ల వ్యాధితో ఈ మధ్యే చనిపోయాడు. పెద్ద కుమారుడు శివసత్యేంద్రకుమార్‌కు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో కన్నుపోయింది. కాలు, చేతులు దెబ్బతినడంతో మంచానికే పరిమితమయ్యాడు. పెద్దకుమారుడి కొడుకు వేణు ఏసీ మెకానిక్‌గా పని చేస్తూ చెల్లిని చదివిస్తున్నాడు. ఈ క్రమంలో గతవారం క్రితం చెవుటూరులో ఉన్న తన తాత చలపతిరావు, నానమ్మ హైమావతిలతో మాట్లాడి ఆస్తి పంపకాలు చేయాలని ఇంట్లో చాలా మిగతా 6లో..

కన్నతండ్రే కడతేర్చాడు

వ్యసనాలకు బానిసైన కొడుకు

- పిల్లలతో పుట్టింటికి వెళ్లిపోయిన కోడలు
- మద్యం కోసం తల్లిదండ్రులతో గొడవ
- కట్టెతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి



ఘటనా స్థలంలో మృతుడు వెంకట నారాయణ



నిందితుడు గోళ్ల కృష్ణ

జగ్గయ్యపేట రూరల్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కన్న కొడుకును తండ్రి కట్టెతో తలపై మోది హత్య చేసిన ఘటన మండలంలోని షేర్‌మహ్మద్‌పేట గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. గ్రామానికి చెందిన గోళ్ల కృష్ణ చిన్న కుమారుడు వెంకట నారాయణ (35) కొంత కాలంగా దుర్వ్యసనాలకు బానిసై తల్లిదండ్రులు, భార్యాపిల్లలపై అమానుషంగా ప్రవర్తిస్తుండటంతో విసుగు చెందిన భార్య తన ఇద్దరు పిల్లలతో నాలుగేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. లారీ డ్రైవర్, మిగతా 6లో..



పేరుకుపోయిన బూడిద నిల్వలు

చిత్తశుద్ధి ఏదీ?



ఎన్టీటీపీఎస్ బూడిద

- కృష్ణమ్మ చెంతనే ఉన్నా తప్పని నీటి కష్టాలు
- నిర్వహణ లోపం.. అధికారుల నిర్లక్ష్యం
- ఏటా మురిగిపోతున్న రూ. కోట్ల నిధులు
- ఫిల్టర్ బెడ్‌లోకి ఎన్టీటీపీఎస్ బూడిద అవశేషాలు
- పైపులైన్ లీకులతో భారీగా నీరు వృథా
- కార్మికులకు రెండు మాసాలుగా అందని వేతనాలు

కృష్ణమ్మ చెంతనే ఉన్నా ఇక్కడి ప్రజలకు తాగు నీటి కష్టాలు తప్పడంలేదు. ఓపక్క రాజధాని అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నా అమరావతికి అత్యంత చేరువలోని నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన కృష్ణా జలాలు అందడం లేదు. తాగునీటి శుద్ధిలో ఇక్కడి అధికారులకు చిత్త శుద్ధి కొరవడటంతో ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యానికి ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)

కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యుఎస్) అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలయ్యే ప్రమాదం పొంచి ఉంది. కలుషిత బారినుంచి తాగునీటి శుద్ధికి నిధులు పుష్కలంగా ఉన్నా అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్ల అవి ఏటా మురిగిపోతున్నాయి. దీంతో 104 ఆవాస ప్రాంతాలకు స్వచ్ఛమైన కృష్ణా జలాల సరఫరా ప్రహసనంగా మారింది. కలుషిత నీటిని తాగలేక ప్రజలు మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు.

104 గ్రామాలకు తప్పని నీటి కష్టాలు


ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్‌లో శుద్ధి చేసిన కృష్ణా జలాలు మైలవరం నియోజకవర్గంలోని కొండపల్లి మున్సిపాలిటీతో పాటు 104 గ్రామాల ప్రజలకు ప్రతి రోజు సరఫరా అవుతుంటాయి. ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్ నుంచి కృష్ణాజలాలను సమీపంలో ఉన్న ఫిల్టర్‌కు మళ్లించి అక్కడ శుద్ధి చేసి ప్రజలకు అందిస్తారు. అయితే ఇక్కడే పెద్ద లోపం జరుగుతుంది. ఎన్టీటీపీఎస్ నుంచి వస్తున్న బూడిద నీరు కూలింగ్ కెనాల్‌లో కలుస్తుంది. దాని దిగువ భాగం నుంచి ఫిల్టర్ బెడ్‌కు తాగునీటిని మళ్లిస్తున్నారు. ఈక్రమంలో తాగునీటిలో బూడిద చేరడంతో ఫిల్టర్ బెడ్స్ సైతం బూడిదతో నిండి పోతున్నాయి. దీంతో తాగునీటి శుద్ధి ప్రహసనంగా మారుతోంది. ఎంత శుద్ధి చేసినా తాగునీటిలో బూడిద అవశేషాలు మిగిలి ఉంటున్నాయి. ఈ క్రమంలో కృష్ణా జలాలు వాటి సహజసిద్ధ రుచినే కోల్పోయాయి. అధికారుల నిర్లక్ష్యంతో తాగునీటి శుద్ధి అంతంత మాత్రంగానే ఉంటోంది. దీంతో ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతున్నది. మరోపక్క పైపులైన్లకు లీకులు ఏర్పడి వాటిని సకాలంలో సరిచేకపోవడం వల్ల నీరు వృథాగా పోతోంది.



ఫిల్టర్ బెడ్



తాగునీటి శుద్ధి ప్లాంట్



నీటి పైప్‌లైన్లు

ఏటా మురిగిపోతున్న రూ.2 కోట్ల నిధులు!

గ్రామీణ రక్షిత మంచినీటి పథకం సవ్యంగా అమలు చేసేందుకు ప్రతి ఏటా రూ.4.5 కోట్ల నిధులు మంజూరు చేస్తారు. వాటితో ఫిల్టర్‌బెడ్ మెయింటినెన్స్, పైపులైన్ మరమ్మతులు, ఇతర పనులు నిర్వహిస్తారు. అయితే అధికారులు పూర్తి స్థాయిలో నిధులను ఖర్చు చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో ఏటా రూ.2 కోట్ల వరకు మెయింటెనెన్స్ నిధులు మురిగిపోతున్నాయి. 2023-24లో చేసిన పనులకు ఇప్పటి వరకు ఎస్టిమేట్స్ వేయలేదంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతో అర్థం చేసుకోవచ్చు.

కూలింగ్ కెనాల్ ఎగువ భాగం నుంచి నీరు తీసుకోవాలి

ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో ప్లాంట్ నుంచి వచ్చి బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఫిల్టర్ బెడ్‌లోకి ఎగువ భాగం నుంచి నీరు తీసుకుంటే తాగునీటిలో బూడిద అవశేషాలు కలిసే అవకాశం ఉండదు. ఇందుకు కోట్ల రూపాయాలు ఖర్చవుతుంది. దీనిపై ఎన్టీటీపీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పైపులైన్ మార్చి కూలింగ్ కెనాల్‌లో బూడిద నీరు కలిసే దిగువ భాగం నుంచి కాకుండా ఎగువ భాగం నుంచి తాగునీరు ఫిల్టర్ బెడ్‌కు మళ్లించుకునే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కార్మికులకు అందని వేతనాలు

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో పనిచేసే కార్మికులకు మూడు మాసాలుగా వేతనాలు అందడం లేదు. కాంట్రాక్టు సంస్థ కింద పనిచేసే కార్మికులకు సకాలంలో వేతనాలు అందక వారు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. కాంట్రాక్టర్‌కు కార్మిక యూనియన్ నోటీసులు ఇవ్వడం జరిగింది. కార్మికులు బంద్ పాటిస్తే 104 గ్రామాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచి పోయే ప్రమాదం లేకపోలేదు.



జి.కొండూరులో వృథాగా పోతున్న నీరు

వృథాగా పోతున్న నీరు

ఇబ్రహీంపట్నం ఫిల్టర్ బెడ్ నుంచి మైలవరం నియోజకవర్గం వరకు వేసిన తాగునీటి పైపులైన్‌కు పలుచోట్ల లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. అయినా ఏ ఒక్క అధికారి స్పందించకపోవడం గమనార్హం. జి.కొండూరు పులివాగు వంతెన పక్కన కొత్తూరు గొల్లగూడెం వెళ్లే రహదారి పక్కన పైప్‌లైన్‌ల లీకుతో గతేడాది నుంచి భారీగా నీరు వృథా అవుతోంది. ఇప్పటి వరకు దానిని సరి చేయించే నాథుడు లేడు.

గొల్లపూడి ఈఎన్‌సీలో ఆలస్యం!

గ్రామీణ రక్షిత మంచి నీటి సరఫరా పథకం సవ్యంగా అమలు కాకపోవడానికి.. ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందక పోవడానికి గొల్లపూడిలో ఉన్న ఈఎన్‌సీ కార్యాలయంలో సిబ్బంది నిర్లక్ష్యమే కారణంగా తెలుస్తున్నది. చేసిన మెయింటినెన్స్ పనులకు సకాలంలో ఎస్టిమేట్స్ వేసి బిల్లులు చెల్లిస్తే అటు కాంట్రాక్టు సంస్థకు బిల్లులు అందడంతో పాటు కొత్త పనులు చేపట్టే వీలుంటుంది. ఇటు కార్మికులకు, సిబ్బందికి వేతనాలు సకాలంలో చెల్లించవచ్చు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి లోపాన్ని సరి చేసి శుద్ధిచేసిన స్వచ్ఛమైన కృష్ణాజలాలను ప్రజలకు అందించాలని పలువురు కోరుతున్నారు.


నిధులు మిగులుతాయ్..

ఏటా స్కీమ్ మెయింటినెన్స్‌కు రూ.4.5 కోట్లు జనాభా ప్రాతిపదికన నిధులు వస్తాయి. నీరు ఇచ్చే ప్రాతిపదికన ఖర్చులుంటాయి. ఈ క్రమంలో ఏటా రూ.2 కోట్లకు పైగా నిధులు ప్రభుత్వానికే మిగులుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారమే నిధులు ఇస్తున్నారు. అయితే ఈ 14 ఏళ్లలో కొండపల్లి మున్సిపాలిటీతో కలిసి మైలవరం నియోజకవర్గంలోని 104 ఆవాస ప్రాంతాల్లో జనాభా భారీగా పెరిగింది. ఒక మనిషికి సగటున 55 లీటర్లు మాత్రమే ఇస్తున్నారు. అత్యధిక గ్రామాల్లో ఫ్లోరైడ్, సాల్ట్ వాటరే ప్రజలు దిక్కవుతుంది. ఈ క్రమంలో మనిషికి సగటున 80 లీటర్ల వరకు కృష్ణా జలాలు అవసరం ఉంది. మెయింటినెన్స్‌కు వచ్చే నిధులు మిగిల్చి మురగబెట్టే బదులు నీటి విడుదల పెంచితే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

- ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈఈ దయానంద్



అమ్మవారికి సారె సమర్పించిన మహిళా భక్తులు



దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పించిన భక్తబృందాలు

ఇంద్రకీలాద్రి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తబృందాలు తరలివచ్చాయి. మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్త బృందాలు సారె సమర్పణ చేశాయి. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాటుకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఈవో వీకే శీనానాయక్ అధికారులను ఆదేశించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం మహామండపం 6వ అంతస్తులో భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై ఉపాలయంలో వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి లీలా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్వామి వారికి షష్టి తిథి జన్మతిథి రోజున విశేష అర్చనలు చేస్తారు. ఈ క్రమంలో కల్యాణోత్సవాన్ని కూడా నిర్వహిస్తున్నారు. భక్తుల ఈతిబాధలు, గ్రహ బాధలు తొలగటానికి, వివాహాది శుభకార్యాల కోసం సుబ్రహ్మణ్యస్వామి ఆరాధన మేలు చేకూరుస్తుందని చెబుతారు. మంగళవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం మేళ తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, వల్లీ దేవసేనలను వధూవరులుగా వేదికపై ఉంచి కల్యాణాన్ని జరిపించారు.

వారాహి నవరాత్రుల ప్రత్యేక పూజలు



ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జూన్ 26 నుంచి వారాహి గుప్తనవరాత్రుల పూజలు జరుగుతున్నాయి. అనుష్ఠానపరులు, దేవీ ఉపాసకులు ప్రత్యేకంగా పూజలను నిర్వహిస్తున్నారు. వారాహి అమ్మవారిని పూజించటం ద్వారా పంటలు సమృద్ధిగా పండి రైతులు, భక్తులు సంతోషంగా వర్ధిల్లుతారని పండితులు చెబుతున్నారు. యాగశాలలో మంగళవారం ఉదయం అమ్మవారికి పంచ వారాహి మంత్రములతో జప, హోమాలు శాస్త్రోక్తంగా ఏకాంతసేవలు నిర్వహించారు. 4న శుక్రవారం పూర్ణాహుతి, వారాహి నవరాత్రి ఉత్సవాల సమాప్తి జరుగుతుందని ఈవో శీనానాయక్ తెలిపారు.



మాధవ్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఏఈవో

దుర్గమ్మను దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

ఇంద్రకీలాద్రి: ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పి.వి.ఎన్.మాధవ్ కుటుంబసమేతంగా మంగళవారం దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వారికి వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మాధవ్‌కు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ ఉత్తమ్ చంద్ బండారీతోపాటు పలువురు నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పొట్టి శ్రీహరి, నాయకులు సీకూ సింగ్, తదితరులు ఉన్నారు.

మంచిని ప్రచారం చేద్దాం : బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో ప్రజలకు చేసిన మంచిని పార్టీశ్రేణులు ప్రచారం చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పోరంకి పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఎమెల్యే మాట్లాడారు. సుపరిపాలనలో తొలిఅడుగు సమిష్టిగా కష్టపడి పనిచేస్తేనే సాధ్యమైందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తు.. అన్ని వ్యవస్థలను గాడిన పెడుతున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, లోకేష్‌లకు దక్కుతుందన్నారు.



ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులు

వైద్య విద్యార్థుల అరెస్ట్

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో వైద్య విద్యనభ్యసించి రాష్ట్రంలో ఇంటర్న్‌షిప్ చేసిన తమకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ పర్మినెంట్ సర్టిఫికేట్ ఇవ్వకుండా తిప్పిస్తున్నారని వైద్య విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ యూనివర్సిటీ ఎదుట రెండురోజులగా నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యవిద్యార్థులను పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. ఇంటర్న్‌షిప్ పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా సర్టిఫికేట్ ఇవ్వడానికి ఎందుకు విముఖత చూపుతున్నారో అర్థం కావడం లేదని వారు వాపోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేష్‌కు తమ సమస్యను చెప్పినప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలికను గర్భవతిని చేసిన కేసులో..

20 ఏళ్ల జైలు, రూ.15 వేల జరిమానా

విజయవాడ లీగల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలతో బాలికను లొంగదీసుకుని గర్భవతిని చేసిన కేసులో నిందితుడిపై నేరం రుజువుకావడంతో 20 సంవత్సరాల జైలుశిక్ష, రూ.15 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వి.భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం స్టేషన్ పరిధిలో ఫిర్యాది కుటుంబంతో కలిసి నివసిస్తోంది. ఫిర్యాది భర్త అనారోగ్యంతో చనిపోవడంతో అప్పటి నుంచి ఆమె కుమారుడు, కూతురుతో కలిసి ఉంటోంది. ఆమె హోటల్‌లో పనిచేస్తుంటుంది. ఈ క్రమంలో సదరు బాలికకు నెలసరి రావడంలేదని ఆసుపత్రిలో చూపించగా బాలిక గర్భవతి అని వైద్యులు చెప్పడంతో బాలికను నిలదీయగా పదో తరగతి చదివే సమయంలో ఆటోడ్రైవర్ యడవల్లి కార్తీక్ పరిచయమై ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవంతంగా లొంగదీసుకొన్నట్టు తల్లికి చెప్పింది. బాలిక తల్లి కార్తీక్‌ను పిలిచి అడుగ్గా బాబు పుట్టాక ఇంటిలో చెప్పి ఒప్పిస్తానంటూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినట్టు, బాబు పుట్టిన తర్వాత ఫోన్ స్విచాఫ్ చేసినట్టు బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడి గురించి విచారించగా అప్పటికే అతడికి పెళ్లి అయినట్టు తెలిసిందని, తన కూతురిని మోసం చేసి గర్భవతిని చేసిన నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ బాలిక తల్లి ఇబ్రహీంపట్నం పోలీసులకు 2023 నవంబరులో ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ వి.కృష్ణవేణి 11మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా?

- నేను నీ దగ్గరకు రాను.. నువ్వే రా.. ఇదే నీకు శిక్ష
- జీజీహెచ్‌లో రోగిపై ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ చిందులు
- డాక్టర్స్ డే రోజున వైద్యుడికి కొరవడిన సేవాభావం

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ డే నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులనుద్దేశించి ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ గొప్పగా వ్యాఖ్యలు చేశారు. డాక్టర్లు సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలని హితబోధ చేశారు. డాక్టర్లు వైద్యో నారాయనో హరి అనే మాటకు మంచి పేరు తీసుకురావాలని పొగిడారు. అది జరిగిన కొంతసేపటికే జీజీహెచ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పృథ్వీ అనే వ్యక్తి ఆసుపత్రిలో ఆర్థో విభాగంలో చికిత్స చేయించుకోవడానికి వచ్చాడు. అదే సమయంలో సదరు రోగి గురించి కలెక్టర్ పేషీ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించిన కలెక్టర్ హెచ్‌వోడీకి ఫోన్‌చేసి రోగిపై కొద్దిగా కేర్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఆర్థోపెడిక్ హెచ్‌వోడీ అహం దెబ్బతిని "కలెక్టర్ పేషీతో చెప్పిస్తావా.. ఈరోజు నుంచి నీకు వైద్యం కావాలంటే ఫస్ట్‌ఫ్లోర్‌కు రా.. ఇదే నీకు శిక్ష" అంటూ చిందులు వేశారు. చేతికి రెండు చోట్ల రిబ్స్ విరిగి ఇబ్బందిపడుతున్న రోగిపై దయ లేకుండా ఆయన వ్యవరించారని అక్కడున్న రోగులు చెప్పుకుంటున్నారు. సదరు ఆర్థో హెచ్‌వోడీ బంధువు ఎన్టీఆర్ జిల్లాలో ఒక ఎమ్మెల్యే కావడం గమనార్హం. కలెక్టర్ నుంచి ఫోన్ వస్తేనే ఈ విధంగా స్పందిస్తే సామాన్య రోగుల పరిస్థితి ఏంటని అక్కడున్న వారు గుసగుసలాడుకుంటున్నారు.

కన్నతండ్రే కడతేర్చాడు

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయ కూలీగా పనులు చేస్తూ ఆవారాగా తిరిగే వెంకట నారాయణ మద్యం కోసం డబ్బులు కావాలని తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం తాగి తండ్రితో గొడవకు దిగటంతో పక్కనే ఉన్న కట్టె కర్రతో కుమారుడి తలపై మోదగా అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు, చిల్లకల్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అల్లారు ముద్దుగా పెంచి..

గోళ్ల కృష్ణ, నాగేంద్రమ్మలకు నలుగురు సంతానం. చిన్నవాడైన వెంకట నారాయణ అంటే ఇద్దరికి ఇష్టం. పెద్ద కుమారుడు, ఇద్దరు కుమార్తెలకు వివాహాలు కాగా వారు కుటుంబాలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. వెంకట నారాయణకు 15 ఏళ్ల క్రితం కృష్ణవేణితో వివాహం చేయగా, కుమారుడు రుషివర్ధన్, కుమార్తె రేష్మ ఉన్నారు. వెంకట నారాయణ వ్యసనాలకు బానిస కావటంతో భార్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో ఉంటూ కుమార్తెను మణుగూరులోని హాస్టల్‌లో ఏడో తరగతి చదివిస్తుండగా, కుమారుడు ఆమె వద్దనే ఉంటూ ఏడో తరగతి చదువుతున్నాడు. డబ్బుకోసం తల్లిదండ్రులను విసిగిస్తుండటంతో ఇటీవల చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదుచేయగా, కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పూటుగా మద్యం తాగి తండ్రితో వాగ్వాదానికి దిగటంతో పక్కనే ఉన్న కట్టెతో తలపై మోదటంతో వెంకట నారాయణ మృతి చెందాడు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహాన్ని చూసి తల్లి, భార్య, కుమార్తె, కుమారుడు కన్నీరుమున్నీరయ్యారు.

చీకట్లో చకచకా!

(5వ పేజీ తరువాయి)

ఇష్టానుసారం తవ్వేశారు. కోట్లాది రూపాయల మట్టిని దర్జాగా తరలించుకుపోయారు. అప్పట్లో మైనింగ్, రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ వంటి అధికార వ్యవస్థలన్నీ అక్రమార్కులకు సహకరించటంతో.. హద్దూ, అదుపు లేకుండా తవ్వకాలు జరిగిపోయాయి. గతేడాది బుడమేరుకు వరదలు వచ్చిన సమయంలో వర్షాల కారణంగా వడ్లకొండలో కొంత భాగం గ్రావెల్ పెళ్లలు విరిగి పడ్డాయి. వీటిని కూడా రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వంలో అక్రమ సంపాదనకు అవకాశం లేకపోవటంతో అక్రమార్కులు అదనుచూసి మళ్లీ ఇప్పుడు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. వడ్లకొండను లక్ష్యంగా చేసుకుని గ్రావెల్‌ను తన్నుకుపోతున్నారు. ఇప్పుడు కూడా మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ వంటి వ్యవస్థలను అడ్డుపెట్టుకుని గుట్టుచప్పుడు కాకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. రాత్రికి రాత్రి పెద్ద సంఖ్యలో పొక్లెయిన్లతో గ్రావెల్‌ను తవ్వి తరలించేస్తున్నారు. స్థానికులు అడ్డుకున్నా తగ్గేది లేదంటూ తవ్వేస్తున్నారు. దీంతో గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మైలవరం మండలం వెలగలేరు, జి.కొండూరు మండలం చేగిరెడ్డిపాడు రెవెన్యూ పరిధిలో కూడా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు ఫిర్యాదులు అందాయి.

ప్రహసనం..!

(5వ పేజీ తరువాయి)

సమర్పించారు. వసతులు లేవనే సాకుతో కార్యాలయ తరలింపును అప్పట్లో ఉద్యోగులు అడ్డుకున్నారు. అనంతరం వైసీపీ ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖను పూర్తిగా వదిలేశారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేయడంతో అడిగేవాళ్లు లేకపోవడంతో కార్యాలయ తరలింపు ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నీటి సంఘాలు పునఃజీవం పోసుకున్నాయి. దీంతో గుడివాడకు కేఈ ఈఈ కార్యాలయ తరలింపు డిమాండ్ తిరిగి తెరపైకి వచ్చింది.

రాష్ట్ర విభజన సమయంలో తీర్మానం

రాష్ట్ర విభజన సమయంలో ఇరిగేషన్ శాఖలో కృష్ణా ఈస్టర్న్ డివిజన్‌ను గుడివాడలో ఏర్పాటు చేయాలని తీర్మానించుకున్నారు. ఇది ఎప్పటి నుంచో ఉన్న డిమాండ్ అయిన రాష్ట్ర విభజన తర్వాత తప్పనిసరైంది. అప్పట్లో వసతులు లేవనే సాకుతో ఉద్యోగులు కార్యాలయ తరలింపును అడ్డుకున్నారు. నేడు పూర్తిస్థాయిలో భవనాలు సిద్ధంగా ఉన్నాయి.

చెదిరిన కలలు

(5వ పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంటికి పిలిపించారు. రెండు కుటుంబాలను కూర్చోబెట్టి మాట్లాడారు. జరిగిన విషయాన్ని వదిలిపెట్టి పిల్లలు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించాలని రెండు కుటుంబాలను ఒప్పించారు. దీంతో ఆషాడం వెళ్లిన తర్వాత విందు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవాలని రెండు కుటుంబాలు భావించాయి. ఇరు కుటుంబాలు ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకుండా తాము తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించడంతో నిఖిల్‌రెడ్డి, శ్రీరమ్య ఆనందంలో మునిగిపోయారు. ప్రమాదం జరిగిన రోజున శ్రీరమ్య ఉదయం పది గంటల షిఫ్టుకు వెళ్లాల్సి ఉండగా తెల్లవారుజామున ఐదు గంటల షిఫ్టుకు వెళ్లింది. అప్పటికే నిఖిల్ రెడ్డి విధుల్లో ఉన్నాడు. ఆ ఇద్దరు ఎక్కడ కలుసుకుని ఒక్కటయ్యారో అక్కడే జరిగిన ప్రమాదంలో ఇద్దరూ సజీవ దహనమవ్వడం అందరిని కలచివేసింది. కాగా, ప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొలికపూడి వెంటనే హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. యువజంట మరణంపై కన్నీరు పెట్టుకుంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు.

మంటగలిసిన మానవత్వం

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందిగా ఉందని చెప్పాడు. వారు వినకపోవడంతో జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వాపోయాడు. ఆస్తి వివాదం సివిల్ మేటర్ అని కోర్టులో తేల్చుకోవాలని పోలీసులు సలహా ఇచ్చి అతడ్ని పంపేశారు. ఆస్తి పంచలేదనే కోపం పెంచుకున్న వేణునే నానమ్మ హైమావతిని హత్య చేసి ఉంటాడనే అనుమానం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఘటన జరిగిన తర్వాత వేణు సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ అవ్వడం, కనపడకుండా పోవడంతో ఇది అతని పనే అని అందరూ గట్టిగా చెబుతున్నారు. పోలీసులు మాత్రం ఇంకా హత్య ఎవరు చేశారో నిర్ధారించలేదు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి మైలవరం సీఐ చంద్రశేఖర్ దర్యాప్తు చేస్తున్నారు.



హైదరాబాద్‌కు చేరుకొన్న హాజీలు

ఆంధ్రప్రదేశ్ హాజీలకు ఘన స్వాగతం

- రెండు విమానాల్లో హైదరాబాద్‌కు చేరుకున్న 529 మంది

కృష్ణలంక, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 529 మంది హాజీలు రెండు ప్రత్యేక విమానాల్లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి మంగళవారం ఉదయం చేరుకున్నారు. మక్కా నుంచి నేరుగా హైదరాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న హాజీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ బాషా, మైనార్టీ సలహాదారులు షరీఫ్, హజ్ కమిటీ ఈవో, మెంబర్ల అధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా హజ్ యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకొన్న హాజీలకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. మైనార్టీ, ఎస్ఎండీ ఫరూక్, ముస్తాక్ అహ్మద్‌లు శుభాభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరపున హాజీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలియజేశారు. హజ్ కమిటీ మెంబర్లు మహబూబ్ బాషా, బాబా ఫక్రుద్దీన్, మన్సూర్ అలీఖాన్, మిర్జా ఆబిద్ హుస్సేన్, ఆసిఫ్ వలి తదితరులున్నారు.

ఇగ్నో రీజనల్ డైరెక్టర్‌గా సుమలత బాధ్యతల స్వీకారం



వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) విజయవాడ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్‌గా కె.సుమలత మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రీజనల్ డైరెక్టర్ డీఆర్ శర్మ సోమవారం పదవీ విరమణ చేశారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రానికి 2019 అక్టోబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు సుమలత రీజనల్ డైరెక్టర్‌గా పనిచేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాంతీయ కేంద్రం పరిధిలోని విద్యార్థులకు మెరుగైనసేవలు అందిస్తామని, దూరవిద్యను ఎక్కవ మందికి చేరువ చేయనున్నట్టు తెలిపారు. ప్రాంతీయ కేంద్రం పరిధిలో అధ్యయన కేంద్రాలు లేని జిల్లాల్లో నూతన అధ్యయన కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. పలు నూతన కోర్సులను ఆయా అధ్యయన కేంద్రాలలో ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. సుమలతకు డిప్యూటీ డైరెక్టర్లు ప్రసాద్ బాబు, శరత్‌చంద్ర, అసిస్టెంట్ రీజనల్ డైరెక్టర్ మమత, డిప్యూటీ రిజిస్ట్రార్ బాలచందర్, ఇగ్నో సిబ్బంది అభినందనలు తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే ప్రయత్నం అవివేకం

వన్‌టౌన్ : పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రయత్నం చేయడం అవివేకమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్ జిల్లా డీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు గోదావరి వరదల సమయంలో, మామూలు సమయాల్లో సుమారు మూడు వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్న విషయం అందరికీ తెలిసిన విషయమన్నారు. గోదావరిలో వృథాగా పోతున్న వేల టీఎంసీలలో కేవలం 200 టీఎంసీలు శ్రీశైలం దిగువన ఉన్న బనకచర్లకు తరలిస్తే తద్వారా రాయలసీమ ప్రాంతం, పోలవరం నుంచి, బనకచర్ల వరకు దుర్భిక్షాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయని దూరదృష్టితో సీఎం చంద్రబాబు మానస పుత్రికగా భావించి ఈ ప్రాజెక్టుకు అంకురార్పణ చేయటం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టు వలన అనేక విధాలుగా లబ్ది చేకూరుతుందని ఆయన వివరించారు. పోలవరం - బనకచర్ల ప్రాజెక్టుని కేవలం రాజకీయ కారణాలతో అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు త్వరలోనే ప్రాజెక్టుకు అనుమతులు తెస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బ్రాయిలర్ ధరలు


అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	96,104, 115
చికెన్ విత్ స్కిన్	184
చికెన్ స్కిన్‌లెస్	194

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 590

ఎంబీవీకేలో ఉపాధి శిక్షణ తరగతులు 5 నుంచి

గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే) కంప్యూటర్ శిక్షణా కేంద్రంలో ఈ నెల 5నుంచి వివిధ కోర్సుల్లో శిక్షణకు కొత్త బ్యాచ్‌లు ప్రారంభిస్తున్నట్లు ఇన్‌చార్జి టి.క్రాంతికిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, ట్యాలీ, సీ లాంగ్వేజ్, డీటీపీ, ఫొటోషాప్‌లో శిక్షణ కాలం 2 నెలలు ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 90145 41958, 9490098042లో సంప్రదించాలని కోరారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపునిచ్చారు. తూర్పు పరిధి గురునానక్ కాలనీలోని న్యాక్ కల్యాణమండపంలో మంగళవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు (ఇంటింటి కార్యక్రమం)లో భాగంగా నియోజక వర్గ పార్టీ నేతలు, కూటమి నేతల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కుటుంబ సాధికార సారథులు వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని తెలియజేయాలని తెలిపారు. ప్రస్తుతం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు భవిష్యత్తులో అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం, టీడీపీ నేతలు వెలగపూడి శంకర్‌బాబు, ఎర్రబోతు రమణ, పరుచూరి ప్రసాద్, వల్లభనేని సతీష్, కార్పొరేటర్లు, నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యులు, నేతలు, పాల్గొన్నారు.


స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

అగ్నిప్రమాదాల నిరోధంపై అవగాహన

లబ్బీపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బందరురోడ్డులోని ముగ్ధ షోరూమ్, సెయింట్ జాన్స్ స్కూల్‌లో మంగళవారం వీఎంసీ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సముదాయాల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవలసిన చర్యలు, ప్రమాదం జరిగినపుడు మంటలను ఏవిధంగా నిరోధించాలి, ఎటువంటి పరికరాలు వాడాలి, ఫైర్ స్ప్రింక్లర్లు, స్మోక్ అలారం ఎలా వస్తుంది తదితర అంశాలపై అక్కడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ ఆఫీసర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలపై అవగాహన


మాట్లాడుతున్న గద్దె క్రాంతికుమార్

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల మహిళలకు కుటీర పరిశ్రమలపై అవగాహన ద్వారా స్వయం ఉపాధి కల్పించేందుకు కేశినేని ఫౌండేషన్ ద్వారా ఎంపీ కేశినేని శివనాథ్ కృషి చేస్తున్నారని ఎన్‌ఐఆర్‌డీ జిల్లా ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్‌వర్మ, టీడీపీ నాయకులు గద్దె క్రాంతికుమార్‌లు తెలిపారు. తూర్పు నియోజక వర్గం 11వ డివిజన్ టీడీపీ నాయకులు నాదెండ్ల రాజేష్ ఆధ్వర్యంలో మంగళవారం కనకమేడల రవీంద్ర కమ్యూనిటీ హాల్లో తొమ్మిది స్లమ్ ఫెడరేషన్‌లో ఉన్న డ్వాక్రా సంఘ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆశక్తి ఉన్న మహిళల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్‌లు మహిళాభ్యున్నతికి అధిక ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి ఉషారాణి, కె.మీనాక్షి, ఉమామహేశ్వరి, ప్రసాద్ పాల్గొన్నారు.

పరిశోధన నిమిత్తం ఐటీఐ కాలేజీకి కారు అందజేత

భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐ కళాశాలలోని మోటార్ మెకానిక్ విభాగానికి పరిశోధన నిమిత్తం హ్యుండాయ్ మోటార్స్ ఇండియా లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్‌ఫండ్స్‌లో భాగంగా న్యూఐ20 కారు అందజేసినట్లు ఐటీఐ ప్రధానాధికారి, కన్వీనర్ ఎం.కనకారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేయండి

టైటిల్ ఎంపిక కమిటీ సభ్యుల సమావేశంలో కమిషనర్ ధ్యానచంద్ర


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని విజయవాడ ఖ్యాతిని పెంచే బ్రాండ్ ఇమేజ్ టైటిల్‌ను ఎంపిక చేయాలని నగర కమిషనర్, కమిటీ చైర్మన్ ధ్యానచంద్ర సభ్యులకు సూచించారు. విజయవాడ బ్రాండ్ ఇమేజ్ పోటీల టైటిల్ ఎంపిక కమిటీ సమావేశం మంగళవారం నగర కమిషనర్ ధ్యానచంద్ర చాంబర్‌లో జరిగింది. పోటీలకు వచ్చిన 229 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి ఒక్కరూ టాప్ 10ను ఎంపిక చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులే కాకుండా వినూత్నంగా ఉన్న ఆలోచనలను స్వాగతించాలని కమిటీలో ఉన్న ప్రతి ఒక్క సభ్యులు వినూత్నమైన పద్ధతిలో ఎంపిక చేయాలన్నారు. ఆధ్యాత్మిక, పర్యాటక, నదులను దృష్టిలో పెట్టుకొని టాప్ 10తో నివేదిక సమర్పించాలన్నారు. ముఖ్యంగాఎంపిక చేసేటప్పుడు, బ్రాండ్ ఇమేజ్‌లలో ప్రస్తుతం ఇతర ప్రదేశాలకు ఆ పేరు లేకుండా చూసుకోవాలని సూచించారు. తదుపరి సమావేశానికి ప్రతి ఒక్కరూ వచ్చిన టాప్10లో 5 సెలెక్ట్ చేసి కలెక్టర్‌కు నివేదికను సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ ఏ శ్రీ శిల్ప, అసిస్టెంట్ కమిషనర్ ఎండోమెంట్స్ నటరాజన్ షణ్ముగం, ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ స్వామి, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రెసిడెంట్ భాస్కరరావు, డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్ కేవీ రమణరావు, మోహన్‌లు పాల్గొన్నారు.

గురువులను సత్కరించడం గొప్ప అనుభూతి

డాక్టర్స్ డే కార్యక్రమంలో సిద్ధార్థ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏవై రావు


వైద్యులను సత్కరించిన సిద్ధార్థ మెడికల్ కాలేజీ సిబ్బంది

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కళాశాలను గొప్ప స్థాయికి తీసుకువచ్చిన ఘనత తమ గురువులు, వైద్యులు, నాయకులదేనని ప్రిన్సిపాల్ ఏ.వై.రావు తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన డాక్టర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏటా డాక్టర్స్ డే కార్యక్రమం నిర్వహించి గురువులను తలచుకుని, సత్కరించడం గొప్ప అనుభూతని తెలిపారు. గురువులు చూపిన మార్గం దీపస్తంభం లాంటిదన్నారు. ప్రముఖ డాక్టర్లు జి.ఈశ్వర్ (జనరల్ మెడిసిన్), టి.జె. ప్రసన్న కుమార్ (ప్రముఖ సర్జన్), కె.ప్రభాదేవి (ప్రసూతి, గైనకాలజీ) అందించిన సేవలు, సమాజానికి చూపిన నిబద్ధత యువతకు ప్రేరణగా నిలుస్తుందని నెఫ్రాలజిస్ట్ ఎస్.అమ్మన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముగ్గురి వైద్యుల సేవలను గుర్తు చేసుకుంటూ కాలేజీ సిబ్బంది వారికి సన్మానం చేశారు.


విజయ్‌కృష్ణను సన్మానిస్తున్న సీనియర్ సిటిజెన్ కార్యవర్గం

సీనియర్ సిటిజెన్ అసోసియేషన్‌కు రూ.లక్ష విరాళం

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పటమట సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం మంగళవారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు విజయ్‌కృష్ణ తన తండ్రి రామ్మోహన్ జ్ఞాపకార్థం రూ.లక్ష అసోసియేషన్‌కు విరాళంగా అందించారు. అసోసియేషన్ నిర్వహించే సేవా కార్యక్రమాలకు తన వంతుగా ఈ విరాళం ప్రకటించినట్లు ఆయన తెలిపారు. దాతను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నగంటి సాంబశివరావు, కార్యదర్శి కొల్లిపర రామ్మోహన్‌రావు, సూర్యదేవర పాపారావు, కొండపల్లి మాధవరావు, వసంత శివశంకర్రావు, సభ్యులు పాల్గొన్నారు.

వీధికుక్కల బెడద.. పట్టించుకోని అధికారులు



భారతీనగర్, ఆంధ్రజ్యోతి : నగరంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. మూడో డివిజన్‌లోని నాగార్జునగర్, విజయలక్ష్మి కాలనీ, కరెన్సీనగర్ కాలనీ, శ్రీరామచంద్రనగర్, కనకదుర్గనగర్, తదితర కాలనీల్లో వీధి కుక్కలు బెడద ఎక్కువగా ఉంది. ఈ కాలనీల్లో మెయిన్, అంతర్గత రోడ్డులో వీధికుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలన్ని భయానికి గురిచేస్తున్నాయి. కాలనీలోని ఖాళీ స్థలాలను నివాస స్థావరంగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయంలో కుక్కలు పెద్దగా అరుస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయంలో వాహనదారుల వెంట పడుతున్నాయి. ఈ సందర్భంలో వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. దీంతో రాత్రి సమయంలో బయటకు రావాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామలింగేశ్వరనగర్: వీధి కుక్కలు, పిచ్చి కుక్కల తాకిడి తట్టుకోలేక పటమట, అంబేడ్కర్ నగర్, లంబాడీపేట, సత్యనారాయణ నగర్, కాల్వగట్టువాసులు బెంబేలెత్తుతున్నారు. వీధులలో నడవాలంటేనే ముఖ్యంగా రాత్రి వేళలో విధి నిర్వహణ పూర్తి చేసుకుని ఇళ్లకు వెళ్లే సమయంలో బిక్కుబిక్కుమంటూ వెళుతున్నామని, ఎటువైపు నుంచి ఏ కుక్క దాడి చేస్తుందోనని భయంగా ఉందని ఆయా ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు ఆడుకునే సమయంలో వీధి కుక్కలు వారి ప్రాణాలు తీస్తాయేమోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

హ్యాకథాన్ విజేతలు ఆదిత్య విద్యార్థులు


విజేతలను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

పటమట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో గూగుల్ డెవలపర్స్ స్టూడెంట్స్ క్లబ్ హ్యాకథాన్ పోటీల్లో విజయవాడ ఆదిత్య కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచి రూ.30 వేలు బహుమతిని గెలుచుకున్నారు. ఈ పోటీల్లో బీఎస్సీ మూడో ఏడాది విద్యార్థులు బి.తేజశ్రీ, ఎ.భాస్కర రెడ్డి, లోకేష్‌లు విజేతలుగా నిలిచారు. పిల్లలు తమ తల్లిదండ్రులకు తెలియకుండా మొబైల్‌లో వాడే ఏ సమాచారమైనా తల్లిదండ్రులకు తెలిపే విధంగా రూపొందించిన సేవ్ గార్డియన్ అనే ప్రదర్శన బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.వీర్రాజు తెలిపారు. విజేతలను యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ రాజ్‌కుమార్, అధ్యాపకురాలు సుల్తాన, చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డిలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ


కృష్ణలంకలో, పటమటలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా

ముఠా కార్మికుల ప్రచారం



గవర్నర్‌పేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో ముఠా కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె. దుర్గారావు కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలన్నారు. మంగళవారం 23వ డివిజన్ అలీబేగ్ వీధిలో ముఠా కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి బడా కంపెనీలకు అనుకూలమైన కార్మిక చట్టాలు తేవడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. బ్రహ్మయ్య, ఎం. సీతారాములు, సీహెచ్ నరసింహులు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి శాంపిల్ బిల్డింగ్

రూ.7లక్షలతో స్టేజ్, హ్యాండ్‌వాష్, పెయింట్ తదితర పనులు


స్టేజి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు (ఫైల్ ఫొటో)

రాణిగారితోట, ఆంధ్రజ్యోతి: రాణిగారితోట 17వ డివిజన్‌లోని శాంపిల్ బిల్డింగ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. డివిజన్‌లోని పేద,మధ్యతరగతి ప్రజలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు నిర్మించిన శాంపిల్ బిల్డింగ్‌లో అరకొర వసతులతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంలో ఈ భవనాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి పరిచి అవసరమైన సదుపాయాలు కల్పించాలని స్థానిక టీడీపీ నేతలు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన సంబంధిత అధికారులకు వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించడంతో రూ.7లక్షల అంచనాలతో పనులు ప్రారంభమయ్యాయి. బిల్డింగ్ శ్లాబ్ ఫ్లోరింగ్, పెయిటింగ్స్‌తో పాటు ప్రధానంగా భవనం లోపల స్టేజ్ నిర్మాణం, వాష్ బేషిన్ల నిర్మాణంతో పాటు ఇతర ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయితే స్థానికంగా ఉన్న వారికి అన్ని వసతులతో శుభకార్యాల కోసం భవనం అందుబాటులోకి రానుంది. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను డివిజన్ టీడీపీ నాయకులు రాయి రంగమ్మ, శ్రీనివాస చౌదరి తదితరులు పరిశీలించారు.

ఎమ్మెల్యే చొరవతోనే..

శాంపిల్ బిల్డింగ్ అభివృద్ధి పనులు చకచక జరగడానికి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సహకారం ఎంతో ఉంది. ఆయన చొరవతోనే అధికారులు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తున్నారు.

కొప్పుల శ్రీనివాస చౌదరి,
(టీడీపీ డివిజన్ నాయకులు)


రోడ్డు ఆక్రమించి నిర్మించిన మెట్లు, అరుగులు

రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రామలింగేశ్వరనగర్, ఆంధ్రజ్యోతి: పదిహేనవ డివిజన్ రామలింగేశ్వరనగర్ శివగంగాభవాని వీధి చివర కొంతమంది ఇంటి యజమానులు రోడ్డును ఆక్రమించి మెట్లు నిర్మించేస్తున్నారు. దానికి తోడు ఇంటి ముందు కార్లు తదితర వాహనాలను పార్కింగ్ చేసేందుకు వీలుగా రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఆ రోడ్డులో కార్లు, ఆటోలు, పెద్దవాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉందని వాహనదారులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును ఆక్రమించి నిర్మించిన మెట్లను తొలగించి ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

నున్నలో తొలి ప్రైవేట్ ఏటీఎస్ కేంద్రం

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలన్నీ ఇక్కడే !

- వెహికల్ ఇన్‌స్పెక్టర్స్‌తో పని లేకుండానే ప్రైవేటు సిబ్బంది తనిఖీలు
- ట్రాక్, టెస్టింగ్ బ్లాక్, స్టోరేజ్ బ్లాక్‌లను ఏర్పాటు చేసిన నిర్వాహకులు

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ రూరల్ మండలం నున్నలో రవాణా శాఖ పరిధిలో తొలి ప్రైవేటు వాహనాల ఫిట్‌నెస్ తనిఖీ కేంద్రం ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు, ప్రైవేటు సంస్థలు నిర్వహించే ఈ కేంద్రాలను ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్స్ (ఏటీఎస్)గా పిలుస్తారు. ఇకపై ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలు ఈ ఏటీఎస్ కేంద్రాల్లోనే జరుగుతాయి. గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఈ పరీక్షలు నిర్వహించగా, ఇప్పుడు ఏటీఎస్ అందుబాటులోకి రావడంతో ప్రైవేటు సిబ్బంది ఈ బాధ్యతను చేపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఫిట్‌నెస్ తనిఖీ సేవల కోసం కైజెన్ ఇన్స్పెక్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ ఏటీఎస్‌ను నున్నలో సువిశాల స్థలంలో ఏర్పాటు చేసింది. వాహనాల పరిశీలనకు వీలుగా ఒక ట్రాక్, రెండు వాహనాలకు ఏకకాలంలో పరీక్షలు నిర్వహించేందుకు రెండు బ్లాకులతో కూడిన స్టేషన్, వాహనాలు ఉంచేందుకు పొడవైన గోడౌన్ ఏర్పాటు చేశారు. పచ్చదనం మధ్య ఈ ఏటీఎస్ పనిచేస్తోంది. వాహన ఫిట్‌నెస్ కోసం వాహనదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, గతంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్లాట్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుంటే ఏటీఎస్‌కు వెళ్లమని నిర్దేశిస్తారు. అక్కడ ప్రైవేటు సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. అయితే, ఏటీఎస్ వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గతంలో విజయవాడ, నందిగామ వంటి ఆర్టీవో కేంద్రాల్లో స్థానికంగా ఫిట్‌నెస్ పరీక్షలు జరిగేవి. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల వాహనదారులు నందిగామలో పరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు వీరంతా నున్నలోని ఏటీఎస్‌కు రావాల్సి ఉంటుంది, ఇది మైలవరం, తిరువూరు వాహనదారులకు దూర ప్రయాణంగా మారింది. మైలవరం మండలంలోని జీ కొండూరు, ఇబ్రహీంపట్నం ప్రాంతాల వారికి ఈ ఇబ్బంది మరింత ఎక్కువ. ప్రతి నియోజకవర్గంలో ఒక ఏటీఎస్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతానికి ఈ కేంద్రాల వల్ల పెద్దగా ఇబ్బందులు లేకపోయినా, ప్రైవేటు సంస్థ నిర్వహణలో ఉండటం వల్ల భవిష్యత్తులో అవకతవకలు, అధిక ఫీజుల దోపిడీకి అవకాశం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.



నున్నలో ఏర్పాటైన రవాణా వాహనాల ఫిట్నెస్ తనిఖీ కేంద్రం (ఏటీఎస్)

వీఆర్వోల సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోండి

- మంత్రికి వీఆర్వోల సంఘం అధ్యక్షుడు రవీంద్రరాజు వినతి

గాంధీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్‌లో వీఆర్వోల క్యాడర్ సంఖ్య తగ్గకుండా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర గ్రామ, రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతమున్న వీఆర్వోలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. అర్హులైన గ్రేడ్-1 వీర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద వెంటనే సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లుగా ప్రమోషన్లు కల్పించాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించి జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి వీఆర్వోల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని రవీంద్రరాజు పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బీ సుగుణమ్మ, రాష్ట్ర నేతలు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీనారాయణ, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నేతలు వీ శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

వాతావరణం అనుకూలించక

గన్నవరంలో ఇండిగో ల్యాండ్

- అరగంట తర్వాత మళ్లీ హైదరాబాద్‌కు

విజయవాడ, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి హైదరాబాద్ వెళ్లాల్సిన ఇండిగో విమానం గన్నవరం విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. ఇండిగో విమానం మంగళవారం సాయంత్రం బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరగా వాతావరణం అనుకూలించకపోవడంతో గన్నవరంలో రాత్రి 9.20కి 214 మంది ప్రయాణికులతో వచ్చింది. ముగ్గురు ప్రయాణికులు ఇక్కడ దిగారు. మిగిలినవారితో హైదరాబాద్‌కు రాత్రి 9.50కు తిరిగి వెళ్లింది.



స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేయాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి పిలుపు

పెనమలూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆలోచనలకు అనుగుణంగా వికసిత్ భారత్‌లో భాగంగా సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర విజన్-2047 సాధనకు అందరూ కృషి చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే సుజనాచౌదరి, బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం తాడిగడపలోని ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా పశ్చిమలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నార్మల్ డెలివరీలను ప్రోత్సహిస్తూ మరణాల రేటును తగ్గించేలా అడుగులు వేస్తున్నామన్నారు. మానవ వనరులను అభివృద్ధి చేసి విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేలా సీఎం చంద్రబాబు విజన్ డాక్యుమెంటును రూపొందించారన్నారు. 2047 డాక్యుమెంటుకు అనుగుణంగా పనిచేసి పీ4 విధానం ద్వారా పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. ఎంఎస్ బేగ్, స్పెషల్ ఆఫీసర్ ఏ రవీంద్రరావు, తహసీల్దారు ఇంతియాజ్ పాషా, మెడికల్ ఆఫీసర్ సుహాసిని, జోనల్ కమీషనర్ రమ్యకీర్తన, ఎంఈవో సోమశేఖర్, సీసీపీ రత్నకుమార్, షేక్ రాజా సాహెబ్ ఆసుపత్రి సూపరింటెండెంటు డాక్టర్ శాంతికిరణ్ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాల్లో రాజీ ప్రసక్తే లేదు

- డీసీజీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రాణం అత్యంత విలువైనది. ప్రజల భద్రతకు తొలి ప్రాధాన్యమివ్వాల్సిందేనని, పరిశ్రమల భద్రతా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని, నిబంధనలను తూ.చ తప్పకుండా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులకు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా క్రైసిస్ గ్రూప్ (డీసీజీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా ఆన్‌సైట్, ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్స్ నిర్వహించాలని, ముఖ్యంగా కర్మాగారాలు, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, కాలుష్య నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్య శాఖలను సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, కర్మాగారాల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం శివకుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు, కొండపల్లి పారిశ్రామిక సంఘం ప్రతినిధి ఎంఎస్ రామచంద్రరావు, డీపీవో పీ లావణ్యకుమారి, హెచ్‌పీసీపీఎల్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, వీటీపీఎస్ తదితర పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.


పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ప్రతి మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలి

స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి తదితరాల ద్వారా పొందిన రుణాలను తప్పనిసరిగా జీవనోపాధి కార్యకలాపాలకు, సంపద సృష్టికి సద్వినియోగం చేసుకొని, ఆర్థిక వృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన వార్షిక రుణ-జీవనోపాధి ప్రణాళిక నుంచి సూక్ష్మ రుణ ప్రణాళిక - జీవనోపాధులుపై సమావేశం జరిగింది. స్వయం సహాయక సంఘాల మహిళలు పొందే రుణాలపై పర్యవేక్షణ చేసి, ఆ రుణాలను కుటుంబాల ఆర్థిక సాధికారతకు ఉపయోగపడేలా చేయిపట్టి నడిపించాలని అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. రుణాలను ప్రణాళికాయుతంగా సద్వినియోగం చేసుకొంటూ సంపద సృష్టికి బాటలు వేసుకోవాలన్నారు. కుటుంబ సర్వే ఆధారంగా ఈ వార్షిక రుణ ప్రణాళికకు రూపకల్పన చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త నినాదంతో ముందుకెళ్తోందని, స్వయం సహాయక సంఘాల మహిళలు వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఇందుకు డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం

ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ లక్ష్యాలను చేరుకొనేందుకు వీలుగా జూలై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు ప్రత్యేక ప్రచారం నిర్వహించనున్నట్లు ఎల్‌డీఎం కే ప్రియాంక వివరించారు. పీఎంజేడీవై, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవైలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకొనేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కల్పన, వివిధ బ్యాంకుల కో-ఆర్డినేటర్లు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ లక్ష్మీశ

ఎ.కొండూరు, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పేదల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు, పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఉదయం ఏ కొండూరు మండలంలోని కంభంపాడు గ్రామంలో పెన్షన్లు పంపిణీ, జలజీవన్ మిషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో కలిసి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి వారి సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. పెద్దాయనా బాగున్నారా? పెన్షన్ సమయానికి అందుతుందా? ఆరోగ్యం ఎలా ఉంది? ఎవరైనా డబ్బులు డిమాండ్ చేశారా? అంటూ లబ్ధిదారులును ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2,27,220 మంది పెన్షన్‌దారులకు రూ.99 కోట్ల 24లక్షల 72వేల 500లను సామాజిక పెన్షన్ల ద్వారా అందజేస్తున్నట్టు తెలిపారు.


జలజీవన్ మిషన్ పనులపై వివరాలు తెలుసుకొంటున్న కలెక్టర్

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన

ఎ.కొండూరు మండలంలోని జలజీవన్ మిషన్ పనులను కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైపులైన్ పనులు కొనసాగుతున్నాయ్యాని, కొన్నిచోట్ల జాతీయ రహదార్లు, ఇరిగేషన్ కాల్వులు, రైల్వే లైన్లు అడ్డుగా ఉండటంతో పనుల్లో ఆలస్యమైందని, గ్రామాల్లోని కొత్తగా నిర్మాణం చేస్తున్న వాటర్ ట్యాంక్ పనులు తుది దశకు చేరుకున్నట్టు తెలిపారు. మరో నెలా 15 రోజులో పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందజేస్తామన్నారు. తిరువూరు ఆర్‌డీవో కే మాధురి, ఏపీడీ నాంచారరావు, తహసీల్దార్ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజధాని కార్యకలాపాలపై కొనసాగిన సమావేశాలు

కలెక్టరేట్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో వరుసగా రెండో రోజు మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. బృంద సభ్యులకు సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు జీ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్ రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యకలాపాలు, యువత, మహిళలకు అందిస్తున్న నైపుణ్య శిక్షణ వంటి అంశాల గురించి కూలంకషంగా వివరించారు. అలాగే రాజధాని నిర్మాణానికి నిధుల సమీకరణకు అనుసరిస్తున్న విధానాల గురించి, ల్యాండ్ మోనిటైజేషన్ గురించి వివరించారు. ఆయా ప్రాజెక్టులకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో సీఆర్‌డీఏ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్‌లోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందంలోని పలువురు సభ్యులు రాజధాని అమరావతిలోని ఏఐఎస్ అధికారుల నివాస సముదాయాలు, ప్రిన్సిపల్ కార్యదర్శులు, మంత్రులు, ఎంఎల్ఏ, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు, టిడ్కో నివాస సముదాయాలను సందర్శించారు. ఆయా భవనాల వద్ద, నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాల వద్ద పురోగతిని అధికారులు బృందంలోని సభ్యులకు వివరించారు. అమరావతిలో నిర్మించిన వివిధ భవనాలు పర్యావరణ సహిత విధానాలతో నిర్మించామని, రాజధానిలో అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న వివిధ హౌసింగ్ ప్రాజెక్టుల నిర్మాణం, ఆయా ప్రాజెక్టుల్లో పురోగతి గురించి సీఆర్‌డీఏ అధికారులు వారికి వివరించారు.


సీఆర్‌డీఏ అధికారులతో ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందం

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా

సందీప్ మాథుర్ అదనపు బాధ్యతల స్వీకరణ

రైల్వేస్టేషన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా దక్షిణ కోస్తా రైల్వేలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సందీప్ మాథుర్ బాధ్యతలు స్వీకరించారు. సౌత్ సెంట్రల్ రైల్వేలో జనరల్ మేనేజర్‌గా ఆయన అదనపు బాధ్యతలను నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వే సర్వీస్ సిగ్నలింగ్ ఇంజనీరింగ్‌లో 1988 బ్యాచ్‌కు చెందిన ఆయన ఇంతకుముందు న్యూ సౌత్ కోస్ట్ విశాఖపట్నం హెడ్ క్వార్టర్స్ రైల్వే జోన్‌కు మేనేజర్‌గా నియామకమయ్యారు. సందీప్ మాథుర్ రైల్వే బోర్డులో సిగ్నలింగ్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేస్తూ అనేక సాంకేతిక ఆధునీకరణ విధానాలను, సిగ్నలింగ్ వ్యవస్థలో ప్రవేశపెట్టారు. అసిస్టెంట్ సిగ్నల్ టెలికం ఇంజనీర్‌గా అలహాబాద్ డివిజన్‌లో ఉద్యోగాన్ని ప్రారంభించారు. చాలా జోన్లలో కీలక బాధ్యతలను నిర్వహించారు. మలేషియాలో డబుల్ లైన్ ప్రాజెక్టు నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అంతర్జాతీయ స్థాయిలో పేరుగాంచింది. సందీప్ మాథుర్ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఏజీఎం నీరజ్ అగర్వాల్, ఇతర విభాగాధిపతులు, సీనియర్ అధికారులతో సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో సమావేశం నిర్వహించారు. 6 డివిజన్లకు చెందిన డీఆర్ఎంలు వీసీద్వారా పాల్గొన్నా రు. ట్రైన్ల నిర్వహణలో భద్రత (సేఫ్టీ)కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో ట్రాక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రైన్ల రాకపోకలకు సమయాలు కచ్చితంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. సేఫ్టీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులలో ప్రామాణికాలు పాటించాలని స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి క్రమంలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలని తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఐదేళ్లలో సాధించిన ప్రగతిని ఆయన అభినందించారు. సిబ్బంది అంకిత భావానికి ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలకు నిధులు

వన్‌టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ బందరు రోడ్డులో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఏపీపీఎస్సీ ఇతర విభాగాధిపతుల విన్నపం మేరకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల నిర్వహణకు రూ.1.18కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విభాగాధిపతుల కార్యాలయాలలో అత్యవసర మరమ్మతులు, సెక్యూరిటీని పెంచేందుకు నిధులు వెచ్చించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించటంతో తదుపరి చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

వెంటాడుతున్న పాపాలు

తల్లికి వందనానికి శాపంగా మారిన వైసీపీ ప్రభుత్వ రీసర్వే


- సెంటు భూమి లేకపోయినా.. 23.67 ఎకరాలున్నాయట!
- వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రీ సర్వేలో వెలుగు చూసిన విచిత్రం
- గండేపల్లి గ్రామానికి చెందిన తల్లి అద్దంకి సరితకు షాక్
- పొలం ఉందని తల్లికి వందనం రాకపోవటంతో ఆందోళన
- జరిగిన తప్పును సరిదిద్దాలంటూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ



వైసీపీ ప్రభుత్వ రీసర్వే పాపాలు ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో జరిగిన తప్పు ఓ నిరుపేద కుటుంబానికి శాపంగా పరిణమించింది. సెంటు భూమి లేకపోయినా ఏకంగా 23.67 ఎకరాలున్నట్టుగా చూపించటంతో ఆ కుటుంబం సంక్షేమ పథకాలకు అర్హత లేకుండా పోయింది. తల్లికి వందనం సొమ్ములు అందకపోవటంతో ఆరా తీయగా పొలం విషయం వెలుగులోకి వచ్చింది. తమకు పొలం లేదు, జరిగిన తప్పును సరిదిద్దాలంటూ బాధిత కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, కంచికచర్ల

కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో నిరుపేద దళిత కుటుంబానికి చెందిన అద్దంకి మల్లికార్జునరావు, సరిత దంపతులు. వీరికి కాలనీ ఇల్లు తప్పితే ఎలాంటి ఆస్తిలేదు. ఇద్దరూ కూలీ పనులకు వెళుతుంటారు. పిల్లలను చదివించాలన్న కోరికతో కష్టపడుతున్నారు. వీరికి ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు అఖిల్ బీటెక్ రెండో సంవత్సరం, కుమార్తె కోకిల ఇంటర్ రెండో సంవత్సరం, చిన్నకుమార్తు ఏడుకొండలు పదో తరగతి చదువుతున్నారు. సుమారుగా 7 నెలల క్రితం పనికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కింద పడటంతో సరిత ఎడమ చేయి విరిగింది. ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఆర్థిక సాయం అందుతుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరింది. వైద్యులు శస్త్రచికిత్స చేసి, విరిగిన చోట చేతిలో ప్లేట్లు వేశారు. వైద్య సేవ మాత్రం అందలేదు. నానా తిప్పలు పడి రూ.40 వేలు చెల్లించారు. వేసవి సెలవుల అనంతరం గత నెల 12న పాఠశాలలు పునః ప్రారంభం రోజునే ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు అందించింది. కానీ సరిత ఇద్దరు పిల్లలకు రూ.26 వేలు రావల్సి ఉండగా, రూపాయి రాలేదు. గ్రామ సచివాలయానికి వెళ్లి అడగ్గా, తన పేరుతో 23.67 ఎకరాల మెట్ట భూమి ఉన్నట్టుగా చూపించటంతో సరిత అవాక్కైంది. పరిటాల రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 2446లో 21.67 ఎకరాల మెట్ట భూమి సరిత ఆధార్ నెంబరు చూపిస్తోంది. సరితకు చేయి విరగటంతో కూలీ పనులు చేయలేకపోతోంది. భర్త మల్లికార్జునరావు ఒక్కడే నెట్టుకొస్తున్నాడు. పథకం సొమ్ములు రాకపోవటంతో సరిత వేదనకు అంతులేదు. పరిటాల, కంచికచర్ల వెళ్లి పలుసార్లు అధికారులను కలిసి విన్నవించింది. తమ కుటుంబానికి సెంటు భూమి లేదు. జరిగిన తప్పును సరిదిద్ది తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నప్పటికీ చూద్దాం చేద్దామంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారు తప్పితే కనికరించటం లేదు. దీనిపై కంచికచర్ల తహసీల్దార్ నరసింహారావును వివరణ కోరగా పరిటాల రీసర్వేలో తప్పులు దొర్లాయని, తన దృష్టికి వచ్చిన వెంటనే ఐదారు సరిచేశామని, సరితకు కూడా త్వరలో న్యాయం చేస్తామన్నారు.


సరిత పేరుతో 23.67 ఎకరాలు చూపుతున్న ఎలిజిబులిటీ చెక్


డాక్టర్ గుళ్లపల్లికి రోటరీ పురస్కారం

భారతీనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో వృత్తిపరంగా సమాజానికి విశిష్ట సేవలందించిన, నిష్ణాతులకు అందించే జీవిత సాఫల్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావుకు అందజేసినట్టు రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ అధ్యక్షురాలు డాక్టర్ వీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల విజయవాడ ఎంజీ రోడ్‌లోని ప్రముఖ హోటల్‌లో జరిగిన సమావేశంలో డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావుకు జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించామన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గుళ్లపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు ప్రపంచస్థాయి సదుపాయాలతో కంటిసేవలు అందిస్తున్నామని ఏపీ, తెలంగాణ, ఒడిశాతోపాటు వివిధ ప్రాంతాల్లో దాదాపు 320 ఐ కేర్ ఇనిస్టిట్యూట్‌లను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. రోటరీ క్లబ్ విజయవాడ కార్యదర్శి ఎస్ రవిప్రకాష్, రోటరీ డిస్ట్రిక్ పూర్వ గవర్నర్లు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, డాక్టర్ ఎంసీ దాస్, డాక్టర్ మోహన్ ప్రసాద్, ఒకేషన్ కమిటీ డైరెక్టర్స్ పొన్నం శ్రీరామ్, టీ ప్రభాకర్, డాక్టర్ వీ లీలాప్రసాద్, రోటరీ క్లబ్ సభ్యులు, మాజీ ప్రెసిడెంట్ రోటేరియన్ పీ కృష్ణాజీ పాల్గొన్నారు.




డాక్టర్ గుళ్లపల్లికి పురస్కారం అందిస్తున్న శ్రీదేవి

విద్యుదాఘాతంతో రైతు, పాడి గేదె మృతి



విస్సన్నపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వేమిరెడ్డిపల్లి గ్రామంలో నడించెరువు సమీపంలో విద్యుదాఘాతానికి గురై పాడి రైతు వేగి శ్రీనివాసరావు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం తన గేదెను మేపే క్రమంలో ఫెన్సింగ్ తీగెకు విద్యుత్ సరఫరా రావడంతో దాన్ని తాకిన గేదె షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. అది గమనించని రైతు శ్రీనివాసరావు గేదెను లేపే ప్రయత్నంలో దాన్ని తాకి షాక్ గురై మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణంలో మరొకరి మృతి



సోమవారం రాత్రి విద్యుత్‌షాక్‌కు గురై విస్సన్నపేట పట్టణానికి చెందిన మర్రిబోయిన మణికంఠ (36) అక్కడకక్కడే మృతి చెందాడు. ఇంటి ఆవరణలోని విద్యుత్ మోటార్‌కు మరమ్మతుల చేసేందుకు ప్రయత్నించగా షాక్ గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు. టీడీపీ, తాపీ వర్కర్స్ యూనియన్ నేతలు మణికంఠ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి పనీ 'వర్కవుట్' అవుతుంది

మనం ఇంట్లో రకరకాల పనులు చేస్తూ ఉంటాం. ప్రతి పనికీ కొన్ని క్యాలరీలు ఖర్చవుతూ ఉంటాయి. రోజూ శ్రద్ధగా ఇంటి పనులు చేస్తూ సులువుగా బరువు తగ్గవచ్చు అంటున్నారు నిపుణులు. ఆ వివరాలు...

- పనులన్నింటిలోకీ సులువైనది ఇల్లు ఊడవడం. కొద్దిగా వంగి మెల్లగా నడుస్తూ చీపురుతో ఇల్లు ఊడవడం అలాగే తడిగుడ్డతో ఇల్లు, ఫర్నిచర్ తుడవడం వల్ల తెలియకుండానే శారీరక శ్రమ చేసినట్లవుతుంది. తేలికపాటి వ్యాయామం చేసిన ఫలితం దక్కుతుంది.
- నిలబడి వంట చేయడం, కూరగాయలు తరగడం, వంట సామాగ్రి కోసం అటూ ఇటూ తిరగడం వల్ల కూడా అధికంగానే క్యాలరీలు ఖర్చవుతాయి. వంట పాత్రలను రుద్ది కడిగినా శరీరం శ్రమ పడుతుంది. ఈ పనులన్నీ బరువు తగ్గడానికి తోడ్పడతాయి.
- ఇంట్లో పంపు కింద బకెట్లో నీళ్లు పట్టి బట్టలు నానబెట్టి ఉతికితే శరీరానికి వ్యాయామం చేసినట్లే అవుతుంది. నేలమీద పీటపై కూర్చుని వంగి బట్టలకు సబ్బురాసి బ్రష్‌తో రుద్దుతూ ఉతకడం వల్ల వెన్నెముక, నడుము భాగాలకు శ్రమ కలుగుతుంది. బట్టలను నీళ్లలో ముంచి తీయడం, వాటినుంచి నీళ్లను పిండడం, నిటారుగా నిలబడి బట్టలు ఆరేయడం వల్ల అధికంగా క్యాలరీలు ఖర్చవుతాయి.



- నిలబడి దుస్తులు ఇస్త్రీ చేయడం కూడా మంచి వర్కౌటే. దీనివల్ల కళ్లు, చేతులు, మెడ భాగాలకు పని పెరిగి శక్తి వినియోగమవుతుంది.
- తోటపని చేయడం వల్ల కూడా క్యాలరీలు ఖర్చవుతాయి.

శిరోజాల కోసం తులసి

తులసి ఆకులతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిసిందే. ఈ తులసి ఆకులు శిరోజాలకూ పోషణనిస్తాయి. ఆ వివరాలివీ..

- తులసి ఆకులను ఎండబెట్టి పొడి చేయాలి. కొబ్బరి నూనెలో రెండు స్పూన్లు ఈ పొడిని వేసి సన్నని మంట మీద పెట్టాలి. నూనె వేడయ్యాక కొన్ని మెంతులు వేసి మరికొంతసేపు వేడి చేయాలి. చల్లారాక ఆ నూనెను మాడుకు పట్టించాలి. రెండు గంటల తరువాత తలస్నానం చేయాలి. దీనివల్ల చుండ్రు, తలలో ఉండే చిన్న కురుపులు, దురద వంటి సమస్యలు దూరమవుతాయి.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతులను రాత్రంతా నానబెట్టాలి. ఉదయం తులసి ఆకులు, టేబుల్ స్పూన్ పెరుగు వేసి ఆ మెంతులను మెత్తని పేస్టులా రుబ్బి తలకు మాస్క్ వేయాలి. అరగంట తరువాత మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే కుదుళ్లు బలంగా మారుతాయి.
- కొన్ని తులసి ఆకులను రుబ్బి, అందులో కలబంద గుజ్జును కలిపి మాడుకు, జుట్టుకు పట్టించి అరగంట తరువాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. దీని వలన చుండ్రు తగ్గడంతో పాటు కేశాలు మృదువుగా మారుతాయి.



- కొన్ని తులసి ఆకులు, కొన్ని వేప ఆకులు తీసుకుని మెత్తగా రుబ్బాలి. ఆ పేస్టులో ఒక స్పూన్ నిమ్మరసం కలిపి తలకు బాగా పట్టించి అయిదు నిమిషాలు మర్దన చేయాలి. పావుగంట తరువాత గోరువెచ్చని నీటితో తలస్నానం చేస్తే మాడుకు అంటి ఉన్న బ్యాక్టీరియా తొలగిపోయి దురద వంటి సమస్యలు తగ్గుతాయి.

న్యూస్‌మేకర్







ఇటీవల 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ... భద్రాద్రి మిల్లెట్ బిస్కెట్ల గురించి ప్రస్తావించారు. ప్రశంసల వర్షం కురిపించారు. దీంతో వీటి గురించి చర్చ మొదలైంది. భద్రాచలానికి చెందిన నలుగురు గిరిజన మహిళలు కలిసి ఈ బిస్కెట్లు తయారు చేస్తున్నారు. తమ ఉత్పత్తులకు ఇంతటి ఖ్యాతి లభిస్తుందని అస్సలు ఊహించలేదని... ప్రధాని అభినందనలు ఎనలేని ప్రోత్సాహాన్ని ఇచ్చాయని ఆ బృంద సభ్యులైన ఊకె వెంకటలక్ష్మి, తాటి లలిత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రయాణం ఎక్కడ... ఎలా మొదలైందనే విశేషాలను వారు 'నవ్య'తో పంచుకున్నారు.

మిల్లెట్ మిరాకిల్స్

"ఆరేళ్ల నుంచి మేం మిల్లెట్ బిస్కెట్లను తయారు చేస్తున్నాం. రుచితోపాటు ఆరోగ్యకరమైనవి కావడంతో వీటికి క్రమంగా డిమాండ్ పెరిగింది. ఒకసారి తిన్నవారు బంధుమిత్రుల కోసం తీసుకువెళుతుంటారు. అలా విదేశాలకు కూడా వెళ్లాయి మా బిస్కెట్లు. అక్కడివారు మమ్మల్ని సంప్రతించి బిస్కెట్లు పంపమని అడగడం మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది. ఈ మధ్య భద్రాచలం ఐటీడీఏను సందర్శించిన 'ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' (ట్రైఫెడ్) అధికారులు... మేము తయారు చేసిన మిల్లెట్ బిస్కెట్లను రుచి చూశారు. అద్భుతంగా ఉన్నాయంటూ అభినందించారు. ఈ ఏడాది మార్చి మొదటి వారంలో రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మా స్టాల్‌ను ఏర్పాటు చేశాం. అక్కడకు వచ్చినవారందరికీ బిస్కెట్లు బాగా నచ్చాయి. అలా మా మిల్లెట్ బిస్కెట్ల తయారీ అంశం ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి వెళ్లింది.

కరక్కాయ టీ పొడి...

రాగి, జొన్న బిస్కెట్ ప్యాకెట్లను ఒక్కోటి రూ.130కి సాములు, కొర్రలు బిస్కెట్ ప్యాకెట్లను ఒక్కోటి రూ.150కి విక్రయిస్తున్నాం. ఈ మధ్యే కరక్కాయ టీ పౌడర్ తయారీ ప్రారంభించాం. దీన్ని రూ.200లకు విక్రయిస్తున్నాం. పెద్ద పెద్ద మాల్స్‌లో సైతం 'భద్రాద్రి మిల్లెట్ మ్యాజిక్ బిస్కెట్లు' అందుబాటులో ఉండాలనేది మా లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అహర్నిశలూ శ్రమిస్తున్నాం. ప్రస్తుతం మా బృందంలో నలుగురం ఉన్నాం. మరో పదిమందికైనా ఉపాధి కల్పించే స్థాయికి మా వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలని కోరుకొంటున్నాం.

అలా మొదలైంది...

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపుతున్నారు... రాగి జావ, జొన్న రొట్టెలు, కొర్రల అన్నం లాంటివి తింటున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అందరికీ మిల్లెట్స్ అంటే ఆసక్తి పెరిగింది. వీటితో చిరుతిళ్లు తయారుచేసి అమ్మితే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. మొదట రాగులు, జొన్నలతో బిస్కెట్లు తయారు చేశాం. అనుకోని ఇబ్బందులు ఎన్నో ఎదురయ్యాయి. రూ.15 వేల వరకూ నష్టం వచ్చింది. అయినా మా ప్రయత్నాన్ని ఆపలేదు. ఉన్నతాధికారుల ప్రోత్సాహం, సహకారంతో రోజుకు మూడు కేజీల బిస్కెట్లను సిద్ధం చేసేవాళ్లం. ప్రస్తుతం జొన్నలు, రాగులు, సాములు, కొర్రలతో 20 కేజీల వరకు తయారు చేసి అమ్ముతున్నాం. ఇందుకోసం అవసరమయ్యే మిల్లెట్స్, ఇతర ముడి పదార్థాలను ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు మండలం తులసిపాక గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నారు. భద్రాచలం రామాలయం, ఐటీడీఏ గిరిజన మ్యూజియం, కొత్తగూడెం, ఖమ్మం కలెక్టరేట్లతో పాటు హైదరాబాద్‌లోని శిల్పారామం తదితర చోట్ల బిస్కెట్లు విక్రయిస్తున్నాం. భద్రాచలంలో స్థానికంగా రెండు కౌంటర్లను స్వయంగా, మరికొన్నింటిని ఇతరుల సహకారంతో నిర్వహిస్తున్నాం.

శానిటరీ నేప్‌కిన్స్‌తో...

వాస్తవానికి మేము తయారు చేసే బిస్కెట్లు ప్రధాని ప్రశంసించే స్థాయికి వెళతాయని అస్సలు ఊహించలేదు. నిజంగా ఇది మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసతో మా బాధ్యత పెరిగింది. ఈ విజయం మాకు అంత సులువుగా లభించలేదు. ఎన్నో ఇబ్బందులు, కష్టాలు, సవాళ్లు ఎదుర్కొని ఈ స్థాయికి చేరాం. 2019లో 'శ్రీరామా జాయింట్ లయబిలిటీ గ్రూప్'ను ఏర్పాటు చేసుకున్నాం. మొదట 'గిరి శానిటరీ నేప్‌కిన్స్' తయారీ ప్రారంభించాం. ఇవి పాత మోడల్‌లో ఉన్నాయని ఎవరూ కొనడానికి ఆసక్తి చూపలేదు. దీంతో 2020 మార్చిలో... ఐటీడీఏ అధికారుల సహకారంతో కొత్త మిషన్‌ను కొనుగోలు చేశాం. యూనిట్ కాస్ట్ రూ.13.45 లక్షలు కాగా ఇందులో రూ.8 లక్షలు ఐటీడీఏ సబ్సిడీ ఇచ్చింది. బ్యాంకు రుణం కింద రూ.4.35 లక్షలు మంజూరు కాగా మా వాటా కింద రూ.లక్ష చెల్లించాం.


అందరి సహకారంతో...

అయితే ఊహించని రీతిలో కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడం, లాక్‌డౌన్ కారణంగా నేప్‌కిన్స్ తయారీ చేపట్టలేకపోయాం. ఆ సమయంలో అధికారుల సహకారంతోనే మాస్కులు తయారు చేశాం. తరవాత నెల రోజులు కష్టపడి 40 వేల నేప్‌కిన్స్ తయారు చేసి జీసీసీకి అప్పగించాం. తరవాత మా అందరికీ ఖాళీ సమయం ఉంటుండటంతో మిల్లెట్ బిస్కట్లను తయారు చేయాలనుకున్నాం. ఈ విషయాన్ని అప్పటి ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సానుకూలంగా స్పందించి మాకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించారు. నాటి నుంచి మా మిల్లెట్ బిస్కెట్ల తయారీ కొనసాగుతూనే ఉంది.

• శ్రీపాద శ్రీధర్, భద్రాచలం

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ప్రపంచానికి బహుమతిగా 'రామాయణ'



రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న 'రామాయణ' చిత్రం శరవేగంతో తయారవుతోంది. రెండు భాగాలుగా విడుదల కానున్న ఈ ఇతిహాసాన్ని ప్రముఖ సంస్థలు ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. 'రామాయణ.. ద ఇంట్రడక్షన్' పేరుతో ఈ సినిమా గ్లింప్స్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ 'మేం చరిత్రను తిరిగి చెప్పడం లేదు.. మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం. ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శిస్తున్న కళాకారులు, సాంకేతిక నిపుణులందరినీ ఒక చోట చేర్చి ప్రామాణికంగా 'రామాయణ' చిత్రాన్ని తీస్తున్నాం. ఈ సినిమా ప్రపంచానికి మేం ఇచ్చే బహుమతి అవుతుంది' అన్నారు. ప్రామాణికంగా, భక్తిశ్రద్ధలతో 'రామాయణ' చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ఐమాక్స్ సహా ప్రపంచంలోని అన్ని పాపులర్ ఫార్మెట్స్‌లో విడుదల చేస్తామని దర్శకుడు నితీశ్ తివారి చెప్పారు. ఈ సినిమాలో కన్నడ హీరో యశ్ రావణుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా నటిస్తున్నారు.

అందుకే ఆలస్యం!



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ మల్లిడి తెరకెక్కిస్తోన్న సోషియో ఫ్యాంటసీ 'విశ్వంభర' ఎప్పుడెప్పుడు వస్తుందా అని అభిమానులు ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఈ సంక్రాంతికే రావాల్సిన ఈ సినిమా విడుదల తేదీపై ఇప్పటికీ స్పష్టత లేదు. దీంతో ఈ సినిమా ఎప్పుడొస్తుందనేది ఓ ప్రశ్నగా మారింది. ఈ నేపథ్యంలో ఆంగ్ల మీడియాతో మాట్లాడిన దర్శకుడు వశిష్ఠ, సినిమా గురించి అప్‌డేట్ ఇచ్చారు. "విశ్వంభర' ఒక్క పాట మినహా షూటింగ్ అంతా పూర్తైంది. సినిమా ఒక విజువల్ వండర్‌లా ఉంటుంది. ఆ అనుభూతినిచ్చేందుకే వీఎఫ్ఎక్స్ పనులు జరుగుతున్నాయి. వాటి నాణ్యత విషయంలో అస్సలు రాజీపడడం లేదు. అందుకే ఆలస్యం అవుతోంది. ఈ పనులు ఓ కొలిక్కి వచ్చాకే విడుదల తేదీపై స్పష్టతనిస్తాం. సినిమాలో అత్యధికంగా 4676 వీఎఫ్ఎక్స్ షాట్స్ ఉన్నాయి. అవి ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే విధంగా ఉంటాయి. ప్రపంచస్థాయి క్వాలిటీని అందివ్వడానికి టాప్ వీఎఫ్ఎక్స్ కంపెనీలు పనిచేస్తున్నాయి. చిరంజీవి ఇప్పటివరకూ చేసిన పోస్ట్ ప్రొడక్షన్ పనుల అవుట్‌పుట్ చూసి థ్రిల్లయ్యారు" అని అన్నారు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో త్రిష కథానాయికగా నటిస్తున్నారు.



తమ్ముడు ప్రేక్షకులను మెప్పిస్తాడు

- నితిన్



'నా గత చిత్రాలు ప్రేక్షకులకు ఆనందాన్ని కలిగించలేదు. కానీ 'తమ్ముడు' సినిమా మిమ్మల్ని నిరాశ పరచదు. దర్శకుడు వేణు శ్రీరామ్ ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రంగా తీర్చిదిద్దారు. ఇక నుంచి మంచి కథలతో మీ ముందుకు వస్తాను' అని హీరో నితిన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'తమ్ముడు' చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నితిన్ మాట్లాడుతూ '80 రోజులు అడవుల్లోనే ఉండి ఎన్నో ఇబ్బందులకు ఓర్చుకొని 'తమ్ముడు' షూటింగ్ పూర్తి చేశాం' అని అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'చిత్రబృందం కష్టం వల్లే 'తమ్ముడు' సినిమా అవుట్‌పుట్ బాగా వచ్చింది. దర్శకుడు శ్రీరామ్ వేణు తన విజన్‌ను అద్భుతంగా తెరపైకి తెచ్చారు. ఈ సినిమా సక్సెస్ క్రెడిట్ పూర్తిగా ఆయనకే దక్కుతుంది. నితిన్‌కు ఇది కమ్‌బ్యాక్ మూవీ అవుతుంది. రామ్‌చరణ్‌తో ఓ సూపర్ హిట్ మూవీ చేయబోతున్నాం. త్వరలో వివరాలు ప్రకటిస్తాం' అని చెప్పారు. శిరీష్ మాట్లాడుతూ "తమ్ముడు'తో నితిన్‌కు హిట్ ఇస్తామని నిర్మాతగా మాట ఇస్తున్నాను' అని అన్నారు. శ్రీరామ్ వేణు మాట్లాడుతూ 'థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం 'తమ్ముడు' సినిమాను డిజైన్ చేశాను. కుటుంబ అనుబంధాలతో పాటు వాణిజ్య హంగులు కలబోసిన చిత్రమిది' అని చెప్పారు. 'ఇందులో కొత్త తరహా పాత్ర చేశాను' అని లయ తెలిపారు. 'ఈ సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం, పాత్రల తాలూకు భావోద్వేగాలకు ప్రేక్షకులు అనుభూతి చెందుతారు' అని సప్తమి గౌడ చెప్పారు. థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాల్సిన చిత్రమిదని వర్ష బొల్లమ్మ అన్నారు.



నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు సోదరుడు శిరీష్ రెడ్డి మెగా అభిమానులకు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. 'ఇటీవల నేను ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు అపార్థాలకు దారి తీశాయి. దాని వల్ల కొందరు మెగా అభిమానులు బాధపడినట్లు తెలిసింది. 'గేమ్ ఛేంజర్' సినిమా కోసం మాకు హీరో రామ్‌చరణ్ తన పూర్తి సమయం, సహకారం అందించారు. మెగాస్టార్ చిరంజీవి కుటుంబానికి మాకు ఎన్నో ఏళ్ల నుంచి సాన్నిహిత్యం ఉంది. మేము చిరంజీవి, రామ్ చరణ్, ఇతర మెగా హీరోల ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా మాట్లాడం.. ఒకవేళ నా మాటలు ఎవరి మనోభావాలనైనా ఇబ్బంది పెట్టే విధంగా ఉంటే క్షమించండి..'అని ఆ ప్రకటనలో శిరీష్ రెడ్డి పేర్కొన్నారు.

వివాదం... క్షమాపణలు



అసలేం జరిగింది?

దిల్ రాజు నిర్మాణంలో శిరీష్ సహ నిర్మాతగా వ్యవహరించిన 'తమ్ముడు' సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా శిరీష్ రెడ్డి ఓ వీడియో ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'గేమ్ ఛేంజర్ సినిమా డిజాస్టర్ అయి మేము ఆర్థికంగా చాలా నష్టపోయాం. మేము ఇబ్బంది పడుతున్నప్పుడు హీరో రామ్‌చరణ్ గానీ, దర్శకుడు శంకర్ గానీ కనీసం ఫోన్ కూడా చేయలేదు' అని చెప్పడం వివాదాస్పదమైంది. ఆ ఇంటర్వ్యూ చూసిన మెగా అభిమానులు తీవ్ర స్థాయిలో స్పందించారు. 'ఆర్ఆర్ఆర్' తర్వాత మీకు సినిమా చేసిన హీరో మీద ఇలా విషం చిమ్మడం కరెక్టేనా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి 'గేమ్‌ఛేంజర్' సినిమా గురించి మాట్లాడొద్దు అని హెచ్చరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఈ నేపథ్యంలో శిరీష్ రెడ్డి ఇలా అభిమానులకు క్షమాపణలు తెలుపుతూ ఓ ప్రకటన విడుదల చేయడంతో వివాదం సద్దుమణిగినట్లేనని భావిస్తున్నారు.

శ్రీహరి కుటుంబం నుంచి హీరోగా



ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖ నిరోషా ప్రధాన పాత్రలుగా తోట శ్రీకాంత్ కుమార్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'థాంక్యూ డియర్'. పప్పు బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శ్రీహరి కుటుంబం నుంచి వచ్చిన ధనుష్ రఘుముద్రి హీరోగా నటిస్తోన్న ఈ చిత్రం విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

నేటి తరానికి తగిన చిత్రం



అక్షయ్, మదన్ కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'బ్లాక్ నైట్'. సతీష్ కుమార్ దర్శకత్వంలో వై.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్, పాటలను చిత్ర పరిశ్రమ పెద్దలు లాంచ్ చేశారు. ఈ సందర్భంగా కేఎల్ దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'మరోసారి వింటేజ్ తరహా సినిమాలు ప్రేక్షకులను పలకరిస్తున్నాయి. నేటి తరానికి తగ్గట్టు మరోసారి అటువంటి సినిమాలను తీసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. కార్యక్రమంలో ప్రతాని రామకృష్ణ గౌడ్, దర్శకుడు సతీష్ కుమార్, నిర్మాత వెంకటేశ్వర రావు మాట్లాడారు.

బుమ్రా ఆడేనా?

- ఎటూ తేల్చుకోలేని టీమిండియా
- రెండో స్పిన్నర్‌గా కుల్దీప్?
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఏకంగా ఐదు శతకాలు నమోదైనా.. టీమిండియాకు నిరాశ తప్పలేదు. ఈనేపథ్యంలో గిల్ సేన బుధవారం నుంచి ఎడ్జ్‌బాస్టన్‌లో రెండో టెస్టుకు సిద్ధమైంది. అంతకంటే ముందు జట్టు కూర్పుపై అత్యంత ఆసక్తి నెలకొంది. హెడింగ్లేలో పేసర్ బుమ్రా మాత్రమే ఆకట్టుకోగా..అతనికి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కింద ఈ టెస్టుకు విశ్రాంతినిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. అసలే బలహీనంగా కనిపిస్తున్న బౌలింగ్ విభాగంలో బుమ్రా లేకపోతే పరిస్థితేమిటి? అని సర్వత్రా చర్చ జరుగుతోంది. అయితే బుమ్రా జట్టు ఎంపికకు అందుబాటులోనే ఉంటాడని కెప్టెన్ గిల్ తేల్చాడు. కానీ మ్యాచ్ రోజు ఉదయం పిచ్ పరిస్థితిని చూశాకే అతడి ప్రాతినిథ్యంపై నిర్ణయానికి వస్తామని పేర్కొన్నాడు. ఈ సిరీస్‌కు ముందే బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని కోచ్ గంభీర్ ప్రకటించిన విషయం తెలిసిందే. కానీ తొలి టెస్టు పరాజయం తర్వాత అతడు లేకుండా రెండో మ్యాచ్‌కు వెళ్లడం సరైన నిర్ణయం అనిపించుకోదని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు ఆతిథ్య ఇంగ్లండ్ మాత్రం ఎలాంటి మార్పుల్లేకుండా ఇప్పటికే తుది జట్టును కూడా ప్రకటించింది. మరోవైపు ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో భారత్ ఇప్పటివరకు గెలిచిందిలేదు. ఆడిన 8 టెస్టుల్లో ఏడు ఓడి, ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. 2022లో ఇక్కడ ఆడిన చివరి టెస్టులో భారత్‌పై 378 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఇంగ్లండ్ నెగ్గింది.

తుది కూర్పుపై మల్లగుల్లాలు



రెండో టెస్టులో ఎవరిని ఆడించాలనే విషయం కోచ్ గంభీర్, కెప్టెన్ గిల్‌కు సవాల్‌గా మారింది. పేసర్ బుమ్రాపై ఎటూ తేల్చుకోలేని పరిస్థితి నెలకొంది. మూడో పేసర్‌గా ఆకాశ్, అర్ష్‌దీప్‌లలో ఎవరివైపు మొగ్గు చూపాలి? అలాగే జడేజాకు తోడు మరో స్పిన్నర్‌గా ఎవరిని ఆడించాలి? శార్దూల్‌ను పక్కనబెట్టి నితీశ్‌ను ఆడిస్తే ఎలా ఉంటుంది? విఫలమైన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్‌లను కొనసాగించాలా? ఇలా టీమ్ మేనేజ్‌మెంట్‌ను అనేక ప్రశ్నలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తొలి టెస్టులో మరో స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడంతో ఇంగ్లండ్ భారీ లక్ష్యాన్ని సులువుగా ఛేదించింది. ముఖ్యంగా స్పిన్నర్ కుల్దీప్‌ను ఆడించి ఉంటే బావుండేదనే కామెంట్స్ వినిపించాయి. కుల్దీప్‌ను తీసుకుంటారా? లేక ఎనిమిదో నెంబర్‌లో బ్యాటింగ్ చేయగల సుందర్‌ను ఆడిస్తారా? అనేది వేచిచూడాల్సిందే. ఇక ఆల్‌రౌండర్ కోటాలో శార్దూల్ ఠాకూర్ అంచనాలను అందుకోలేకపోయాడు. దీంతో నితీశ్ కుమార్‌ను ఆడించే అవకాశం కనిపిస్తోంది. మరోవైపు బుమ్రా ఆడకపోతే పేస్ విభాగం సిరాజ్, ప్రసిద్ధ్, ఆకాశ్‌దీప్‌లతో బరిలోకి దిగవచ్చు. ఇక బ్యాటింగ్‌లో జైస్వాల్, రాహుల్, గిల్, పంత్ శతకాలతో అదుర్స్ అనిపించారు. కానీ రెండు ఇన్నింగ్స్‌లోనూ చివరి వరుస బ్యాటర్లు విఫలం కావడం ప్రభావం చూపింది. ఒక విధంగా మ్యాచ్ కోల్పోయేందుకు కూడా కారణమయ్యారు. అలాగే ఫీల్డింగ్‌లో జైస్వాల్ వదిలేసిన క్యాచ్‌లతో జట్టు గట్టి మూల్యమే చెల్లించుకుంది. అందుకే ఈసారి అన్ని లోపాలను సరిదిద్దుకుని పకడ్బందీగా బరిలోకి దిగాలని భారత్ భావిస్తోంది.

మార్పుల్లేకుండానే..

తొలి టెస్టు విజయంతో ఉత్సాహంగా ఉన్న ఇంగ్లండ్ తమ తుది జట్టులో ఎలాంటి మార్పులూ చేయలేదు. నాలుగేళ్ల తర్వాత టెస్టులకు ఎంపికైన పేసర్ ఆర్చర్ కుటుంబ కారణాలరీత్యా ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేడు. అయితే క్రిస్ వోక్స్ నేతృత్వంలోని పేస్ విభాగం పటిష్ఠంగానే కనిపిస్తోంది. భారత్ రెండు ఇన్నింగ్స్‌లోనూ టెయిలెండర్లను స్వల్ప స్కోర్లకే కట్టడి చేయడంలో విజయం సాధించారు. టంగ్, కార్స్, కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్‌లో రాణించారు. అటు బ్యాటింగ్‌లోనూ ఎనిమిది మంది బ్యాటర్లతో అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. క్రాలే, డకెట్, పోప్, రూట్, స్టోక్స్, స్మిత్ మరోసారి భారత బౌలర్లపై ఆధిక్యం ప్రదర్శించాలనుకుంటున్నారు.

తుది జట్లు

భారత్ (అంచనా): జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, గిల్, పంత్, జడేజా, నితీశ్/శార్దూల్, కుల్దీప్/సుందర్, బుమ్రా/ఆకాశ్, సిరాజ్, ప్రసిద్ధ్.

ఇంగ్లండ్: క్రాలే, డకెట్, పోప్, రూట్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), స్మిత్, వోక్స్, కార్స్, టంగ్, బషీర్.

పిచ్, వాతావరణం: ఎడ్జ్‌బాస్టన్ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. చివరి 10 టెస్టుల్లో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 334గా ఉంది. ఇక ఆరంభంలో పేసర్లు ప్రభావం చూపిస్తారు. చివరి రోజు స్పిన్నర్లు కీలకమవుతారు. తొలి రోజు చిరుజల్లులకు ఆస్కారం ఉంది.

నిఖత్‌కు రజతం

నిహారికకు కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ ఎలీట్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ బాక్సర్లు మూడు పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు మంగళవారం ముగిశాయి. రైల్వేస్ జట్టు 9 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ 48 కిలోల విభాగం ఫైనల్లో గాయం కారణంగా ప్రత్యర్థికి వాకోవర్ ఇవ్వడంతో రజతంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. 60 కి., కేటగిరీలో తెలంగాణకు చెందిన గోనెల్ల నిహారిక, 65 కిలోల విభాగంలో యషి శర్మ కాంస్యాలు సాధించారు.

నెలకు రూ. 4 లక్షలు చెల్లించాలి

● విడాకుల కేసులో షమికి హైకోర్టు ఆదేశం


(ఫైల్ ఫొటో)

కోల్‌కతా: విడాకుల కేసులో టీమిండియా ఆటగాడు మహ్మద్ షమికి హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నిర్వహణ ఖర్చుల కింద మాజీ భార్య హసీన్ జహా, కుమార్తెకు కలిపి నెలకు రూ. 4 లక్షలు చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పింది. ఇందులో హసీన్‌కు రూ. 1.5 లక్షలు, కూతురికి రూ. 2.50 లక్షలు ఇవ్వాల్సి ఉంటుంది. జిల్లా కోర్టు జహాకు రూ. 50 వేలు, అతడి కూతురుకు రూ. 80 వేలు చెల్లించాలని తీర్పు నిచ్చింది. దీన్ని జహా హైకోర్టులో సవాల్ చేసింది.

దక్షిణాఫ్రికా ఘనవిజయం

బులవాయో: దక్షిణాఫ్రికా ఖాతాలో మరో ఘనవిజయం చేరింది. బ్యాటింగ్‌లో శతకం బాదిన కార్బిన్ బాష్ బౌలింగ్‌లోనూ చెలరేగి ఐదు వికెట్లతో రాణించాడు. దీంతో జింబాబ్వేతో నాలుగు రోజుల్లోనే ముగిసిన తొలి టెస్టులో సఫారీలు 328 పరుగుల తేడాతో గెలుపొందారు. 537 పరుగుల భారీ లక్ష్యం కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 208 పరుగులకే కుప్పకూలింది. అంతకుముందు దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 418/9 డిక్లేర్, రెండో ఇన్నింగ్స్‌లో 369 పరుగులు చేయగా.. జింబాబ్వే తొలి ఇన్నింగ్స్‌లో 251 పరుగులకు పరిమితమైంది.

'నీరజ్ చోప్రా క్లాసిక్' నుంచి పీటర్స్ అవుట్

బెంగళూరు: నీరజ్ చోప్రా క్లాసిక్ జావెలిన్ త్రో ఈవెంట్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) చీలమండ గాయంతో తప్పుకొన్నాడు. అతని స్థానంలో సిప్రియాన్ (పోలెండ్) ఆడనున్నాడు.

క్రీడలకు కొత్త జోష్



- టార్గెట్ 2047గా నూతన జాతీయ స్పోర్ట్స్ పాలసీ
- 'ఖేలో భారత్ నీతి'గా నామకరణం
- టాప్-5 క్రీడా దేశాల్లో చేరాలని లక్ష్యం
- 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం పోటీ

న్యూఢిల్లీ: కొత్త జాతీయ స్పోర్ట్స్ పాలసీకి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది. మంగళవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి 'ఖేలో భారత్ నీతి' అని నామకరణం చేశారు. 2047 నాటికి ప్రపంచంలో టాప్-5 క్రీడా దేశాల్లో భారత్ ఒకటిగా నిలబడాలనే లక్ష్యంతో ఈ పాలసీని రూపొందించినట్టు ప్రధాని మోదీ తెలిపారు. కొత్త పాలసీలో ఐదు ప్రధాన అంశాలను పొందుపరిచారు. ప్రపంచ వేదికలపై సత్తా చాటడం, ఆర్థిక అభివృద్ధిలో క్రీడారంగం భాగస్వామ్యం, సామాజిక అభివృద్ధిలో క్రీడల పాత్ర, ప్రజా ఉద్యమంగా క్రీడలు, జాతీయ విద్యా విధానంలో క్రీడలకు చోటు అనే ఐదు అంశాలకు కొత్త పాలసీలో ప్రాధాన్యత ఇచ్చారు. ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించడం, క్రీడా సంబంధిత పర్యాటకం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక అభివృద్ధికి దోహదం, ఆదివాసీ, వెనుకబడిన వర్గాలు, మహిళలను క్రీడారంగంలో రాణించేందుకు ప్రోత్సహించడం, జాతీయ విద్యా విధానంలో క్రీడలను తప్పనిసరి అధ్యాయంగా చేర్చడం, ఇవన్నీ అమలయ్యేందుకు ప్రత్యేక పరిపాలన వ్యవస్థను రూపొందించాలనే అంశాలకు పాలసీలో ప్రాముఖ్యత ఇచ్చారు.

1984లో తొలిసారి...: స్పోర్ట్స్ పాలసీ 1984లో తొలిసారి అమల్లోకి రాగా 2001లో చివరిసారిగా ఆధునీకరించారు. 2014 తర్వాత బీజేపీ ప్రభుత్వం వచ్చాక ఖేలో ఇండియా, టాప్స్ వంటి పథకాలను ప్రవేశపెట్టారు. 2028లో జరిగే తదుపరి ఒలింపిక్స్‌లో భారత పతకాల సంఖ్య రెండు అంకెలకు చేరాలని కేంద్ర క్రీడాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల కోసం కూడా భారత్ ప్రయత్నాలు చేస్తోంది.

అహ్మదాబాద్‌లో ఒలింపిక్స్..: భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష బృందం లాసన్నేలోని అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) ప్రధాన కార్యాలయానికి మంగళవారం వెళ్లింది. 2036 ఒలింపిక్స్ ఆతిథ్యానికి ఇప్పటికే సన్నద్ధత లేఖను ఇచ్చిన ఐఓఏ, భారత్‌లో విశ్వక్రీడల నిర్వహణకు ఉన్న వనరుల గురించి ఐఓసీ ప్రతినిధులకు ఉష బృందం వివరించింది. అహ్మదాబాద్ వేదికగా ఒలింపిక్స్ నిర్వహణ ప్రతిపాదనల గురించి చర్చించారు. ఉష బృందంలో కేంద్ర, గుజరాత్ క్రీడా శాఖ అధికారులు, ఐఓఏ ప్రతినిధులు ఉన్నారు.

పెగులా, జ్వెరెవ్‌కు షాక్

- సినర్, స్వియటెక్, క్రెజికోవా ముందుకు
- వింబుల్డన్


పెగులా

లండన్: వింబుల్డన్‌లో రెండో రోజు సీడెడ్ ప్లేయర్లకు చుక్కెదురైంది. పురుషుల, మహిళల విభాగాల్లో మూడో సీడ్ క్రీడాకారులు అలెగ్జాండర్ జ్వెరెవ్, జెస్సికా పెగులా, ఐదో సీడ్ క్విన్‌వెన్ జాంగ్‌లకు తొలి రౌండ్‌లోనే షాక్ తగిలింది. అయితే, టాప్ సీడ్ జానిక్ సినర్, డిఫెండింగ్ చాంప్ బార్బరా క్రెజికొవా, స్వియటెక్ అలవోకగా రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పెగులా (అమెరికా) 2-6, 3-6తో ఎలిజబెత్ కికియారిటో (ఇటలీ) చేతిలో, చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 5-7, 6-4, 1-6తో సినియకొవా (చెక్) చేతిలో, 15వ సీడ్ ముచోవా 5-7, 2-6తో వాంట్ (చైనా) చేతిలో పరాజయం పాలయ్యారు. కాగా, 8వ సీడ్ స్వియటెక్ 7-5, 6-1తో కుదెర్మెటోవాపై, 17వ సీడ్ క్రెజికొవా 3-6, 6-2, 6-1 అలెగ్జాండ్రా (ఫిలిప్పీన్స్)పై, ఆండ్రీవ 6-3, 6-3తో మయర్ షరీఫ్‌పై, కసట్‌కినా (ఆస్ట్రేలియా) 7-5, 6-3 ఎమిలియానా (కొలంబియా)పై, అలెగ్జాండ్రోవా 6-2, 7-5తో ప్రిసిల్లాపై, సంసనోవా 6-3, 6-2తో జాయింట్‌పై, నవారో 6-3, 6-1తో క్విటోవా (చెక్)పై గెలిచారు.

సినర్ అలవోకగా..: పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సినర్ 6-4, 6-3, 6-0తో లూకా నార్డీని, ఐదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 6-7(6), 6-7(8), 6-4, 7-6(6), 6-4తో పెరికార్డ్‌ను, మినార్ 6-2, 6-2, 7-6(2)తో రాబర్టో (స్పెయిన్)ను ఓడించారు. అయితే, మూడో సీడ్ జ్వెరెవ్ 6-7(3), 7-6(8), 3-6, 7-6(5), 4-6తో ఆర్థర్ రెండర్‌కెంచ్ (ఫ్రాన్స్) చేతిలో, ముసెట్టి (ఇటలీ) 2-6, 6-4, 5-7, 1-6తో నికోలజ్ బాసిల్లాష్‌విలి (జార్జియా) చేతిలో పరాజయం పాలయ్యారు.

రూ.11.65 లక్షల కోట్లు

గత ఆర్థిక సంవత్సరం రెమిటెన్స్‌ల్లో సరికొత్త రికార్డు



న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ప్రవాస భారతీయులు స్వదేశానికి రికార్డు స్థాయిలో 13,546 కోట్ల డాలర్ల (దాదాపు రూ.11.65 లక్షల కోట్లు) నిధులు పంపారు. ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం.. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)తో పోలిస్తే, దేశంలోకి రెమిటెన్స్‌లు 14 శాతం పెరిగాయి. 8 ఏళ్ల క్రితం (2016-17 ఆర్థిక సంవత్సరం) వచ్చిన 6,100 కోట్ల డాలర్ల (రూ.5.25 లక్షల కోట్లు) రెమిటెన్స్‌లతో పోలిస్తే రెట్టింపునకు పైగా పెరిగాయి. మరిన్ని విషయాలు..

- ప్రపంచంలో అత్యధిక రెమిటెన్స్‌లు అందుకున్న దేశాల్లో భారత్ మరోసారి తన అగ్రస్థానాన్ని కొనసాగించింది. ఈ విషయంలో భారత్ పదేళ్లకు పైగా కాలంగా నం.1 స్థానంలో ఉంది.
- గత ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్ల డాలర్లుగా నమోదైన కరెంట్ ఖాతా నిధుల రాకలో 10 శాతానికి పైగా వాటా రెమిటెన్స్‌లదే.
- ఆర్‌బీఐ రీసెర్చ్ ప్రకారం.. మొత్తం రెమిటెన్స్‌లో 45 శాతం అమెరికా, బ్రిటన్, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచే వస్తున్నాయి. గతంలో అధిక రెమిటెన్స్‌లు సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్ వంటి గల్ఫ్ దేశాల నుంచి వచ్చేవి. గడిచిన కొన్నేళ్లలో గల్ఫ్ దేశాల వాటా క్రమంగా తగ్గుతూ వస్తోంది. భారత వృత్తి నిపుణులు అభివృద్ధి చెందిన దేశాలకు వలస పోతుండటం ఇందుకు కారణం.
- రెమిటెన్స్‌లు మన వాణిజ్య లోటును తగ్గించడంలో, ఆర్థిక వ్యవస్థ బలోపేతంలోనూ ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. 2024-25లో మన వాణిజ్య లోటు 28,700 కోట్ల డాలర్లు. ఈ లోటులో 47 శాతం వరకు రెమిటెన్స్‌లతో పూడ్చుకోవచ్చన్నమాట.

హైదరాబాద్‌లో ఎస్‌బీఐ గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) 70వ వార్షికోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాణిజ్య లావాదేవీలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా మంగళవారం నాడు హైదరాబాద్ సహా కోల్‌కతాలో రెండు గ్లోబల్ ట్రేడ్ ఫైనాన్స్ సెంటర్స్ (జీటీఎఫ్‌సీ)ను ప్రారంభించింది. ఈ కేంద్రాల ద్వారా ఎగుమతి, దిగుమతిదారులకు త్వరితగతిన అవసరమైన అందించనున్నట్లు ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి వెల్లడించారు. అంతర్జాతీయ బ్యాంకింగ్ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యూహాత్మకంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అంతర్జాతీయ వాణిజ్యం రోజురోజుకి డిజిటలైజ్ అవుతోంది. దీంతో మారుతున్న జాతీయ, అంతర్జాతీయ వాణిజ్య అవసరాలకు అనుగుణంగా బ్యాంక్ ఫైనాన్స్ సామర్థ్యాలను పునర్ వ్యవస్థీకరించాల్సిన అవసరం ఏర్పడిందని, ఈ రెండు కేంద్రాల ద్వారా ఆ లక్ష్యం నెరవేరుతుందని శెట్టి తెలిపారు.

సెప్టెంబరు నుంచి మెరుగైన లాభాలు: ఆర్‌బీఐ రెపో రేటు తగ్గింపుతో ప్రస్తుతం బ్యాంకుల లాభాలపై ఒత్తిడి ఉన్న మాట నిజమేనని ఎస్‌బీఐ ఛైర్మన్ శెట్టి చెప్పారు. అయితే సెప్టెంబరు తర్వాత బ్యాంకుల లాభాలు మళ్లీ గాడిలో పడతాయని ఆశిస్తున్నట్టు ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తెలిపారు. నగదు నిల్వల నిష్పత్తి (సీఆర్‌ఆర్)ని 4 నుంచి 3 శాతానికి కుదిస్తూ ఇటీవల ఆర్‌బీఐ తీసుకున్న నిర్ణయంతో సెప్టెంబరు నుంచి తమ నిధుల సమీకరణ ఖర్చులూ తగ్గుతాయన్నారు.

స్వల్ప లాభంతో సరి

90 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై: మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో కొనుగోళ్లు ప్రామాణిక సూచీలను మంగళవారం లాభాల్లో నడిపించాయి. ఒక దశలో 267.83 పాయింట్లు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 90.83 పాయింట్ల స్వల్పలాభంతో 83,697.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 24.75 పాయింట్లు పెరిగి 25,541.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 13 లాభపడగా.. మిగతా 17 నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్ షేరు 2.51 శాతం ఎగిసి సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. రిలయన్స్ స్టాక్ 1.84 శాతం పెరిగింది. బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు మాత్రం 0.18 శాతం వరకు నష్టపోయాయి.

సిగాచీ షేరు మరో 6 శాతం పతనం: హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ షేరు వరుసగా రెండో రోజూ భారీ పతనాన్ని చవిచూసింది. బీఎస్ఈలో కంపెనీ షేరు మరో 6 శాతం మేర క్షీణించి రూ.46.07 వద్ద ముగిసింది.

కీలక ఖనిజాలపై ఎన్ఎండీసీ దృష్టి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ విదేశాల్లో కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తికి సిద్ధమవుతోంది. ఇందుకోసం ఆఫ్రికా, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాల్లో ఇప్పటికే ఈ ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిలో ఉన్న కంపెనీలను కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఇందుకోసం కంపెనీ ఇప్పటికే దుబాయ్‌లో ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసింది. ఈ కార్యాలయం ద్వారా ఆఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల్లోని కీలక ఖనిజ ఉత్పత్తి కంపెనీలపై దృష్టి పెడుతుంది. ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో కోకింగ్ కోల్, చిలీ, ఆఫ్రికా దేశాల్లో లిథియం, ఇనుప ఖనిజం, రాగి, కోబాల్ట్ గనుల కోసం ఎన్ఎండీసీ అన్వేషిస్తోంది.

ధరల తగ్గింపు: టన్ను ఇనుప ఖనిజం (లంప్) ధరను రూ.6,300 నుంచి రూ.5,700కు, ఫైన్స్ క్వాలిటీ ఖనిజం ధరను రూ.5,350 నుంచి రూ.4,850కి తగ్గించినట్టు ఎన్ఎండీసీ ప్రకటించింది. ఈ తగ్గింపు వెంటనే అమల్లోకి వచ్చినట్టు తెలిపింది.

ఆటో డీలా

జూన్ అమ్మకాల్లో రెండంకెల క్షీణత

న్యూఢిల్లీ: మార్కెట్లో కార్లకు డిమాండ్ భారీగా తగ్గింది. ఫలితంగా జూన్ నెలలో ఆటో అమ్మకాలు గణనీయంగా పడిపోయాయి. ఆటో రంగ దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్ ఇండియా, టాటా మోటార్స్ అమ్మకాల్లో రెండంకెల క్షీణతను నమోదు చేశాయి. చిన్న కార్లకు ఆదరణ తగ్గడమే అమ్మకాల్లో ఈ భారీ క్షీణతకు కారణం. మారుతి సుజుకీ..గత నెలలో 1,18,906 కార్లను మాత్రమే విక్రయించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన 1,37,160 యూనిట్ల విక్రయాలతో పోల్చితే ఇది 13 శాతం తక్కువ. మినీ కార్ విభాగంలోకి వచ్చే ఆల్టో, ఎస్-ప్రెసో కార్ల అమ్మకాలు గత ఏడాది జూన్‌తో పోల్చితే 9,395 యూనిట్ల నుంచి 6,414 యూనిట్లకు పడిపోయాయి. కాంపాక్ట్, యుటిలిటీ వాహనాల అమ్మకాలు కూడా నిరాశావహంగానే ఉన్నాయి. మరోవైపు హ్యుండయ్ మోటార్ ఇండియా అమ్మకాలు 12 శాతం క్షీణించి 50,103 నుంచి 44,024 కార్లకు పరిమితం అయ్యాయి.

కంపెనీ	అమ్మకాలు (జూన్ 2025)	అమ్మకాలు (జూన్ 2024)	క్షీణత/ వృద్ధి (%)
టాటా మోటార్స్	37,083	43,524	- 15
ఆడి	2,128	2,477	- 14
మహీంద్రా	47,306	40,022	+ 18
టీకేఎం	28,869	27,474	+ 5
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ	5,829	---	+ 21
టూవీలర్ కంపెనీలు			
బజాజ్ ఆటో	1,88,460	2,16,451	- 13
టీవీఎస్ మోటార్	2,81,012	2,55,734	+ 10
రాయల్ ఎన్‌ఫీల్డ్	76,957	66,117	+ 16
హోండా మోటార్ సైకిల్	4,29,247	5,18,799	- 17

బిజినెస్



జీఎస్‌టీ వసూళ్లు రూ.1.84 లక్షల కోట్లు

జూన్‌లో 6.2 శాతం వృద్ధి నమోదు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జూన్‌లో వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 6.2 శాతం వృద్ధితో రూ.1.84 లక్షల కోట్లకు చేరాయి. అయితే, ఈ ఏప్రిల్, మే నెలల్లో నమోదైన రూ.2 లక్షల కోట్లకు పైగా వసూళ్లతో పోలిస్తే గణనీయంగా తగ్గాయి. 2024 జూన్‌లో జీఎస్‌టీ స్థూల ఆదాయం రూ.1.74 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ వసూళ్లు సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.2.37 లక్షల కోట్లకు పెరగగా.. మే నెలలో రూ.2.01 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. గత నెలలో జీఎస్‌టీ రిఫండ్లు 28.4 శాతం పెరిగి రూ.25,491 కోట్లకు చేరాయి. దాంతో, జీఎస్‌టీ నికర వసూళ్లు రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. గత జూన్‌తో పోలిస్తే, నికర ఆదాయంలో 3.3 శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే నెలతో పోలిస్తే మాత్రం 8.48 శాతం తగ్గాయి.

తొమ్మిదో వసంతంలోకి జీఎస్‌టీ: జీఎస్‌టీ చట్టం అమలులోకి వచ్చి 8 ఏళ్లు పూర్తయ్యాయి. మంగళవారం తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టింది. జీఎస్‌టీ దేశ ఆర్థిక దృశ్యాన్ని పునర్నిర్మించిన మైలురాయి సంస్కరణ అని ప్రధాని మోదీ ఈ సందర్భంగా అన్నారు. "నిబంధనల భారాన్ని తగ్గించడం ద్వారా దేశంలో వ్యాపార నిర్వహణను, ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల కార్యకలాపాలను మరింత మెరుగుపరిచింది. అంతే కాదు, ఆర్థిక వృద్ధికి చోదకంగా మారింది" అని ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ (గతంలో ట్విటర్)లో ప్రధాని పోస్ట్ చేశారు.

జీఎస్‌టీ ఇకపై సులభతర వ్యాపార నిర్వహణను ప్రోత్సహించడం, పన్ను చెల్లింపుదారుల్లో బలమైన నమ్మతి, ఆర్థిక సమ్మిళితాన్ని పెంపొందించడంపై దృష్టిసారించనుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశవ్యాప్తంగా ఏకరీతి పరోక్ష పన్నుల విధానాన్ని అమలు చేసేందుకు 17 రకాల స్థానిక పన్నులు, 13 రకాల సుంకాల విలీనం ద్వారా రూపొందించిన జీఎస్‌టీ చట్టం 2017 జూలై 1 నుంచి అమలులోకి వచ్చింది.

తెలంగాణలో

ఈ జూన్‌లో తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 7 శాతం పెరిగి రూ.5,653 కోట్లకు చేరింది..

గత నెల గణాంకాలు (రూ.కోట్లు)	
సెంట్రల్ జీఎస్‌టీ	34,558
స్టేట్ జీఎస్‌టీ	43,268
ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ	93,280
సుంకం ఆదాయం	13,491
మొత్తం	1,84,597

ఆధార్ ఉంటేనే పాన్ కార్డు

న్యూఢిల్లీ: పాన్ కార్డు జారీని ప్రభుత్వం మరింత కట్టుదిట్టం చేసింది. ఇక నుంచి ఎవరికైనా కొత్తగా పాన్ కార్డు కావాలంటే వారి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ కూడా సమర్పించాలి. ఈ నిబంధన మంగళవారం నుంచే అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు ఎవరికైనా పాన్ కార్డు కావాలంటే వారి పేరు, పుట్టిన తేదీ గుర్తింపు పత్రాలు లేదా ఇతర ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు సమర్పిస్తే సరిపోయేది. పన్ను ఎగువేతలను మరింత పక్కాగా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఈ తాజా చర్య తీసుకుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	90	విజయవాడ	90
వరంగల్	90	గుంటూరు	95
కరీంనగర్	90	ఒంగోలు	98
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	93
కర్నూలు	90	నెల్లూరు	98
విశాఖపట్నం	79	అనంతపురం	98
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,400 ▲	90,020 ▲	1,20,000 ▲
విజయవాడ	99,000 ▲	93,000 ▲	1,09,500 ▲
విశాఖపట్నం	1,00,670 ▲	90,200 ▲	1,20,000 ▲
రాజమండ్రి	98,400 ▲	90,200 ▲	1,09,000 ▼
ప్రొద్దుటూరు	97,300 ▲	89,520 ▲	1,07,000 ▲
ముంబై	97,430 ▲	89,246 ▲	1,06,963 ▲

గృహిణులతో 'గ్రూప్-1' దిద్దించారు!

- మధుసూదన్ ఖాతా నుంచే నగదు బదిలీ
- ఆయన బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదు: పీపీ మెండ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడడంతోపాటు నిధులు దుర్వినియోగం చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ క్యామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్(ఏ2) వేసిన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు ముగిశాయి. దీంతో న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై విజయవాడ పోలీసులు నమోదు చేసిన కేసులో ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు(ఏ1), మధుసూదన్(ఏ2)ను నిందితులుగా పేర్కొన్నారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మధుసూదన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా మధుసూదన్‌కు కిడ్నీ, గాల్ బ్లాడర్‌కు సంబంధించి వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి నివేదికను కోర్టుముందు ఉంచాలని విజయవాడ జైలు సూపరింటెండెంట్‌ను హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. మంగళవారం మరోసారి విచారణకురాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. పిటిషనర్ అకౌంట్ నుంచే చెల్లింపులు చేశారన్నారు. మధుసూదన్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపించారు.

పిన్నెల్లి సోదరులపై తొందరపాటు చర్యలు వద్దు

- టీడీపీ నేతల హత్యల కేసులో పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావుల హత్య కేసు విషయంలో నిందితులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకటరామిరెడ్డిలపై పది రోజులపాటు ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పల్నాడుజిల్లా, వెల్దుర్తి మండలం, గుండ్లపాడుకు చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులు హత్యకు గురయ్యారు. పోలీసులు మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడిపై కేసు నమోదుచేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా ఫిర్యాదుదారుడి తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. వ్యాజ్యంలో ఇంప్లీడ్ అయ్యేందుకు అనుమతించాలని, తమ వాదనలు కూడా వినాలని కోరారు. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఓ. మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అరెస్టు నుండి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ స్పందిస్తూ.. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దన్నారు.

జైలు వద్ద చెవిరెడ్డి హల్‌చల్

విజయవాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి) : మద్యం కేసులో అరెస్టయినప్పటి నుంచి నానా హడావుడి చేస్తున్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మరోసారి అదే చేశారు. విజయవాడ జైలు నుంచి సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని బయటకు రాగానే చెవిరెడ్డి రెచ్చిపోయారు. మీడియాను చూడగానే స్వరం పెంచి కేకలు వేశారు. తనపై అన్యాయంగా కేసు పెట్టారని ఆరోపించారు. జరుగుతున్న పరిణామాలను పై నుంచి దేవుడు చూస్తున్నాడన్నారు. రాజమౌళి, సుకుమార్ వంటి గొప్పగొప్ప దర్శకులు, నటులు సిట్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరినీ వదలబోమంటూ హెచ్చరిస్తూ పోలీసు జీపు ఎక్కారు. కాగా, మద్యం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి పీఏలను మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి సిట్ పోలీసులు విజయవాడకు తీసుకొచ్చారు. బాలాజీ యాదవ్, నవీన్‌లను ఇండోర్‌లో సిట్ పోలీసులు సోమవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారిని అక్కడ 10/1 జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై విమానంలో విజయవాడకు తీసుకొచ్చారు. వారిని ఏసీబీ కోర్టులో బుధవారం హాజరుపరుస్తారు.

మంగళగిరి ఎయిమ్స్‌లో ర్యాగింగ్



- జూనియర్‌కు సీనియర్ల తీవ్ర వేధింపులు
- 13 మంది వైద్య విద్యార్థులపై సస్పెన్షన్ వేటు
- సస్పెండైన వారిలో ఎయిమ్స్ డీన్ కుమారుడు

మంగళగిరి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)లో ర్యాగింగ్ భూతం రెచ్చిపోయింది. ఓ జూనియర్‌ను సీనియర్ వైద్య విద్యార్థులు తీవ్రంగా వేధించారు. దీంతో మనస్థాపం చెందిన బాధిత విద్యార్థి బలవన్మరణానికి ప్రయత్నించాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ర్యాగింగ్ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. తిరుపతికి చెందిన బాధిత విద్యార్థి వైద్య విద్యను అభ్యసించేందుకు గతేడాది గుంటూరు జిల్లా, మంగళగిరిలో ఉన్న ఎయిమ్స్‌లో చేరాడు. అయితే ఎయిమ్స్‌లో సదరు విద్యార్థికి, 2023 బ్యాచ్ సీనియర్లకు మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నట్టు సమాచారం. తమ గురించి పలువురు వైద్య విద్యార్థినుల వద్ద జూనియర్ విద్యార్థి తప్పుగా మాట్లాడినట్టు సీనియర్లు అనుమానించారు. దీంతో కక్ష పెంచుకుని.. ఆ జూనియర్‌ను గత నెల 23 నుంచి 25వ తేదీ వరకు వసతి గృహంలో పలుమార్లు నిర్బంధించి ర్యాగింగ్ పేరిట కొట్టడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన బాధిత విద్యార్థి చేయి కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. తీవ్ర రక్తస్రావం కావడాన్ని గమనించిన తోటి విద్యార్థులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందించడంతో ఆ విద్యార్థి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ విషయంపై ఢిల్లీలోని యూజీసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. స్పందించిన యూజీసీ అధికారులు వెంటనే ఎయిమ్స్ అధికారులతో మాట్లాడారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిమ్స్ ఉన్నతాధికారుల బృందం విచారణ జరిపి ర్యాగింగ్ జరిగినట్టు ప్రాథమికంగా నిర్ధారించింది. బాధ్యులుగా 13 మంది సీనియర్ విద్యార్థులను గుర్తించి సస్పెండ్ చేశారు. వీరిలో మంగళగిరి ఎయిమ్స్ డీన్ కుమారుడు కూడా ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనలో మరో ఐదుగురి ప్రమేయం కూడా ఉన్నట్టు తెలిసింది. విచారణ తర్వాత సదరు విద్యార్థులపై కూడా చర్యలకు ఎయిమ్స్ యాజమాన్యం సిద్ధపడుతున్నట్టు సమాచారం.

ఎన్నికల్లో ఎవరెవరికి

ఎన్నికోట్లు పంచారు?



పోలీసు కస్టడీ ముగిసిన తర్వాత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

(మొదటి పేజీ తరువాయి)

పట్టుబడ్డ డబ్బులతో మీ మిత్రుడు వెంకటేశ్ నాయుడికి(ఏ-34) సంబంధం ఏంటి?...... అంటూ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) అధికారులు ప్రశ్నలవర్షం కురిపించారు. మద్యం కుంభకోణం కేసులో విచారణకు గతంలో హాజరైన వారంతా.. సిట్ ప్రశ్నలకు తెలియదు.. గుర్తు లేదు.. అని చెబుతూ వచ్చారు. అయితే, సిట్ అధికారులు వేసిన ప్రశ్నలకు చెవిరెడ్డి బదులివ్వకపోగా, వారిపైనే చిందులు తొక్కినట్టు సమాచారం. మద్యం ముట్టని తనపై నిందలు వేస్తున్నారంటూ పాత పాటనే ఆయన పాడినట్టు తెలిసింది. మద్యం కేసులో విజయవాడ జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి (ఏ38), ఆయన స్నేహితుడు చెరుకూరి వెంకటేశ్‌నాయుడిని సిట్ అధికారులు మంగళవారం కస్టడీకి తీసుకున్నారు. జైలులో రికార్డు ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించిన తర్వాత పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఉన్న సిట్ కార్యాలయానికి తీసుకెళ్లారు. వారిద్దరినీ వేర్వేరు గదుల్లో ఉంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు విడివిడిగా విచారించారు. గత ఎన్నికల సమయంలో గరికపాడు చెక్‌పోస్టు వద్ద దొరికిన 8.37కోట్ల నగదు ఎక్కడిది.? ఎక్కడ తీసుకుని, ఎక్కడకు తరలిస్తున్నారు... అంటూ వెంకటేశ్‌నాయుడిని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

అరిస్తే అబద్ధాలు నిజాలు కావు సర్

చెవిరెడ్డికి దీటుగా సిట్ ప్రతిస్పందన

విచారణ సందర్భంగా... మద్యం కుంభకోణానికి సంబంధించి సంపాదించిన పక్కా ఆధారాలను ముందుపెట్టుకుని చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని సిట్ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. సిట్ అధికారులకు, చెవిరెడ్డికి మధ్య సంభాషణ ఇలా సాగింది..

సిట్: రూ.మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో భారీగా డబ్బులు మీ ద్వారా పలు ప్రాంతాలకు చేరాయి. ఎక్కడెక్కడికి ఎంత తీసుకెళ్లారు.? అక్కడి నుంచి ఎవరెవరికి పంపిణీ చేశారు?.'

చెవిరెడ్డి: నాకు లిక్కర్ వాసన పడదు. ఎప్పుడూ రుచి కూడా చూడలేదు. అలాంటిది వేల కోట్ల స్కామ్‌లో నాకు డబ్బులు ఎవరైనా, ఎందుకిస్తారు.? సంబంధం లేని వ్యవహారంలో నన్ను, నా కుటుంబాన్ని అన్యాయంగా ఇబ్బంది పెడుతున్నారు.. ఫలితం అనుభవిస్తారు.

సిట్: మీరు నోరు పెద్దది చేసి గట్టిగా మాట్లాడితే సరిపోదు. ఏ సంబంధమూ లేకపోతే తాడేపల్లిలో మద్యం ముడుపులు దాచిన ఇంటికి పలుమార్లు ఎందుకెళ్లారు?. ప్రణయ్ ప్రకాశ్‌తో ఎందుకు సమావేశమయ్యారు?

చెవిరెడ్డి: తాడేపల్లిలో మా పార్టీ రాష్ట్ర కార్యాలయం ఉంది. ముఖ్యమంత్రి, పలువురు పార్టీ పెద్దలు అక్కడ ఉంటారు. ఏదో పని మీద ఎవరినైనా నేను కలుస్తుంటా. అంతమాత్రాన, ఆ ఇంట్లో డబ్బులున్న విషయం నాకు తెలుస్తుందా? ప్రణయ్ ప్రకాశ్ ఎవరో నాకు తెలియదు. (అధికారులపై చిందులు)

ఇవిగో సాక్ష్యాలు..

సిట్ : (ఇదిగో సాక్ష్యాలంటూ ఇద్దరూ ఎక్కడెక్కడ కలిశారో ఫొటోలతోపాటు ప్రణయ్ వాంగ్మూలాన్ని చూపిస్తూ..) మీ ఇద్దరూ మద్యం ముడుపులతో ఆఫ్రికాదేశాల్లో వ్యాపారాలు చేయాలనుకున్నారు కదా.? అవి ఇప్పుడు ఏ దశలో ఉన్నాయి?

చెవిరెడ్డి: అక్కడ నాకు వ్యాపారాలుంటే చూపించండి. ఎలాంటి శిక్షకైనా సిద్ధం. (అధికారులపై అరుపులు)

సిట్ : మీరు కేకలు వేస్తేనో.. గట్టిగా అరిస్తేనో.. నిజాలు అబద్ధాలు అయిపోవు. మా దర్యాప్తునకు సహకరించండి. ఏదైనా ఉంటే తర్వాత కోర్టులో నిరూపించుకోండి. మీరు పలుమార్లు హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి నుంచి డబ్బులు తీసుకున్నారు.? ఎవరు చెబితే ఆయన మీకు డబ్బులు ఇచ్చారు.? ఎన్నిసార్లు మీరు తీసుకున్నారు? రాజ్ కసిరెడ్డి మొత్తం ఎంత ఇచ్చారు.? ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు ఎంత పంచారు? ఎవరు చెబితే పంపిణీ చేశారు.?

చెవిరెడ్డి: నాకు ఎలాంటి సంబంధం లేదు. నాకు ఎవ్వరూ డబ్బులు ఇవ్వలేదు.. నేను ఎవ్వరికీ పంపిణీ చెయ్యలేదు..

సిట్ : లిక్కర్ ముడుపుల సొమ్ము ముట్టుకోలేదని మీరు అంటున్నారు. కానీ, మీరెక్కడ ఆ డబ్బులు తీసుకున్నావో.. మీ మనుషుల్ని ఎక్కడకి పంపారో మా వద్ద ఆధారాలు ఉన్నాయి. (కొన్ని వీడియోలు చెవిరెడ్డికి చూపించారు.)

చెవిరెడ్డి: నాకేమీ తెలియదు. రాజ్ కసిరెడ్డి ఆఫీసుకు వెళ్లేందుకు సవాలక్ష వ్యవహారాలు ఉంటాయి. అంత మాత్రాన డబ్బులకు వెళ్లినట్టేనా?

సిట్ : అడిగిన దానికి సూటిగా సమాధానం ఇవ్వండి. గట్టిగా దబాయిస్తే తప్పు ఒప్పు అయిపోదు.

చెవిరెడ్డి: అన్యాయంగా కేసులో ఇరికించి నేను తప్పు చేశాననడం సరికాదు.

ఆ రూ.8.37 కోట్లు ఎవరివి.?

సిట్: లిక్కర్ స్కామ్‌తో సంబంధం లేదు.. డబ్బులు ఎవరి దగ్గరా తీసుకుని ఎవరికీ చేర్చలేదని చెబుతున్నారు కదా! మరి, ఎన్నికల సమయంలో గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ 8.37కోట్ల రూపాయలు ఎవరివి.? ఆ డబ్బులతో సంబంధం లేకుంటే మీ సహాయకుడు నవీన్ ఎందుకు ఆ సమయంలో అక్కడున్నారు.? గన్‌మెన్ గిరిని సెల్ స్విచ్ఛాఫ్ చేసి చెన్నైకి పారిపో అని ఎందుకు మీరు చెప్పారు.?

చెవిరెడ్డి: ఆ డబ్బులు ఒంగోలుకు చెందిన వ్యాపారవేత్త ప్రద్యుమ్నకు చెందినవి. దీనికి సంబంధించి ఆయన ఇప్పటికే ఆధారాలు చూపించారు.

సిట్: ప్రద్యుమ్న కంపెనీ సామర్థ్యం ఏ పాటిదో మాకు తెలుసు. మీ మిత్రుడు వెంకటేశ్ నాయుడు హైదరాబాద్‌లో మీ గన్‌మెన్ గిరి, పీఏ నవీన్‌కు మద్యం ముడుపులు అందించారు.

చెవిరెడ్డి: నేను కోర్టులో తేల్చుకుంటా. మీరు నన్ను ఉద్దేశ పూర్వకంగా ఇబ్బంది పెడుతున్నారు.

సిట్: అదే నిజమైతే మీ పీఏ, గన్‌మెన్ ఆ సమయంలో గరికపాడు చెక్‌పోస్టు వద్ద ఎందుకున్నారు.?

చెవిరెడ్డి: గన్‌మెన్‌ను మీరు బెదిరిస్తే ఆయన ఏదో చెప్పాడు. దానికి నేను సమాధానం చెప్పాలా?

సిట్: మీరు లా చేశారు. ఇంత కన్నా టెక్నికల్ ఎవిడెన్స్ కావాలా.? (చెవిరెడ్డి కారులో పీఏ, గన్‌మెన్ ప్రయాణిస్తున్న వీడియో చూపారు.)

నిందితుడి పరామర్శకు జగన్ వెళ్తున్నారు!

- ప్రభుత్వం తగిన భద్రత కల్పిస్తోంది
- అయినా.. అదనపు భద్రత కోరుతున్నారు
- వైసీపీ నేతల పిటిషన్‌పై ప్రత్యేక న్యాయవాది
- విచారణను నేటికి వాయిదా వేసిన హైకోర్టు



అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జైల్లో ఉన్న వైసీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పరామర్శించేందుకు మాజీ సీఎం జగన్ నెల్లూరు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో తాత్కాలిక హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో వైసీపీ నేతలు లేళ్ల అప్పిరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపించారు. నెల్లూరులోని సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేసుకొనేందుకు అనుమతించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పించారన్నారు. పోలీసులు ప్రతిపాదించిన స్థలం హెలికాప్టర్ దిగేందుకు అనువుగాలేదని తెలిపారు. పోలీసులు తగిన భద్రత కల్పించకపోవడంతో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రోప్ పార్టీని ఏర్పాటు చేసేలా పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించాలని కోరారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) యతీంద్రదేవ్ వాదనలు వినిపిస్తూ.. జైలు వద్ద అధికారులు సూచించిన స్థలంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు పిటిషనర్లు సమ్మతి తెలిపారని, రోప్ పార్టీ కోసం అడగాల్సిన పనిలేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం జగన్‌కు జెడ్ ప్లస్ భద్రత కల్పిస్తోందని వివరించారు. అయినప్పటికీ అదనపు భద్రత కల్పించాలని కోరుతున్నారన్నారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా సందీప్ మాథుర్



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కోస్తా రైల్వే(ఎస్.సి.ఓ.ఆర్) జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మంగళవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఐ.ఆర్.ఎస్.ఎస్.ఈ(ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నలింగ్ ఇంజనీర్) 1988 బ్యాచ్‌కు చెందిన సందీప్ మాథుర్ ప్రస్తుతం నూతనంగా విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటైన దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా పని చేసిన అరుణ్‌కుమార్ జైన్ పదవీ విరమణతో ఖాళీ అయిన ఆపోస్టులో సందీప్ మాథుర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర రైల్వేబోర్డు ఆదేశాలు జారీ చేసింది. కాగా గతంలో సందీప్ మాథుర్ మలేషియాలో డబుల్ లైన్ ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించారు.

సరి 'దిద్దలేని' దందా!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కన్నుపడింది. నయానో, భయానో ఆ భూమి దక్కించుకునేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో... భారీ అక్రమానికి తెర లేపారు. కలెక్టర్ కార్యాలయంలోని ఫెయిర్ అడంగల్‌లోనే హక్కుల దారుల జాబితా నుంచి వారి పేర్లు తొలగించి ఘరానా భూ దందాకు తెరతీశారు. తన సొంత మనుషులు, అనుచరులనే 'యజమానులు'గా చేరుస్తూ ఆర్‌ఎస్‌ఆర్‌ను తమకు ఇష్టం వచ్చినట్లుగా మార్చుకున్నారు. జగన్ ప్రభుత్వంలో ఆయన కీలక ప్రజాప్రతినిధిగా ఉండటంతో అధికార యంత్రాంగాన్ని కనుసైగతో శాసించారు. ఏకంగా కలెక్టరేట్‌లోని రీ సెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్)లో ఫెయిర్ అడంగల్‌లో ఉన్న భూమి రికార్డులను మార్చేశారు. సర్వే నంబరు 195-1లో అసలు హక్కుదారు పేరును చెరిపేసి... దానిపైనే తన ముఖ్య అనుచరుడి పేరు రాయించారు. 195-3 సర్వే నంబరు భూమి హక్కుదారుగా మరో అనుచరుడి పేరు రాయించారు. ఇలా పలు భూముల అసలు యజమానులను పేర్లను చెరిపివేసి... తమ సొంత మనుషుల పేర్లు రాయించారు. ఇది ఫోర్జరీ తరహాలో నైపుణ్యంతో చేసిన పని కూడా కాదు. పక్కాగా నాటు పద్ధతిలో ఒకపేరు చెరిపివేసి, మరో పేరు రాసినట్లుగా చూడగానే అర్థమవుతుంది.

అప్పుడే నిర్ధారించినా...

భూమి పత్రాల తారుమారుపై జగన్ హయాంలోనే జిల్లా జాయింట్ కలెక్టర్ నివేదిక ఇచ్చారు. కానీ... అప్పటి ప్రభుత్వ పెద్దలు, రెవెన్యూ అధికారులు దీనిని కప్పిపెట్టారు. బాధితులూ భయంతో నోరెత్తలేదు. ఇప్పుడు... కూటమి సర్కారు రావడంతో ధైర్యంగా ముందుకొచ్చి తమ భూములను కాపాడాలని మొరపెట్టుకున్నారు. ప్రభుత్వం మరోసారి సమగ్ర విచారణ చేయించింది. భూ దందా నిర్ధారణ అయింది. ఎలాంటి వివాదం లేని భూముల రికార్డులను తారుమారు చేయడం తీవ్రమైన నేరం. భూములను వివాదంలో పెట్టి వాటి అసలు హక్కుదారులను భయభ్రాంతులకు గురిచేసి బలవంతపు సెటిల్‌మెంట్ చేయించుకోవాలన్నది ఆ నేత అసలు లక్ష్యం. అందుకే తన అధికారాన్ని అడ్డంపెట్టుకొని రికార్డులను మార్చేశారు.

ఇదెలా సాధ్యపడింది?

భూముల రికార్డులు చాలా పదిలంగా ఉండాలి. అప్పుడే హక్కుదారులకు రక్షణ ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం మూడు సెట్ల రికార్డులు నిర్వహిస్తుంది. ఒక రికార్డు తహశీల్దార్ ఆఫీసులో, మరొకటి జిల్లా సహాయ సర్వే సెటిల్‌మెంట్ అధికారి (ఏడీ) కార్యాలయంలో ఉంటుంది. మూడో సెట్ రికార్డు కలెక్టర్ కార్యాలయంలో ఉంటుంది. వీటిలో... కలెక్టరేట్‌లోని రికార్డే భూములకు ప్రధాన రక్షణగా ఉంటుంది. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్ఓల అనుమతి లేకుండా ఆ రికార్డులను ఎవరూ ముట్టుకోవడానికి వీల్లేదు. అంటే... అది సూపర్ సెక్యూరిటీలో ఉండే రికార్డు. అలాంటి రికార్డునే వైసీపీ నేత ఈజీగా మార్చేయడం గమనార్హం.

పేదల ఫిర్యాదుతో...

రికార్డులు మార్చేసిన తర్వాత... ఆ భూములను భౌతికంగా దక్కించుకునేందుకు వైసీపీ నేత ప్రయత్నించారు. దీంతో వాటి అసలు యజమానులు... నాటి సీసీఎల్ఏ సాయిప్రసాద్‌ను ఆశ్రయించారు. కబ్జాదారుల కోరల నుంచి తమ భూములు కాపాడాలని వేడుకున్నారు. ఆ ఫిర్యాదుపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని 2023 నవంబరులో సీసీఎల్ఏ ఆదేశించారు. అప్పటి కాకినాడ జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి... కలెక్టరేట్‌లో ఉన్న ఫెయిర్ అడంగల్‌ను మార్చేశారని నిగ్గు తేల్చుతూ నివేదిక ఇచ్చారు. దీని ఆధారంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను రెవెన్యూ శాఖ ఆదేశించింది. అంటే... శాఖాపరమైన విచారణతోపాటు, రికార్డుల తారుమారుపై పోలీసు కేసూ నమోదు చేయాలి. కానీ... ఇవేవీ జరగలేదు. ఎందుకంటే, గత వైసీపీ ప్రభుత్వంలో ఆయన అంత శక్తిమంతుడు! దీంతో... అధికారులెవరూ ఆయనను టచ్ చేయలేకపోయారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక...

ఫోర్జరీకి గురైన రికార్డులను చక్కదిద్దామని, హక్కుదారుల ప్రయోజనాలు కాపాడామని అధికారులు నాడు సీసీఎల్ఏకు నివేదించారు. కానీ... ఇది ఆచరణలోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఆ రికార్డులను సరిదిద్దలేదు. ఆ భూములను తమ ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో... బాధితులు తమ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించాలని వారు ఆదేశించడంతో...'ట్యాంపరింగ్ నిజమే'నని అధికారులు స్పష్టంచేశారు. కానీ...చర్యలు శూన్యం.

కాపాడుతున్నదెవరు?

జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతల భూదందాలు, కబ్జాలపై నాటి ప్రతిపక్ష, టీడీపీ, జనసేనలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో పెద్ద పోరాటాలు చేశాయి. అధికారంలోకి వచ్చాక... చర్యలు కూడా తీసుకుంటున్నారు. కానీ... కాకినాడలో వైసీపీ కీలక నేత చేసిన భూదందా జోలికి మాత్రం వెళ్లకపోవడం గమనార్హం! దీనికి కారణాలేమిటని ఆరా తీయగా... అదే జిల్లాకు చెందిన కీలక టీడీపీ నేత, ఆయన కుమారుడు సదరు వైసీపీ నేతతో అంటకాగుతున్నట్లు తెలిసింది. ఆయన్ను టచ్ చేయడానికి వీల్లేదని, ఆ భూముల జోలికి వెళ్లవద్దని ఈ తండ్రీ కొడుకులు ఒత్తిళ్లు చేస్తున్నారు. దీంతో తమకు న్యాయం ఎలా జరుగుతుందంటూ బాధితులు ఆందోళనకు గురవుతున్నారు.

చోరీకి వచ్చి.. అక్కడే మకాం!

- యాజమానులు లేని ఓ ఇంట్లో చొరబడ్డ దొంగ
- 4-5 రోజులుగా కొన్నికొన్ని వస్తువుల అమ్మకం!
- వచ్చిన ఆ డబ్బుతో మద్యం తాగడం..
- తిరిగి ఆ ఇంటికే వచ్చి పడుకుంటున్న వైనం
- స్థానికుల సమాచారంతో పట్టుకున్న పోలీసులు
- విజయనగరం జిల్లా బొబ్బిలిలో ఘటన





బీరువాలోని సామాన్లు చిందరవందరగా పడేసి, ఆ ఇంట్లోనే పడుకున్న దొంగ

బొబ్బిలి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా దొంగతనం అంటే చోరీ చేసుకొని వెళ్లిపోవడం.. ఆ తర్వాత పోలీసులకు దొరికిపోవడం చూస్తుంటాం. అయితే ఇప్పుడు మనం చెప్పుకోబోయే దొంగ మహా 'ఘనుడు'! యాజమానులు లేని ఓ ఇంట్లోకి చొరబడి, దొంగతనం చేసిన వస్తువులను బయట అమ్ముకొని, వచ్చిన డబ్బుతో మద్యం తాగి.. ఆ మత్తులో మళ్లీ ఆ ఇంటికే వచ్చి నిద్రపోయే చోరుడు అన్నమాట!! దీన్ని గమనించిన స్థానికులు ఇచ్చిన సమాచారంతో చివరకు పోలీసులకు దొరికిపోయాడు. ఈ ఘటన విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణ పరిధిలోని గొల్లపల్లి అంబేద్కర్ కాలనీలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. అలజంగి గ్రామానికి చెందిన శీర శ్రీనివాసరావు, జయలక్ష్మి దంపతులకు గొల్లపల్లిలో ఇల్లు ఉంది. వీరిద్దరు పొలం పనుల నిమిత్తం తమ గ్రామానికి వెళ్లి ఉంటున్నారు. అదను చూసుకొని పిరిడి గ్రామానికి చెందిన ఓ దొంగ ఎవరూ లేని ఆ ఇంట్లోకి చొరబడ్డాడు. గత నాలుగైదు రోజుల క్రితమే ఇంట్లోకి చొరబడి రోజూ బయటకు వెళ్లి, మళ్లీ ఇంట్లోకి వస్తున్నట్టుగా తెలుస్తోంది. రోజుకు కొంత వెండి సామగ్రి, ఇతర వస్తువులను తీసుకెళ్లి అమ్ముకోవడం, వచ్చిన ఆ డబ్బులో మద్యం తాగడం, తిరిగి అదే ఇంటికి వచ్చి పడుకోవడం చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఇంట్లో మద్యం మత్తులో పడి ఉండడాన్ని గుర్తించిన ఇరుగుపొరుగు వారు మంగళవారం రాత్రి ఇంటి యజమాని శీర శ్రీనివాసరావు సమాచారం అందజేశారు. విశాఖలోని ఐఏఎస్ అకాడమీలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని, మద్యం మత్తులో ఉన్న దొంగను అదుపులోకి తీసుకున్నారు. తర్వాత ఆస్పత్రికి తరలించారు. ఆ దొంగ ఇంట్లో, బీరువాలోని సామాన్లు అన్నింటినీ చిందరవందరగా పడేశాడు. ఇంట్లో ఉన్న వెండి ఆభరణాల్లో కొన్నింటిని ఎవరికో అమ్మేశాడని అంటున్నారు. అయితే బీరువాలో రూ.10 వేల నగదు ఉన్నా.. ఆ డబ్బు జోలికి వెళ్లకపోవడం గమనార్హం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే ఆ చోరుడు ఎవరు, ఆతను ఆ ఇంట్లో ఎంతమేర దొంగతనం చేశాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

బీవీ పట్టాభిరామ్ ఇకలేరు!

- గుండెపోటుతో ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మృతి
- ఇంద్రజాలికుడు, హిప్నాటిస్ట్, కౌన్సెలర్‌గా అంతర్జాతీయ గుర్తింపు
- సీఎంలు చంద్రబాబు, రేవంత్ పలువురి సంతాపం



హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఇంద్రజాలికుడు, అంతర్జాతీయంగా పేరు పొందిన హిప్నాటిస్టు, మానసిక వైద్యుడు, ప్రఖ్యాత వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా సుపరిచితుడైన బీవీ పట్టాభిరామ్(75) కన్నుమూశారు. ఆయన పూర్తి పేరు భావరాజు వేంకట పట్టాభిరామ్. సోమవారం రాత్రి ఖైరతాబాద్‌లోని స్వగృహంలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టాభిరామ్ భార్య జయ కూడా వ్యక్తిత్వ వికాస నిపుణురాలు. వీరి కుమారుడు ప్రశాంత్ ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. పట్టాభిరామ్ భౌతికకాయానికి బుధవారం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. పట్టాభిరామ్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ సమీపంలోని శీల గ్రామం. 1950 ఫిబ్రవరి 12న సత్యనారాయణ, వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. పట్టాభిరామ్ చిన్నతనంలో చందమామ సంచికల్లో ఇంద్రజాలంపై పీసీ సర్కార్ రాసే కథనాలు చదివి స్ఫూర్తి పొందారు. అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో ఒకరోజు కోఠి కబూతర్‌ఖానా దగ్గర సైఫుద్దీన్ అనే ఇంద్రజాలికుడి ప్రదర్శన చూసి, ఆ విద్యపై ఆసక్తి పెంచుకున్నారు. కాకినాడలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న రోజుల్లో ఎంబేర్ రావు దగ్గర ఇంద్రజాలం నేర్చుకున్నారు. డిగ్రీ అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో టైపిస్టుగా చేస్తూనే, ఇంద్రజాల ప్రదర్శనలు ప్రారంభించారు. 1984లో రవీంద్రభారతి నుంచి చార్మినార్‌కు అక్కడి నుంచి రవీంద్రభారతికి కళ్లకు గంతలు కట్టుకొని స్కూటరు నడిపి సంచలనం సృష్టించారు. ఇంద్రజాల విద్య ద్వారా బాణామతి, చేతబడి వంటి మూఢనమ్మకాలను నిర్మూలించడానికి కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన సూచన మేరకు మద్యపాన నిషేధంపై అవగాహనతో పాటు పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు.

కౌన్సెలర్‌గా సేవలు..

మ్యాజిక్ స్కూలు ద్వారా పిల్లలకు ఇంద్రజాల విద్యను నేర్పిస్తున్న సమయంలో రేడియో అన్నయ్య న్యాపతి రాఘవరావు సలహాతో హిప్నాటిజం తరగతులు ప్రారంభించారు. తద్వారా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ మనస్తత్వ నిపుణుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ సైకాలజీ చదివారు. హిప్నాటిజంపై తొలి పీహెచ్‌డీ పట్టాభిరామ్‌దే కావడం విశేషం. ఫ్లోరిడా వర్సిటీ నుంచి 1983లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 1990ల్లో చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు.

రచనలు సంచలనం..

పట్టాభిరామ్ 'మైండ్ మ్యాజిక్' తో మొదలుపెట్టి 'మాస్టర్ మైండ్', 'జ్ఞాపకశక్తి-ఏకాగ్రత', 'మాటే మంత్రం', 'పాజిటివ్ థింకింగ్', 'జీనియస్ మీరు కూడా' వంటి 57కు పైగా పుస్తకాలు రాశారు. కొద్ది నెలల కిందట ఆయన ఆత్మకథ 'జీవితం ఒక ఉత్సవం- నా బతుకు కథ' విడుదలైంది.

చంద్రబాబు, రేవంత్ సహా ప్రముఖుల సంతాపం

పట్టాభిరామ్ మృతిపై ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ తదితరులు సంతాపం ప్రకటించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ప్రజాసేవలో మీ నిబద్ధత ఆదర్శప్రాయం

» వెంకయ్య నాయుడికి ప్రధాని మోదీ జన్మదిన శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, జూలై 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ పట్ల, అణగారిన వర్గాలను శక్తిమంతం చేయడంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడి నిబద్ధత ఆదర్శప్రాయమని ప్రధాని మోదీ కొనియాడారు. మంగళవారం, వెంకయ్య జన్మదినం సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయనకు మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. వెంకయ్యనాయుడితో అనేక సంవత్సరాలు కలిసి పనిచేసే అదృష్టం తనకు లభించిందని మోదీ అన్నారు. నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థిస్తున్నట్లు అన్నారు. దేశసేవ, అణగారిన వర్గాలకు అండగా గళం విప్పడంలో యువ నాయకులకు వెంకయ్య స్ఫూర్తిదాయకమని అమిత్ షా అన్నారు. దేశ రాజకీయాల్లో నైతికతకు, ప్రజాసేవకు వెంకయ్య నాయుడు నిలువెత్తు నిదర్శనమని కేంద్ర మంత్రి పెమ్మసాని అన్నారు.

ఏపీపీఈసెట్-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల



పీసెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యాయామ కళాశాలల్లోని బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గత నెల 23 నుంచి 26 వరకు నిర్వహించిన ఏపీపీఈసెట్-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి, పీసెట్ చైర్మన్ కె.గంగాధరరావు మంగళవారం విడుదల చేశారు. పరీక్షలకు హాజరైన 1502 మందిలో 1419 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పురుషులు 1009 మంది కాగా, మహిళలు 410 మంది ఉన్నారని పీసెట్ కన్వీనర్ పాల్ కుమార్ తెలిపారు. అలాగే రెండేళ్ల బీపీఈడీ కోర్సులో 1202 మంది, రెండేళ్ల డీపీఈడీ కోర్సులో ప్రవేశానికి 217 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. అభ్యర్థులు ఫలితాలను http://sets.apsche.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

ఈసెట్ కౌన్సెలింగ్‌కు షెడ్యూలు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూలును సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జి.గణేష్‌కుమార్ మంగళవారం విడుదల చేశారు. ఈనెల 4 నుంచి 8 వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, 4 నుంచి 9 వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. 7 నుంచి 10 వరకు ఆప్షన్లు పెట్టుకోవాలని, 11న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందన్నారు.

మెగా డీఎస్సీ ఫిజిక్స్, సోషల్ రెస్పాన్స్ షీట్లు విడుదల

ఫిజికల్ సైన్స్, సోషల్ స్టడీస్ పరీక్షల ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్లు బుధవారం నుంచి అందుబాటులో ఉంటాయని మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

జాతీయ ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తులు

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఆసక్తి కలిగినవారు జాతీయ టీచర్ అవార్డుల వెబ్‌సైట్ దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు సూచించారు. ఈనెల 15 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని, ఆగస్టు 13న పేర్లు ఎంపిక చేస్తారని, సెప్టెంబరు 4,5 తేదీల్లో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు.

ఐచ్ఛిక సెలవులపై స్పష్టత ఇవ్వాలి

ఐచ్ఛిక సెలవులపై పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టతనివ్వాలని ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘం(ఆప్టా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు కోరారు. ఇటీవల ఆప్షనల్ హాలిడే విషయంలో గందరగోళం తలెత్తిందని, అందువల్ల ఆప్షనల్ హాలిడే మండలం వారీగా వాడుకోవాలా? వ్యక్తిగతంగా తీసుకోవాలా? అనేదానిపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

అటవీ శాఖ సలహాదారుగా పి.నాగేశ్వరరావు

అటవీ శాఖ ప్రభుత్వ సలహాదారుగా పి.నాగేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అటవీ శాఖలో ఐటీ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన సలహాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆయనను సలహాదారుగా నియమించింది.

అధికారికంగా రోశయ్య జయంతి వేడుకలు

» ప్రతి ఏటా జూలై 4న నిర్వహణ.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

హైదరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ సీఎంగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గవర్నర్‌గా సేవలు అందించిన కొణిజేటి రోశయ్య జయంతిని జూలై 4న ప్రతిఏటా అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన సేవలకు గుర్తింపుగా ప్రతి ఏటా రాష్ట్రంలో రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో రోశయ్య జయంతి వేడుకలు నిర్వహించాలని కలెక్టర్లను ఆదేశించారు.

ఆరా మస్తాన్‌కు హైదరాబాద్ సిట్ పిలుపు

చిలకలూరిపేట, జూలై 1(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మద్దిరాలకు చెందిన సెఫాలజిస్ట్ ఆరా మస్తాన్‌ను ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరుపుతున్న తెలంగాణ సిట్ పోలీసులు బుధవారం తమ ముందు హాజరు కావాల్సిందిగా నోటీసు జారీ చేశారు. పలుమార్లు విచారణకు రావాలని పిలిచినా.. పని ఒత్తిడి వల్ల రాలేక పోతున్నానని సిట్‌కు ఆయన తెలుపుతూ వచ్చారు. ఈసారి తప్పని సరిగా హాజరు కావాలని సిట్ ఆయనను ఆదేశించింది.

హార్సిలీ హిల్స్‌ను రామ్‌దేవ్‌బాబాకు అప్పగించొద్దు

» సీఎంకు నారాయణ లేఖ

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక హార్సిలీ హిల్స్‌ను యోగా గురువు రాందేవ్‌బాబాకు అప్పగించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు మంగళవారం ఆయన లేఖ రాశారు. ఇక్కడ రిషి వ్యాలీ విద్యా కేంద్రం మనుగడ సాగించాలంటే హార్సిలీ హిల్స్‌ను రాందేవ్‌బాబాకు అప్పగించే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని నారాయణ తన లేఖలో కోరారు.

ఫేజ్ ఇండస్ట్రీస్‌కు భూ కేటాయింపులు రద్దు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాడులో ఫేజ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ విస్తరణ ప్రాజెక్టు కోసం భూములు కేటాయిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఆ సంస్థ అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఆ భూములను ఇతర పారిశ్రామిక పెట్టుబడిదారులకు కేటాయించే ప్రక్రియను చేపట్టాలని ఏపీఐఐసీకి సూచిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల రాష్ట్రాడులో ప్రాజెక్టును పూర్తి చేయలేక పోయినందుకు క్షమాపణలు చెబుతూ ఫేజ్ ఇండస్ట్రీస్ యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో భూముల కేటాయింపు జీవోను రద్దు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులు అరెస్టు

రాయచోటి, జూలై 1(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు అరెస్టు చేశారు. కేరళలోని మేళపలయంకు చెందిన అబూబక్కర్, మొహమ్మద్ అలీ అలియాస్ యూసఫ్ అన్నదమ్ములు. అనేక ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొని గత 30ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వీరిద్దరినీ తమిళనాడు యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 1995 నుంచి పరారీలో ఉన్న అబూబక్కర్‌పై అనేక ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడిన కేసులు ఉన్నాయి. ఇతను రాయచోటి పట్టణం కొత్తపల్లె ఉర్దూ పాఠశాల ఎదురుగా అమానుల్లా పేరుతో చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్థానికులు ఇతడిని కేరళ కుట్టీగా పిలుస్తారు. ఇక మొహమ్మద్ అలీ 1999లో తమిళనాడు, కేరళల్లో బాంబులు పెట్టిన ఘటనల్లో నిందితుడు. ఇతడికి రాయచోటి మహబూబ్‌బాషా వీధిలో సొంత ఇల్లు ఉంది. చీరల వ్యాపారంతో పాటు చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ అప్పుడప్పుడు కొన్ని నెలల పాటు కనిపించకుండా పోతారని, ఎవరైనా అడిగితే వ్యాపారం నిమిత్తం వెళ్లామని చెబుతారని స్థానికులు తెలిపారు.



మత్స్యకారుల పంట పండింది

అచ్యుతాపురం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో చాలామంది మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడానికి వెనుకాడుతున్నారు. అయితే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక, ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన కొందరు మంగళవారం తెల్లవారుజామున 20 ఇంజన్ తెప్పల (చిన్నసైజు బోట్లు)పై చేపల వేటకు వెళ్లారు. వారికి భారీగా చేపలు చిక్కాయి. వెళ్లిన ప్రతి తెప్పకు రూ.20 వేలకు తక్కువ లేకుండా చేపలు చిక్కాయి. పూడిమడక శివారు జాలారిపాలేనికి చెందిన ఒక మత్స్యకారుడికైతే ఒక్కొక్కటి సుమారు 110 కిలోల బరువు ఉన్న మూడు భారీ కొమ్ముకోనెం చేపలు చిక్కాయి. ఒక్కొక్క కొమ్ము కోనెం వ్యాపారులు రూ.28 వేలు చొప్పున కొనుగోలు చేశారు.



అక్కడా లేరు.. ఇక్కడా లేరు

» బడుల్లో 3.07లక్షల మంది విద్యార్థుల తగ్గుదల

» నమోదు కాకుండా ఇంతమంది ఏమైపోయారు?

» ప్రభుత్వ, ప్రైవేటు మేనేజ్‌మెంట్లలో ఒకే సరళి

» ఒకటి, ఐదు,ఆరు తరగతుల్లో భారీగా వ్యత్యాసం

» ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లోనూ అదే పరిస్థితి

» ఆన్‌లైన్ నమోదులో ఏదైనా సమస్య తలెత్తిందా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



విద్యార్థులు ఇటు ప్రభుత్వ పాఠశాలల్లోనో, అటు ప్రైవేటు పాఠశాలల్లోనో ఎక్కడో ఒక్కచోట చదవాలి. కానీ అక్కడా, ఇక్కడా రెండు చోట్లా కనిపించకపోతే వారు ఎక్కడికి వెళ్లినట్లు? 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమై ఇరవై రోజులు గడిచిన తర్వాత కనిపిస్తున్న విద్యార్థుల నమోదు గణాంకాలు ఆశ్చర్య పరుస్తున్నాయి. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు అన్ని రకాల మేనేజ్‌మెంట్లలోనూ విద్యార్థుల సంఖ్య తక్కువగా కనిపిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో అన్ని మేనేజ్‌మెంట్లలో కలిపి 1 నుంచి 10 తరగతుల విద్యార్థులు 68,29,347 మంది ఉన్నారు. ఈ ఏడాది జూన్ 30 వరకు 65,21,498 మంది పాఠశాలల్లో చేరారు. ఇంకా 3,07,849 మంది బడుల్లో చేరాల్సి ఉంది. ఒకటో తరగతిలో కొత్తగా చేరేవారు తగ్గినా పిల్లల సంఖ్య తగ్గినట్లుగా భావించవచ్చు. కానీ గతేడాది చదివి తర్వాతి తరగతికి వెళ్లాల్సిన (క్లాస్ ప్రమోషన్) విద్యార్థుల నమోదు కూడా తక్కువగానే ఉంది. ఒకటో తరగతిలో 1,47,679 మంది, నాలుగో తరగతిలో 36,444 మంది, ఐదో తరగతిలో 1,19,980 మంది, ఆరో తరగతిలో 1,07,800 మంది, ఎనిమిదో తరగతిలో 22,485 మంది విద్యార్థులు తక్కువగా నమోదయ్యారు. కొన్ని తరగతుల్లో గతేడాది కంటే విద్యార్థుల సంఖ్య పెరిగింది. రెండో తరగతిలో 61,074 మంది, మూడో తరగతిలో 1,175 మంది, ఏడో తరగతిలో 11,726 మంది, తొమ్మిదో తరగతిలో 27,721 మంది, పదో తరగతిలో 24,843 మంది పెరిగారు. మొత్తంగా 4,34,388 మంది తగ్గితే, 1,26,539 మంది పెరిగారు. కాగా ఆగస్టు వరకు ఎన్‌రోల్‌మెంట్ కొనసాగుతుంది. ఒకటో తరగతిలో చేర్చే పిల్లలను తల్లిదండ్రులు కొంత ఆలస్యంగా చేర్పిస్తూ ఉంటారు. అయితే ఈ ఏడాది ఒకటో తరగతిలో చేరే వారికి కూడా తల్లికి వందనం పథకం అమలుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఒకటో తరగతి అడ్మిషన్లు వేగంగా జరుగుతాయని భావించారు. కానీ, అవి కూడా తగ్గాయి.

అన్ని మేనేజ్‌మెంట్లూ అంతే...

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోయే ధోరణి గత కొన్నేళ్లుగా కనిపిస్తోంది. కానీ ఈ ఏడాది ప్రైవేటు మేనేజ్‌మెంట్లలో పరిస్థితి కూడా అలాగే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటోతరగతిలో 1,97,482 మంది చేరితే, ఎయిడెడ్‌లో 3,828 మంది, ప్రైవేటులో 3,38,490 మంది చేరారు. కానీ గతేడాది విద్యార్థుల సంఖ్యతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 70,700 మంది, ఎయిడెడ్‌లో 2,098 మంది, ప్రైవేటులో 74,881 మంది తగ్గారు. నాలుగో తరగతి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో స్వల్పంగా పెరిగితే, ప్రైవేటులో తగ్గిపోయారు. మేనేజ్‌మెంట్లవారీగా చూస్తే... ప్రభుత్వంలో 2,30,536 మంది, ఎయిడెడ్‌లో 8,479 మంది, ప్రైవేటులో 68,834 మంది తగ్గారు.

ప్రమోషన్ సక్రమంగా జరగలేదా?

పాఠశాలల్లో అడ్మిషన్లు వేర్వేరుగా ఉంటాయి. కొత్తగా బడిలో చేరే ఒకటో తరగతి విద్యార్థుల నమోదు తక్కువగా ఉంటుంది. కానీ అప్పటికే బడుల్లో ఉన్న విద్యార్థులు ఆ తర్వాతి తరగతికి ఆటోమేటిక్‌గా ప్రమోట్ అవుతారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం కొత్త బడుల విధానాన్ని తీసుకొచ్చింది. అలాగే ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులను చేర్చుకున్నా వారిని ఇంకా ఆన్‌లైన్‌లో నమోదుచేయలేదనే వాదన వినిపిస్తోంది. ఒక బడి నుంచి మరో బడికి మారిన విద్యార్థుల నమోదులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఐదు వరకు ప్రాథమిక పాఠశాలలో చదివి, ఆరో తరగతి కోసం ఉన్నత పాఠశాలలో చేరే విద్యార్థుల నమోదు ఇంకా వేగవంతం కావాల్సి ఉంది. అలాగే ఒక బడి నుంచి మరో బడికి మారే విద్యార్థులనూ ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదేమోనన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. అలా ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతే ఆ విద్యార్థులు 'తల్లికి వందనం' పథకం నగదు కోల్పోయే పరిస్థితి ఉంది. ఇంటర్ ఫస్టియర్‌లోనూ సంఖ్య తక్కువగానే ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫస్టియర్‌లో గతేడాది 1,27,270 మంది ఉంటే, ఈ ఏడాది 99,323 మంది మాత్రమే చేరారు. ఇక ఎయిడెడ్‌లో 1,331 మంది, ప్రైవేటులో 62,123 మంది తగ్గారు.

నమోదుపై 'తల్లికి వందనం' ప్రభావం

ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై తల్లికి వందనం పథకం ప్రభావం కనిపిస్తోంది. గత ప్రభుత్వంలో కుటుంబంలో బడికి వెళ్లే పిల్లలు ఎంత మంది ఉన్నా ఒక్కరికే అమ్మఒడి నగదు జమచేశారు. కూటమి ప్రభుత్వం ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికీ తల్లికి వందనం నగదు ఇస్తున్నారు. దీంతో ఇద్దరు,ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబాల్లో తల్లికి వందనం నగదు తీసుకుని ఒక్కరినైనా ప్రైవేటులో చేర్పించాలి అనే ఆలోచన వస్తోంది. అది కూడా సరిగ్గా బడులు తెరిచే సమయంలోనే పథకం నిధులు విడుదల చేయడం తల్లిదండ్రులకు కలిసొచ్చింది. వైసీపీ ప్రభుత్వం రెండేళ్లు జనవరి నెలలో, రెండేళ్లు జూన్‌లో బడులు ప్రారంభమైన కొన్ని రోజుల తర్వాత అమ్మఒడి నిధులు విడుదల చేసింది. దీంతో ఆ నగదును తల్లిదండ్రులు ఇతరత్రా అవసరాలకు వినియోగించుకున్నారు. కానీ ఇప్పుడు బడులు తెరిచే సమయంలో తల్లికి వందనం నగదు విడుదల చేశారు. అయితే, ఈ నిర్ణయం ప్రభుత్వ పాఠశాలలపై ప్రతికూల ప్రభావం చూపిందని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇంజనీరింగ్‌లో పెరిగిన సీట్లు

» 2 లక్షలకు పైగా అందుబాటులోకి

» అందులో సగానికిపైగా సీఎస్ఈకే

» యూనివర్సిటీ కాలేజీలో క్వాంటమ్ కంప్యూటింగ్

» కొత్తగా రెండు కళాశాలలకు అనుమతి

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈఏడాది సుమారుగా 34 వేల ఇంజనీరింగ్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. గతేడాది 1.81 లక్షల సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి(ఏఐసీటీఈ) అనుమతులు ఇచ్చింది. ఈ ఏడాది దాదాపు 2.15 లక్షల సీట్ల భర్తీకి అనుమతి లభించింది. 18 ప్రభుత్వ కళాశాలల్లో 6,400 సీట్లు, 225 ప్రైవేటు కళాశాలల్లో 1,79,334 సీట్లు, 11 ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 11,500 కన్వీనర్ కోటా సీట్లు... మొత్తంగా 1,97,234 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లు కూడా ఉంటాయి. అవి కూడా కలిపితే మొత్తం సీట్లు 2.15 లక్షలు దాటుతాయని సాంకేతిక విద్యాశాఖ అంచనా వేసింది. ఈ మొత్తంలో కంప్యూటర్ సైన్స్(సీఎస్ఈ) బ్రాంచ్ సీట్లు సగానికిపైగా ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1,02,614 సీఎస్ఈ సీట్లున్నాయి. ఐటీలో 6,360, సివిల్‌లో 8,180, మెకానికల్‌లో 9,815, ఈఈఈలో 10,895, ఈసీఈలో 32,300, ఇతర శాఖల్లో 16,260 సీట్లు అందుబాటులో ఉన్నాయి. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో ఆరు రకాల కొత్త కోర్సులకు అనుమతి లభించింది. ఏఎన్‌యూ పరిధిలో సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్... ఏయూ పరిధిలో వీఎల్ఎస్ఐ, క్వాంటం కంప్యూటింగ్... కృష్ణా వర్సిటీ పరిధిలో ఏఐ అండ్ ఎంఎల్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కో బ్రాంచ్‌లో 60 చొప్పున సీట్లు కేటాయించారు. కొత్తగా ప్రకాశం జిల్లాలో, గుడివాడలో కలిపి రెండు కళాశాలలకు అనుమతులు వచ్చాయి. మొత్తంగా వర్సిటీ కాలేజీల్లో 360, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 19,974 సీట్లు పెరిగాయి. ఈ సంవత్సరం ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది. దీంతో ఇంజనీరింగ్ అడ్మిషన్లు పెరిగే అవకాశం ఉంది. ఈ ఏడాది జనరల్ కేటగిరీలో 3,93,976 మంది ఇంటర్ పూర్తిచేశారు.

పాత ఫీజులతోనే..?

ఈ విద్యా సంవత్సరంలో కూడా దాదాపుగా పాత ఫీజులే ఖరారయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇంజనీరింగ్ కోర్సుల ఫీజుల అంశం న్యాయస్థానంలో ఉంది. గతేడాది కోర్టు ఆదేశాల మేరకు కనీస ఫీజు రూ.40 వేలు, గరిష్ఠ ఫీజు రూ.1.05 లక్షలుగా ఖరారు చేశారు. ఈ సంవత్సరం కూడా దాదాపుగా అవే ఫీజులతో అడ్మిషన్లు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. మొత్తం కళాశాలల్లో 110... రూ.40 వేల ఫీజు స్థాయిలోనే ఉన్నాయి. ఎనిమిది కాలేజీల్లో మాత్రమే ఫీజు రూ.లక్ష దాటింది. ఈ విద్యా సంవత్సరం తర్వాత మళ్లీ మూడేళ్ల కాలానికి ఒకేసారి ఫీజులు నిర్ణయిస్తారు.

కోర్సుల వారీగా సీట్లు

కోర్సు	ప్రభుత్వ కాలేజీలు	ప్రైవేటు కాలేజీలు
సీఎస్ఈ	1340	101274
ఐటీ	180	6180
సివిల్	740	7440
మెకానికల్	920	8895
ఈఈఈ	740	10155
ఈసీఈ	1130	31200
ఇతర బ్రాంచ్‌లు	1350	14190

నేటి వరకూ చేరినవారికి 'తల్లికి వందనం'

» 10న మెగా పేరెంట్-టీచర్స్ సమావేశాలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లను త్వరగా పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం ఆర్జేడీలు, డీఈవోలు, ఎంఈవోలతో ఆయన వెబ్‌ఎక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. బుధవారం సాయంత్రం వరకు ఒకటో తరగతిలో పాఠశాలల్లో చేరిన వారికి తల్లికి వందనం పథకం నగదు అందుతుందని స్పష్టంచేశారు. ఆ మేరకు ఎన్‌రోల్‌మెంట్‌పై చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని పాఠశాలల్లోనూ పదో తరగతి విద్యార్థులకు బుధవారం నుంచి సాయంత్రం 4 నుంచి 5గంటల మధ్య స్టడీ అవర్ నిర్వహించాలన్నారు. మండలంలోని ఇద్దరు ఎంఈవోలూ ఉదయం ఎంఈవో కార్యాలయానికి రావాలని, ప్రతిరోజూ ఒక పాఠశాల చొప్పున సందర్శించాలని ఆదేశించారు. ఎంఈవో కార్యాలయాల్లోని సిబ్బంది కూడా ఫేషియల్ హాజరు నమోదు చేయాలని, లేదంటే విధుల నుంచి తొలగిస్తామని చెప్పారు. జూలై మూడో వారంలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించాలని, అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలల్లో మొక్కలు నాటి వాటిని నాలుగేళ్ల పాటు సంరక్షించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జారీచేస్తామని చెప్పారు. ఈనెల 10న అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాలు నిర్వహించాలన్నారు. మెగా పీటీఎంకు డిజిటల్ ఆహ్వానాలు కూడా పంపుతామన్నారు.

మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాల్లో పాజిటివ్ పేరెంటింగ్

మెగా పేరెంట్- టీచర్స్ సమావేశాల్లో కుటుంబ ఫొటో బూత్‌లు, పాజిటివ్ పేరెంటింగ్ సెషన్లు, అమ్మ పేరుతో మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు ఉంటాయని సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 10న నిర్వహించబోయే మెగా పీటీఎం 2.0 అమలుపై ఆయన మార్గదర్శకాలు విడుదల చేశారు. మెగా పీటీఎంలలో దాదాపు 2.28 కోట్ల మంది పాల్గొంటారన్నారు. తల్లిదండ్రులకు పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాల్లో లోపాలు, కార్యాచరణ ప్రణాళికలను టీచర్లు తెలియజేస్తారని తెలిపారు.

పెరిగిన జీఎస్టీ వసూళ్లు

» జూన్‌లో రూ.2,591 కోట్లు వసూల్

» మొదటి త్రైమాసికం మొత్తం రూ.8,860 కోట్లు


అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జీఎస్టీ వసూళ్లు పెరిగాయి. ఈ ఏడాది జూన్‌లో రూ.2,591 కోట్ల నికర జీఎస్టీ వసూలైంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పటి నుంచి జూన్ నెలకు ఇదే అత్యధికం. 2025-26 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(క్యూ1)లో మొత్తం వసూలైన నికర జీఎస్టీ రూ.8,860 కోట్లు. ఇది గత ఏడాది క్యూ1లో వసూలైన నికర జీఎస్టీకి 3.4 శాతం ఎక్కువ. క్యూ1లో మొత్తం పన్ను ఆదాయం రూ.13,361 కోట్లు వచ్చింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1లో వచ్చిన రూ.13,096 కోట్ల కంటే ఇది 2.02 శాతం ఎక్కువ. అలాగే, ఈ ఏడాది జూన్‌లో పన్ను ఆదాయం రూ.4,167.66 కోట్లు వచ్చింది. గతేడాది జూన్‌లో వచ్చిన రూ.3,910 కోట్ల పన్ను ఆదాయం కంటే ఇది 6.58 శాతం ఎక్కువ. ఈ ఏడాది జూన్‌లో ఐజీఎస్టీ సెటిల్మెంట్ రూ.1,365 కోట్లు వచ్చింది. వృత్తి పన్ను రూ.29 కోట్ల నుంచి రూ.49 కోట్లకు పెరిగింది. లిక్కర్‌పై వ్యాట్ రూ.61 కోట్ల నుంచి రూ.86 కోట్లకు, పెట్రోలియం ఉత్పత్తులపై వ్యాట్ రూ.1,380 కోట్ల నుంచి రూ.1,435 కోట్లకు పెరిగింది.

శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ వాయిదా

హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఓఎంసీ కేసులో నిందితురాలిగా ఉన్న శ్రీలక్ష్మి పిటిషన్‌పై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. శ్రీలక్ష్మి తరఫున సీనియర్ న్యాయవాది వివేక్‌రెడ్డి వాదనలు వినిపించారు. తాను గనుల శాఖ కార్యదర్శిగా విధుల్లో చేరకముందే నిర్ణయాలన్నీ జరిగిపోయాయని, ఓఎంసీకి అన్ని అనుమతులు వచ్చాయని, ఓఎంసీకి లీజు నిర్ణయం కూడా జరిగిందని పేర్కొన్నారు. తన కంటే ముందు ఉన్న అధికారి, అప్పటి మంత్రి నిర్దోషులుగా తేలారని.. ఇక తన పాత్ర ఏమీ లేదని తెలిపారు. విచారణ గురువారానికి వాయిదా పడింది.

మళ్లీ ఏపీకి స్పెషల్ సీఎస్ ఏకే సింఘాల్

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సర్వీస్‌లో ఉన్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ తిరిగి ఏపీకి రానున్నారు. ఆరు నెలల క్రితమే ఆయనకు కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యా విభాగంలో పోస్టింగ్ వచ్చింది. కానీ ఆయన పదోన్నతి నిమిత్తం తిరిగి ఏపీకి వస్తున్నారు. ఆంధ్రా కేడర్ ఐఏఎస్ కావడంతో ఆయన ఏపీలోనే పదోన్నతి తీసుకోవాల్సి ఉంది. పదోన్నతి నిమిత్తం ఏపీకి పంపిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల్లో ఏపీలో రిపోర్టు చేయనున్నారు.



శ్రీశైలానికి 90వేల క్యూసెక్కులు

నంద్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్ర పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం జలాశయానికి వరద భారీగా వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 90,797 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి వస్తోంది. ఈ నేపథ్యంలో కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 58,750 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 874.80 అడుగులకు చేరుకుంది. జలాశయంలో నీటి లభ్యత 162.4372 టీఎంసీలుగా ఉంది.

జల విద్యుదుత్పత్తిని పెంచండి: సీఎస్

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో సౌర విద్యుదుత్పత్తి తగ్గుతోందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. ప్రాజెక్టుల్లోకి జలాలు చేరుతున్నందున శ్రీశైలం, సీలేరు జల విద్యుదుత్పత్తి కేంద్రాల్లో పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయడంపై దృష్టి సారించాలని ఇంధన సంస్థల యాజమాన్యాలకు సూచించారు. విద్యుత్తు సరఫరాపై జెన్‌కో సీఎండీ చక్రధర బాబు, ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చేకూరి, ట్రాన్స్‌కో, జెన్‌కో డైరెక్టర్లతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జూలై నుంచి సెప్టెంబరు వరకూ థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉంచుకోవాలన్నారు.

రాష్ట్రంలో ముసురు వాతావరణం

విశాఖపట్నం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం మంగళవారం నాటికి జార్ఖండ్‌లో కొనసాగుతోంది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం వైపు వెళ్తుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారి సోమవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలో అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఒకటి, రెండు చోట్ల భారీవర్షాలు పడ్డాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

గురుకులాల గెస్ట్ ఫ్యాకల్టీకి జీతాల పెంపు

చంద్రబాబుకు గిరిజన విద్యార్థి సమాఖ్య కృతజ్ఞతలు

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న 1659 ఔట్‌సోర్సింగ్ ఫ్యాకల్టీకి జీతాలు పెంచుతూ గిరిజన సంక్షేమశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కేటగిరి-ఎ కింద గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని 151 విద్యా సంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు పెంచారు. ఎన్నో ఏళ్ల తర్వాత కూటమి ప్రభుత్వం గురుకుల సిబ్బందికి వేతనాలు పెంచినందుకు గిరిజన విద్యార్థి సమాఖ్య నేత అక్కులప్ప నాయక్, యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య సీఎం చంద్రబాబునాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

సాంస్కృతిక శాఖకు 'అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్'

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం కొలువుదీరిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్వరాజ్ మైదాన్‌ను రాష్ట్ర సాంస్కృతికశాఖ నియంత్రణకు అప్పగిస్తూ సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఇకపై సాంస్కృతిక వ్యవహారాల డైరెక్టర్ ఆధ్వర్యంలో ఇక్కడ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపింది.

అప్పుడు ఎక్కడున్నావ్ ఒవైసీ!: ఎంఏ షరీఫ్

'జగన్ హయాంలో ముస్లింలు తీవ్రంగా నష్టపోయారు. అప్పుడు ఒవైసీ ఎక్కడ దాక్కున్నాడు?' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ షరీఫ్ ప్రశ్నించారు. 'కర్నూలులో నిర్వహించిన వక్ఫ్ చట్ట సవరణ వ్యతిరేక సభలో ఒవైసీ వక్ఫ్‌కు సంబంధించిన అంశాలు కాకుండా రాజకీయ అంశాలు ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలి. జగన్ పాలనలో ముస్లింపై దాడులు చేశారు. ఊళ్ల నుంచి వెలివేశారు. అనాడు ఎప్పుడూ ఒవైసీ నోరు విప్పలేదు. అప్పుడు ఆయన ఎక్కడ ఉన్నారు?' అని షరీఫ్ ప్రశ్నించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక విష ప్రచారం: అనిత

నక్కపల్లి, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విషప్రచారం చేస్తున్నారు' అని హోంమంత్రి అనిత ఆరోపించారు. 'పాయకరావుపేట బీసీ బాలికల హాస్టల్‌ను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు అనేక లోపాలు బయటపడ్డాయి. మెనూ పాటించడం లేదు. వార్డెన్ అందుబాటులో లేరు. సెక్యూరిటీ లేదు. దీంతో వార్డెన్‌ను సస్పెండ్ చేశాం. వైసీపీ పాలనలో ఒక్క ఎమ్మెల్యే అయినా హాస్టళ్లను తనిఖీ చేశారా? మా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోంది' అని అనిత అన్నారు.

జగన్ పాలనలో 2,400 మంది నిరుద్యోగుల ఆత్మహత్య

» నేడు రెచ్చగొట్టే కార్యక్రమాలా?: దీపక్‌రెడ్డి

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): 'జగన్ పాలనలో 2,400 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. నిరుద్యోగుల ఆత్మహత్యల్లో దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌రెడ్డికి దక్కుతుంది' అని సీడ్ ఏపీ చైర్మన్ దీపక్‌రెడ్డి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డి పాలనలో కంపెనీలు తీసుకురాకపోగా ఉన్నవాటిని తరిమికొట్టారు. సుమారు రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు దూరమయ్యాయి. యువతకు ఉద్యోగాలు కల్పించకపోగా రాష్ట్రాన్ని గంజాయి రాజధానిగా మార్చారు. నేడు రూపాయి ఖర్చు లేకుండా కూటమి ప్రభుత్వం స్కిల్ సెంటర్లు పెట్టి ఉద్యోగ కల్పనకు కృషి చేస్తుంటే చూసి ఓర్వలేక రెచ్చగొట్టే కార్యక్రమాలు చేస్తున్నారు. జగన్, వైసీపీ డ్రామాలను యువత గమనించాలి' అని దీపక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఏడాది విజయాలను ప్రతి గడపకూ చెప్పండి: అశోక్

'గత పాలకులు బటన్ నొక్కుడు మోసాలతో మోసం చేస్తే కూటమి ప్రభుత్వం విధ్వంస రాష్ట్రాన్ని గాడిన పెడుతోంది. ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది' అని మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'జగన్ ఇస్తానన్న పింఛను కూడా ఇవ్వకుండా అవ్వాతాతలను మోసం చేశారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఇచ్చిన మాట ప్రకారం రూ.4 వేలుకు పెంచి పింఛను ఇస్తోంది. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను పార్టీ నాయకులు, క్యాడర్ ప్రతి గడపకూ వెళ్లి ప్రజలకు వివరించాలి' అని అశోక్‌బాబు సూచించారు.



సీఎం కారులో చర్మకారుడు

రెండు కిలోమీటర్లు ప్రయాణం

యోగక్షేమాలు, జీవన స్థితిగతులపై మాటామంతీ

రాజమహేంద్రవరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటనలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. షెడ్యూల్ ప్రకారం ఆయన కొవ్వూరు నియోజకవర్గంలోని తాళ్లపూడి మండలం మలకపల్లిలో చర్మకారుడు సనమండ్ర పోసిబాబు ఇంటికి వెళ్లి చర్మకారులకు ఇచ్చే పింఛను ఇవ్వాల్సి ఉంది. అయితే పోసిబాబు ధర్మవరంలోని ఓ జనరల్ స్టోర్ వద్ద ఉన్నట్లు యంత్రాంగం చెప్పగా.. సీఎం నేరుగా ఆ దుకాణం వద్ద కారు ఆపి పోసిబాబును పలకరించారు. ముందు జనరల్ స్టోర్ యజమాని కొండా వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వ్యాపారం సాధకబాధకాలపై ముచ్చటించారు. తర్వాత పోసిబాబును కారులో ఎక్కించుకుని తనపక్క సీటులో కూర్చోబెట్టుకున్నారు. అక్కడి నుంచి మలకపల్లికి 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అక్కడి వరకూ అతడి కుటుంబ నేపథ్యం, స్థితిగతులు, వృత్తి జీవితం తదితర విషయాలపై పోసిబాబును ఆరా తీశారు. గ్రామంలో చర్మకార పింఛను పొందుతున్న వ్యక్తి పోసిబాబు ఒక్కరే కావడం గమనార్హం. అనంతరం సీఎం గెడ్డం కృష్ణదుర్గ ఇంటికి వెళ్లి వితంతు పింఛను అందజేశారు. అక్కడే తల్లి ఒడిలో ఉన్న పసిపాపను దగ్గరకు తీసుకుని ముద్దాడారు.

ఇంత అదృష్టం దక్కుతుందనుకోలేదు!

'మా జీవితంలో ఇంత అదృష్టం దక్కుతుందని అనుకోలేదు. మా కుటుంబం ఎప్పుడో ఎంతో పుణ్యం చేసుకుంది. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే మాకు ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ఆయనే మా ఇంటికొచ్చి ఇంటిని బాగు చేయిస్తామని, మా జీవితాలను నిలబెడతామని చెప్పడంతో ఊపిరిపీల్చుకున్నాం' అని పోసిబాబు కుటుంబం ఆనంద బాష్పాలు నిండిన కళ్లతో చెప్పింది. మలకపల్లికి వచ్చిన వెంటనే చంద్రబాబు ఎస్సీ పేటలోని ఇందిరా కాలనీలోని పోసిబాబు ఇంటికి వెళ్లారు. కుటుంబసభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా చర్మకళాకారుడికి ఇచ్చే రూ.3 వేల పింఛనును పోసిబాబుకు స్వయంగా అందజేశారు. సీఎం తన భర్త భుజంపై చేయివేసి మాట్లాడడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని అతడి భార్య రామలక్ష్మి అన్నారు.

అన్నిటికీ ఓకే..

సీఎం: మీరు ఇబ్బందులు పడకుండా జీవించడానికి నేనేం చేయాలి?

పోసిబాబు: మా ఇంటికి ప్లాస్టింగ్ చేయించుకోవాలయ్యా. ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలు అప్పు చేశాను. పూర్తిగా బాగు చేయించుకోడానికి మరో రూ.1.50 లక్షలవుతుంది.

సీఎం: ఓకే. 100 రోజుల్లో ఇంటిని బాగు చేయించండి (కలెక్టర్‌కు ఆదేశం)

పోసిబాబు: నా కొడుకు మోహన్ ఐటీఐ చదివాడు. ఉద్యోగం ఇప్పించడయ్యా.

సీఎం: ఓకే.. ఇస్తాను. ఇంకా..

పోసిబాబు: నేనూ ఒక కొట్టు పెట్టుకుంటే ఉపాధికి ఇబ్బంది ఉండదయ్యా.

సీఎం: ఓకే. కొట్టు పెట్టుకునే ఏర్పాటు చేస్తా (కలెక్టర్‌కు ఆదేశం)

చెప్పుల జత, టోపీ రూ.5 వేలు: పోసిబాబుకు జీవనాధారమైన డప్పు ఇంటి బయట ఉండడం చూసిన చంద్రబాబు.. దానిని పట్టుకుని దరువేశారు. అతడు తయారుచేసితో చెప్పుల జత, టోపీని ముచ్చటపడి కొనుగోలు చేశారు. వాటి నిమిత్తం పోసిబాబుకు రూ.5 వేలు చెల్లించారు.



అమరావతి రాజధాని నిర్మాణానికి తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన వృద్ధురాలు మద్దిపాటి విజయలక్ష్మి రూ. లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. ఆమె కుటుంబాన్ని చంద్రబాబు సత్కరించారు. తాడిపూడి చెందిన నామా కొండబాబు రూ.లక్ష విరాళంగా అందజేశారు.



తాళ్లపూడి మండలం మలకపల్లిలో పాపను ఎత్తుకుని, మహిళల సమస్యలు వింటున్న సీఎం చంద్రబాబు



పోసిబాబు ఇంటివద్ద డప్పు కొడుతున్న సీఎం

ఆలోచించండి!

(మొదటి పేజీ తరువాయి)

ఇది చాలా ప్రమాదకరమని ఆందోళన వ్యక్తంచేశారు. తాను ప్రతీ అడుగూ ఆచితూచి వేస్తానని.. అలాంటి తననే 2019 ఎన్నికల ముందు వివేకా హత్య విషయంలో మోసం చేశారని చెప్పారు. వివేకా గుండెపోటుతో చనిపోయారని జగన్ టీవీలో ప్రచారం చేస్తే తానూ నమ్మానన్నారు. 'మర్నాడు సాక్షి పేపరులో నా చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్త చరిత్ర అని రాయించారు. ముఖ్యమంత్రినైనా నాడు నిస్సహాయుడినయ్యాను. ఆరోజే నిందితులను అరెస్టు చేసి ఉంటే రాష్ట్రానికి మేలు జరిగేది..' అని వ్యాఖ్యానించారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

పింఛన్లతో కళకళ

ప్రతినెలా మొదటి తారీఖును అందరూ గుర్తుపెట్టుకుంటున్నారు. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎన్‌డీఏ నేతలు, కార్యకర్తలూ ఆ రోజు ప్రజాసేవలో నిమగ్నమవుతున్నారు. ఒకటో తేదీన నిద్రలేచిన వెంటనే గ్రామాలన్నీ ఆనందంగా ఉంటున్నాయి. కళకళలాడుతున్నాయి. ఇందుకు పింఛన్లే ప్రధాన కారణం. భారతదేశ చరిత్రలో ఎక్కడా రూ.4 వేలు పింఛను ఇవ్వడంలేదు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నేతలు దగ్గరుండి ఇవ్వండి. నేను స్వయంగా గ్రామాలకు వచ్చి ఇస్తున్నాను. ఉద్యోగులు ఒక్కొక్కరు 53మందికి పింఛన్లు పోటీ పడి ఇస్తున్నారు. ఎవరైనా ఇవ్వకపోయినా, తామేదో ఉచితంగా ఇస్తున్నట్టు ఫీలైనా, లబ్ధిదారులతో సరిగా మాట్లాడకపోయినా.. చులకనగా చూసినా వదలిపెట్టను. సేవాభావంతో పనిచేయాలి. ఈ నెల నుంచి వ్యక్తిగతంగా మెసేజ్‌లు కూడా వస్తాయి. ఎవరు తీసుకోకపోయినా తెలిసిపోతుంది. ఎందుకు తీసుకోలేదో చెప్పాలని మెసేజ్ పంపిస్తాం. రాజకీయ ముసుగు వేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేవారి పట్ల కఠినంగా ఉంటాను.

ఇంత విధ్వంసం చూడలేదు..

సీఎం పదవి నాకు కొత్తకాదు. ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు సీఎంగా పనిచేశాను. 15 ఏళ్లు ప్రతిపక్ష నేతగా ఉన్నాను. వైసీపీ చేసిన విధ్వంసం నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయి. ఎవరూ పనిచేసే పరిస్థితి లేదు. దీనిని సరిదిద్దడానికి సంవత్సరం పట్టింది. సంక్షేమం చేస్తున్నాం.. అభివృద్ధీ చేస్తున్నాం. సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం.

నెలలో మెగా డీఎస్సీ ఉద్యోగాలు

వైసీపీ నేతలు మెగా డీఎస్సీకి అనేక అడ్డంకులు సృష్టించారు. సుప్రీంకోర్టుకు కూడా వెళ్లారు. 16,500 మందికి టీచర్ ఉద్యోగాలు ఇస్తాం. యువత చాలా ఆశలు పెట్టుకున్నారు. నమ్మకం పెట్టుకున్నారు. వారికి ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగ భృతి ఇస్తాం. ఆ ఐదేళ్లలో ఎక్కడచూసినా గంజాయి, డ్రగ్స్. పోరాడితే కేసులు పెట్టారు. మా పార్టీ ఆఫీసు మీద దాడి చేశారు. గంజాయి, డ్రగ్స్ అమ్మితే తాట తీస్తాను. ఆడబిడ్డ మీద చెయ్యివేస్తే అదే వాళ్లకు చివరి రోజు. రౌడీయిజాన్ని సహించం. అభివృద్ధి పనులన్నీ సుస్థిరంగా కొనసాగిస్తాం. పోలవరం, అమరావతి, స్టీల్ ప్లాంట్ విషయాల్లో కేంద్రం సహకరిస్తోంది. యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. ఏడాదిలోనే 9.50 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వీటివల్ల 8.50 లక్షల మందికి ఉద్యోగాలొస్తాయి. రాష్ట్రంలో ఇప్పుడు రూ.5 లక్షల కోట్ల విలువైన పనులు ప్రారంభయ్యాయి. 4 లక్షల 50వేల మందికి ఉద్యోగాలు వస్తాయి.

క్రూరంగా ఆలోచిస్తున్నారు..

గత ఐదేళ్లూ నన్ను బయటకు రానివ్వలేదు. నా ఇంటికి తాళ్లు కట్టారు. విశాఖ వెళితే తిరిగి పంపారు. అయితే ఆ పని నేను చేయలేను. ఇవాళ తెనాలిలో రౌడీషీటర్‌ను పలకరించడానికి వెళ్లి మార్కెట్‌ను ధ్వంసం చేశారు. ఓ వ్యక్తి చనిపోతే.. ఏడాది తర్వాత జగన్ ఇప్పుడు పరామర్శకు వెళ్లాడు. తక్కువ మందితో వెళ్లండని పోలీసులు చెబితే వినలేదు. ఇరుకు సందుల్లో మీటింగ్ వద్దంటే వినడం లేదు. ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. క్రూరంగా ఆలోచిస్తున్నారు. మనం కారులో వెళ్లేటప్పుడు దాని కింద ఎవరైనా పడితే ఏం చేస్తాం? ఆగి, ఆస్పత్రికి తీసుకెళ్తాం. బతికించడానికి కనీస ప్రయత్నం చేస్తాం. కానీ జగన్ కారు కింద సింగయ్య అనే వ్యక్తి నలిగిపోతే ఈడ్చిపడేశారు. మనుషుల ప్రాణాలకు కూడా విలువ లేదు. జగన్ కారుకిందే సింగయ్య చనిపోయినట్టు ఆధారాలు ఉన్నాయి. ఇలాంటి వారితో నేనెలా రాజకీయాలు చేస్తున్నాను..? బాధని పిస్తోంది.

మూడోసారీ పుష్కరాలు నేనే నిర్వహిస్తాను

గోదావరి పుష్కరాలను 2027లో మూడోసారి నేనే చరిత్రలో కనీవినీ ఎరుగుని రీతిలో నిర్వహిస్తా. ఇవాళ మంత్రుల కమిటీ కూడా వేశాం. కొవ్వూరు, రాజమండ్రి వైపు ఘాట్ల మరమ్మతులతో పాటు అదనపు సుందరీకరణ కూడా చేస్తున్నాం. కేంద్రం నుంచి ఇప్పటికే రూ.98 కోట్లు వస్తే, అఖండ గోదావరి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. త్వరలో ఏమి చేయాలో మీటింగ్ పెట్టి నిర్ణయిస్తాం. ఇది చాలా మంచి ప్రాంతం. పోలవరం నుంచి పాపికొండలు, కడియం నర్సరీలు, గోదావరి అందాలు, ప్రపంచంలోనే టూరిజం హబ్ చేస్తాం.

సమాజానికి కొంత తిరిగివ్వాలి..

సమాజం మనకెంతో ఇచ్చింది.. అందులో కొంత తిరిగి ఇవ్వాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. 'నా దౌర్భాగ్యం.. దేవుడు నాకింతే ఇచ్చాడు. ఇది ఖర్మ. కష్టపడక తప్పదు. నా జీవితం ఇంతే అనే ఆలోచనలు మానేయండి. పేదరిక ఆలోచనలు వద్దు. బాగా ఆలోచించండి. కష్టపడే మనసత్వం పెంచుకోండి. మీ జీవితం బంగారం అవుతుంది' అని ప్రజలకు సూచించారు. స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్‌లో భాగంగా సమాజంలో 10 శాతం ఉన్న ఉన్నత ఆదర్శవంతులైన కుటుంబాలు.. సమాజంలో దిగువన ఉన్న 20 శాతం కుటుంబాలను దత్తత తీసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని గుర్తుచేశారు. 'ఇదే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్‌నర్‌షిప్ (పీ-4) విధానం. ప్రభుత్వ రాయితీలతో ఇండస్ట్రీలు నడిపి సంపాదించిన వారంతా ప్రజలకు సేవచేయాలి. ఒకప్పుడు జన్మభూమి పిలుస్తోంది రా.. అంటే ప్రపంచంలోని తెలుగువాళ్లు ముందుకు వచ్చి చాలా పనులు చేశారు. ఇప్పుడు పీ-4లో భాగంగా ఆగస్టు 15 నాటికి లక్ష బంగారు కుటుంబాలను కనీసం పది వేల మంది మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. అప్పుడో పెద్ద కార్యక్రమం చేసి.. టాటా, బిర్లా, అదానీ, జిందాల్ వంటి వాళ్లను పిలుస్తాం' అని తెలిపారు. ఈ సందర్భంగా మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యక్రమంలో ఓ లబ్ధిదారు, ఓ మార్గదర్శితో ఆయన మాట్లాడించారు.

మమ్మల్ని ఆదుకుంటే..

మా అమ్మా, నాన్నా కూలి పనిచేస్తారు. మేం ముగ్గురం ఆడపిల్లలం, ఒకరు దివ్యాంగురాలు. నేను బీఎస్సీ చదివాను. ఉన్నత విద్య చదవాలని ఉన్నా కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా మధ్యలో మానేసి ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నాను. లోన్ తీసుకుని నా చెల్లెలిని చదివిస్తున్నాం. చంద్రబాబు మాకు పింఛను మంజూరు చేశారు. 2019లో ఇల్లు కూడా ఇచ్చారు. గత ఐదేళ్లలో ఇంటి నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. మా కుటుంబాన్ని ఆదుకుంటే నేను బాగా స్థిరపడి మరిన్ని కుటుంబాలను ఆదుకుంటాను.

- ములపర్తి నవ్యశ్రీ, బంగారు కుటుంబం లబ్ధిదారు

ఈ కుటుంబం బాధ్యత తీసుకుంటా..

నేను కూడా చిన్న కుటుంబం నుంచే వచ్చాను. ప్రభుత్వ పాఠశాలలో చదివాను. బిట్స్ పిలానీలో ఆర్గానిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేశాను. తాళ్లపూడి మండలంలో ఠాగూర్ ల్యాబొరేటరీస్ స్థాపించి 1,500 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. నవ్యశ్రీ కుటుంబం బాధ్యత నేను తీసుకుంటాను. ఆమెతో ఎమ్మెస్సీ చేయిస్తాను. లేదంటే మా కంపెనీలో ఉద్యోగం ఇస్తాను. వారి తల్లిదండ్రులకు కూడా ఉపాధి కల్పిస్తాం.

- కాశీ విశ్వనాథరాజు, మార్గదర్శి

అనుకూలించని వాతావరణం

సీఎం హెలికాప్టర్‌కు విజిబిలిటీ సమస్య

- ఉండవల్లి నుంచి తూర్పుగోదావరికి బయలుదేరిన చంద్రబాబు
- గన్నవరం ఎయిర్‌పోర్టు దాటాక దట్టమైన మేఘాలు
- ప్రత్యేక విమానంలో రాజమండ్రికి వెళ్లిన సీఎం

విజయవాడ/రాజమహేంద్రవరం/కొవ్వూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు విజిబిలిటీ సమస్య ఎదురైంది. ఉండవల్లి నివాసం నుంచి మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో హెలికాప్టర్‌లో తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు సీఎం బయలుదేరారు. గన్నవరం విమానాశ్రయం దాటిన తర్వాత దట్టమైన మేఘాల కారణంగా పైలెట్ గన్నవరంలోని విమానాశ్రయ ఏటీసీకి సమాచారమిచ్చి, అక్కడ అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. అయితే చంద్రబాబు ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కోసం పైలెట్ ఎమర్జెన్సీ ల్యాండింగ్ కోరడంతో కొద్దిసేపు అధికారులు కంగారు పడ్డారు. సేఫ్ ల్యాండింగ్ జరగటంతో ఊపిరి పీల్చుకున్నారు. గన్నవరం విమానాశ్రయంలో సీఎం కొద్దిసేపు ఉన్న తర్వాత అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరానికి వెళ్లారు.

ప్రజల కోసం వెళ్లాల్సిందే: చంద్రబాబు

సీఎం చంద్రబాబు ప్రజావేదిక, పింఛను పంపిణీ, టీడీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొనేందుకు తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి మంగళవారం ఉదయం 11 గంటలకు చేరుకోవాల్సి ఉంది. హెలికాప్టర్‌కు విజిబిలిటీ సమస్యతో ఆయన గన్నవరంలో దిగారు. 'మలకపల్లిలో ప్రజలు నా కోసం ఎదురు చూస్తారు. వెళ్లాల్సిందే..' అని చంద్రబాబు ఆదేశించడంతో అప్పటికప్పుడు అధికారులు ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేశారని తెలిసింది. దీనిలో సీఎం చంద్రబాబు.. మధ్యాహ్నం 1.15 గంటలకు రాజమహేంద్రవరం చేరుకున్నారు. అక్కడ మంత్రులు కందుల దుర్గేశ్, నిమ్మల రామానాయుడు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు సీఎంకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్డుమార్గం గుండా 1.50 గంటలకు మలకపల్లికి చేరుకున్నారు.

నం.1 రాష్ట్రంగా ఏపీ

- బీజేపీ కొత్త రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆకాంక్ష
- సీనియర్ నాయకుల సమక్షంలో బాధ్యతలు
- బాధ్యతలు అప్పగించిన పురందేశ్వరి



పురందేశ్వరి చేతుల మీదుగా బీజేపీ జెండా అందుకుంటున్న మాధవ్. చిత్రంలో పీసీ మోహన్, సీఎం రమేశ్, శ్రీనివాసవర్మ, వీర్రాజు, సత్యకుమార్ తదితరులు

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా ఉండాలని బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆకాంక్షించారు. రాష్ట్రం మరోసారి విభజన గాయాలకు గురికాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, భాష, వారసత్వంపై ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం రావాలనీ, 'ఇది నాది' అనే భావన పెరగాలనీ ఆయన సూచించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా మాధవ్ పేరును కర్ణాటక బీజేపీ ఎన్నికల పరిశీలకుడు, బెంగళూరు ఎంపీ పీసీ మోహన్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. ఎన్నిక నిర్వాహకుడు, ఎంపీ పాకా సత్యనారాయణ ధ్రువీకరణ పత్రం అందజేయగా.. పురందేశ్వరి పార్టీ జెండా మాధవ్ చేతికి అందజేసి బాధ్యతలు బదిలీ చేశారు. ఈ సందర్భంగా విజయవాడలో ఏర్పాటు చేసిన సంఘటనా పర్వ్‌లో మాధవ్ మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్ష పదవి తనకు బాధ్యత అని, ఒక చేత్తో బీజేపీ జెండా, మరో చేత్తో ఎన్డీఏ అజెండాతో పనిచేస్తానని తెలిపారు. "రాష్ట్రంపై అభిమానం, భాషపై మమకారం ఏర్పరచుకొని జాతీయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరం ముందడుగు వేయాల్సిన బాధ్యత ఉంది. గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో భాషతో పాటు రాజధాని కూడా అన్యాయానికి గురైంది. అమరావతి రాజధానిగా ఏడాదిగా సుపరిపాలన జరుగుతోంది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విశాఖలో యోగాంధ్ర నిర్వహించి ప్రపంచం ఆరోగ్యంగా ఉండేలా ప్రయత్నం చేశారు. ఒకప్పుడు ఒడిసా, కర్ణాటకతో పోల్చితే ఏపీలోనే బీజేపీ బలంగా ఉండేదనే విషయాన్ని ప్రధాని విశాఖ పర్యటన సందర్భంగా గుర్తుచేశారు. రాష్ట్రంలో పార్టీని బలమైన శక్తిగా కార్యకర్తలు గర్వపడే స్థాయికి చేరుస్తాను. ఎమర్జెన్సీ గాయానికి యాభై ఏళ్లు వచ్చేనాటికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని అయ్యాను. ఇదే సమయంలో ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు కావడం ఆనందంగా ఉంది." అని మాధవ్ అన్నారు.

మాధవ్‌కు సీఎం శుభాకాంక్షలు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్ మాధవ్‌కు సీఎం చంద్రబాబు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో రాణించాలని ఆకాంక్షించారు. కూటమి పార్టీల సమన్వయం, పరస్పర సహకారంతో రాష్ట్రాభివృద్ధికి పాటు పడుదామని సూచించారు. మంత్రి లోకేశ్ కూడా మాధవ్‌కు అభినందనలు తెలియజేశారు.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

సజ్జల సన్నిహితుడిపై చర్యలు తీసుకోండి

మెడికల్ సీటు ఇప్పిస్తామని మోసం చేశారు

- రూ.1.20 కోట్లు చెల్లించా..న్యాయం చేయండి
- నారా లోకేశ్‌కు బాధితుడి అభ్యర్థన
- ప్రజాదర్బార్‌లో పిటిషన్లు స్వీకరించిన మంత్రి

తాడేపల్లి (ఉండవల్లి), జూలై 1 (ఆంధ్రజ్యోతి): మెడికల్ సీటు ఇప్పిస్తానంటూ మోసం చేసిన అప్పటి వైసీపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి సన్నిహితుడు అడపా ప్రేమ్‌చంద్‌పై చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేశ్‌ను బాధితుడు మన్నే సుబ్బారావు అభ్యర్థించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన సుబ్బారావు మంగళవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. "ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో నా కుమారుడికి సీటు ఇప్పించడానికి ప్రేమ్‌చంద్, గుత్తుల అవినాష్, కట్టేవాటి బాలిరెడ్డి తొలుత రెండు కోట్లు అడిగారు. మేం రూ. 1.20 కోట్లు చెల్లించాం. ఆ తర్వాత ఆ సీటు కోసం నాలుగు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత సొమ్ము చెల్లించలేమని చెప్పడంతో బెంగళూరులోని రామయ్య మెడికల్ కాలేజీలో సీటు ఇప్పిస్తామని తీసుకెళ్లారు. అలాట్‌మెంట్‌కు సంబంధించి నకిలీ లేఖను చేతిలో పెట్టి ప్రేమ్‌చంద్ మోసం చేశారు. మేం కట్టిన రూ. 1.20 కోట్లను తిరిగి ఇవ్వాలని కోరితే, సజ్జల పేరు చెప్పి బెదిరిస్తున్నారు." అని సుబ్బారావు వాపోయారు. వినతిపత్రం పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. కాగా, ప్రజాదర్బార్‌కు భారీగా అర్జీదారులు విచ్చేసి తమ సమస్యలను లోకేశ్‌కు విన్నవించుకున్నారు. ఎస్ఎంఏ (స్పైనల్ మస్కులర్ అట్రోఫీ) అనే ప్రాణాంతక సమస్యతో బాధపడుతున్న తొమ్మిది నెలల బాబును తీసుకుని ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన జొన్నాడ సాయిరామ్ వచ్చారు. ప్రతి పదివేల మందిలో ఒకరు ఎస్ఎంఏతో జన్మిస్తారని, ప్రపంచంలో ఖరీదైన జోల్‌జెనిస్మా మందు ఒక్కటే తమ బాబును బతికించగలదని వాపోయారు. వైద్య సహాయం అందించాలని అభ్యర్థించారు. కంతేరులో తమ కుటుంబానికి చెందిన 0.70 ఎకరాల వ్యవసాయ భూమిని విక్రయించగా, తమకు ఇవ్వాల్సిన మొత్తంలో రూ.12లక్షలను విష్ణు రాము అనే వ్యక్తి ఎగ్గొట్టడమే కాకుండా, దౌర్జన్యానికి దిగుతున్నారని ఉండవల్లికి చెందిన కళ్లం విజయలక్ష్మి ఫిర్యాదు చేశారు. టీడీపీ సానుభూతిపరుడనైన తన ఇంటిని వైసీపీ ప్రభుత్వ హయాంలో కూల్చివేసి, తనకు ఉన్న 2.50 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో కొంతమంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని నెల్లూరు జిల్లా తిమ్మసముద్రానికి చెందిన తోటకూర వెంకట సురేశ్ వాపోయారు. పల్నాడు జిల్లాలోని బిషప్స్, పాస్టర్స్ క్రైస్తవ సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని పల్నాడు డిస్ట్రిక్టు పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సాక్షర భారత్ కార్యక్రమంలో సేవలందిస్తున్న సుమారు 1840 మంది గ్రామ సమన్వయకర్తలకు న్యాయం చేయాలని ఉమ్మడి విజయనగరం జిల్లా సాక్షర భారత్ గ్రామ సమన్వయకర్తల యూనియన్ ప్రతినిధులు లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 'తొలి అడుగు'

ఏడాది పాలనపై ప్రజల్లోకి టీడీపీ

- ప్రభుత్వ విజయాలను వివరించనున్న శ్రేణులు
- ప్రతి గడపకు వెళ్లాలని చంద్రబాబు ఆదేశం
- వైసీపీ దుష్ప్రచారానికి చెక్ పెట్టేలా కార్యాచరణ

అమరావతి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో సాధించిన విజయాలపై చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ బుధవారం నుంచి శ్రీకారం చుట్టనుంది. నెలరోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. 'తొలి అడుగు'కు నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేసేందుకు జూన్ 29న టీడీపీ ప్రధాన కార్యాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమ ప్రాధాన్యతను చంద్రబాబుతోపాటు లోకేశ్ కూడా పార్టీ శ్రేణులకు వివరించారు. వైసీపీ 11 సీట్లతో ప్రజలు బుద్ధి చెప్పినా ఏడాది తిరగకముందే కూటమి ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెగబడుతోందని, దీన్ని సమర్థంగా ఎదుర్కోవాలంటే.. పార్టీ శ్రేణులన్నీ ప్రజల్లోకి వెళ్లి వాస్తవాలు చెప్పడం ఒక్కటే మార్గమని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. అధినేత నుంచి మొదలుకొని కింది స్థాయి కార్యకర్త వరకు నెలరోజుల పాటు ప్రజల్లోనే ఉండాలని, ప్రతి తలుపూ తట్టాలని, చేసిన మంచిని వివరించాలని ఆదేశాలు ఇచ్చారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్తలతోపాటు గ్రామస్థాయి కార్యకర్తల వరకు అందరూ క్షేత్రస్థాయిలో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు.

ఏం చేశాం.. ఏం చేయబోతున్నామో చెప్పాలి!

వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని ఓవైపు గాడిలో పెడుతూనే.. మరోవైపు ప్రజలకిచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని టీడీపీ భావిస్తోంది. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, దీపం-2 కింద మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు... ఇలా ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటినీ అమలు చేస్తున్నామనే అంశాన్ని ప్రజలకు వివరించాలని పార్టీ అధిష్ఠానం శ్రేణులకు ఆదేశాలిచ్చింది. రాజధాని అమరావతి, పోలవరం పనులు వేగంగా జరుగుతున్న విషయాలను, ఏడాదిలో 9.50లక్షల కోట్ల పెట్టుబడులు వంటి వాటిని ప్రజలకు వివరించకపోతే.. వైసీపీ దుష్ప్రచారాన్ని నమ్మే పరిస్థితి వస్తుందని, దీనికి చెక్ పెట్టేందుకు 'తొలి అడుగు' ఉపయోగపడుతుందని చంద్రబాబు వివరించారు. బూత్ కమిటీల నుంచి కుటుంబ సాధికార సమితి సభ్యులు వరకు అందరూ తమ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను ఇచ్చి, ఏడాది కాలంలో టీడీపీ ఏం చేసింది.. ఏం చేయబోతుందో వివరించాలని అగ్రనాయకత్వం స్పష్టం చేసింది.



సినీ నటి పాకీజాకు రూ.2లక్షల చెక్కు అందజేస్తున్న జనసేన ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

నటి పాకీజాకు పవన్ ఆపన్నహస్తం

రూ.2 లక్షల సాయం అందించిన డిప్యూటీ సీఎం

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): సినీ నటి వాసుకి(పాకీజా) తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆమెకు ఆపన్న హస్తం అందించారు. 'పాపం పాకీజా' శీర్షికన రెండ్రోజుల క్రితం ఆమె దీనస్థితిని వెలుగులోకి తేవడంతో అనేకమంది దాతలు స్పందించారు. ఈ కోవలోనే డిప్యూటీ సీఎం పవన్ స్పందించి ఆమెకు కబురు పెట్టారు. మంగళగిరిలోని జనసేన క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఆమెకు ఎమ్మెల్సీ పి. హరిప్రసాద్, పి.గన్నవరం ఎమ్మెల్యే సత్యనారాయణ చేతుల మీదుగా రూ2 లక్షల చెక్, చీర, స్వీటు బాక్సు అందించారు. పవన్ చేసిన సాయానికి నటి వాసుకి కృతజ్ఞతలు తెలిపారు. చిన్నవాడైనా ఎదురుగా ఉంటే కాళ్లు మొక్కుతానని, ఆయన కుటుంబానికి జీవితాంతం రుణపడి ఉంటానని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

కేంద్రం అభ్యంతరాలు అసంబద్ధం

బనకచర్లకు కొర్రీలు వేయడంపై అసంతృప్తి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను వెనక్కి పంపుతూ ఈఏసీ చూపిన కారణాలు సహేతుకంగా లేవని జలవనరుల శాఖ తీవ్ర అసంతృప్తిగా ఉంది. తన పరిధి దాటి వ్యవహరించిందని గుర్రుగా ఉంది. పర్యావరణ అనుమతుల నిమిత్తం అందిన ప్రాజెక్టు ప్రతిపాదనల్లో విధాన లోపాలేవైనా ఉన్నాయో లేవో పరిశీలించాల్సి ఉండగా.. తన అధికార పరిధిలో లేని వరద జలాల అందుబాటు, అంతర్రాష్ట్ర సమస్యల గురించి ప్రస్తావించి తిప్పిపంపడంపై ఉన్నతాధికారులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. దాని నిర్ణయం వెనుక పాలనాపరమైన అంశాలు కాకుండా కాకుండా రాజకీయపరమైన ఒత్తిళ్లు అధికంగా ఉన్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈఏసీ వేసిన కొర్రీలకు సూటిగా జవాబివ్వాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. కేంద్రంతో, తెలంగాణ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే.. కేంద్ర సంస్థల ఎదుట బలమైన వాదనలు వినిపించనుంది. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు నీటి లభ్యత.. ముఖ్యంగా గోదావరిలో వరద జలాల అందుబాటుకు సంబంధించి జలసంఘంతో కలిసి తాజాగా అధ్యయనం చేయాలని ఈఏసీ సోమవారం ఏపీకి సూచించిన సంగతి తెలిసిందే. అలాగే పోలవరం ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతి ఇచ్చినా.. ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లలో ముంపు సమస్య కారణంగా ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలోకి వెళ్లిందని తెలిపింది. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అనేక ఈ-మెయిల్స్ వచ్చాయని.. ఈ ప్రాజెక్టు గోదావరి జలవివాదాల ట్రైబ్యునల్ ఇచ్చిన అవార్డును ఉల్లంఘించేలా ఉందని వాటి సారాంశమని.. అంతర్రాష్ట్ర సమస్యలు కూడా ఇమిడి ఉన్నందున ఈ సమస్యలను పరిష్కరించుకుని విధివిధానాల (టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్-టీవోఆర్) ఖరారుకు మళ్లీ తనకు ప్రతిపాదనలు సమర్పించాలని పేర్కొంది. ఏటా గోదావరి వరద జలాలు అన్యాయంగా 3 వేల టీఎంసీలు సముద్రంపాలవుతున్నాయని.. వీటిలో 200 టీఎంసీలను.. అది కూడా వరద కాలంలోనే రోజుకు 2 టీఎంసీల చొప్పున వంద రోజులు తీసుకుని బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ వరకు తరలించి రాయలసీమకు అందించాలని సంకల్పించి ఈ ప్రాజెక్టు సిద్ధం చేశామని రాష్ట్రప్రభుత్వం తన ప్రతిపాదనల్లో స్పష్టంగా తెలియజేసింది. అయినా వరద జలాల అందుబాటుపై జలసంఘంతో కలిసి అధ్యయనం చేయాలని ఈఏసీ సూచించడంతో.. గోదావరి నీటి లెక్కలను ప్రభుత్వం మరోసారి బయటకు తీస్తోంది. ముఖ్యంగా గత 30 ఏళ్లలో ఏ ఏడాది ఎన్ని గోదావరి జలాలు కడలిపాలయ్యాయో ఈఏసీకి గణాంకాలు సమర్పించాలని భావిస్తోంది. ఈఏసీ నిర్ణయం వెలువడిన వెంటనే.. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను అప్రమత్తం చేశారు. తక్షణమే ధవళేశ్వరం నుంచి సముద్రంలోకి వృధాగా పోతున్న నీటి లెక్కలు తీయాలని ఆదేశించారు. నదుల అనుసంధాన ప్రక్రియలో భాగంగా మహానది-కావేరి పథకం ప్రతిపాదన వచ్చినప్పుడు తీసిన నీటి లెక్కలు.. తెలంగాణ భూభాగంలోని ప్రాణహిత నుంచి కావేరి వరకు నదుల అనుసంధానం కోసం అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన లెక్కలు.. గోదావరి-బనకచర్లకు అదే కేసీఆర్ తయారుచేసిన గణాంకాలు.. కేంద్ర జల సంఘం విడుదల చేసిన లెక్కల వివరాలు సిద్ధం చేయాలని జల వనరుల శాఖను ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నిర్దేశించింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేపట్టారు. ఇక ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఈఏసీకి అందిన ఫిర్యాదులన్నీ రాజకీయ కోణంలో ఉన్నందున.. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని చంద్రబాబు నిర్ణయించారు. అటు కేంద్రంతోనూ రాజకీయ చర్చల ప్రక్రియ ద్వారా కూడా ప్రాజెక్టుకు అడ్డంకులను తొలగించుకోవాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10 లేదా 11న కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌తో భేటీ కావాలని సీఎం భావిస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. వారితో చర్చల సందర్భంగా.. గోదావరి జలాల్లో ఆంధ్రప్రదేశ్ వాటా గురించి, సముద్రంలోకి వృధాగా పోయే జలాల్లో ఎగువ రాష్ట్రాలకు హక్కు ఉండదంటూ వివరించాలని ఆయన భావిస్తున్నారు. ఈ ద్విముఖ వ్యూహంతో ప్రాజెక్టుకు క్లియరెన్సు తెచ్చుకోగలమన్న ధీమా ఉన్నతాధికారుల్లో కనిపిస్తోంది. మరోవైపు.. ఈ ప్రాజెక్టుపై ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని కేంద్రం కొద్దిరోజుల క్రితమే నిర్ణయించింది. చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారు. ఇలా రాజకీయంగా సంప్రదింపులు జరుపుతూనే.. ఈఏసీ లేవనెత్తిన అంశాలపై ఘాటుగా స్పందించాలని జల వనరుల శాఖ భావిస్తోంది. నీటి లెక్కలను సమర్పించి బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల కోసం ముమ్మరంగా ప్రయత్నాలు సాగించాలని.. అటు కేంద్ర జలసంఘంపైనా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది..

అక్కడి అధికారులు అలా.. ఇక్కడి అధికారులు ఇలా..!

కేంద్ర జల సంఘంలోనూ.. ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలం జలవనరుల శాఖలో కీలక స్థానాల్లో పనిచేసిన అధికారులు తెలంగాణ ప్రభుత్వంతో కలసి పనిచేస్తున్న కారణంగా.. కేంద్ర జలశక్తి శాఖ వద్ద లాబీయింగ్ చేయగలుగుతున్నారని రాష్ట్ర సాగునీటి రంగ నిపుణులు అంటున్నారు. మన రాష్ట్రంలో మాత్రం ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులు తెచ్చేందుకు నిరంతరం జలశక్తి శాఖతో సంప్రదింపులు జరిపే అధికార వ్యవస్థే లేదని ఆక్షేపిస్తున్నారు. 'జలవనరుల శాఖలోని అంతర్రాష్ట్ర జల వివాద విభాగంలో విధులు నిర్వహించే ఇంజనీరింగ్ అధికారులకు రాష్ట్రంపై అభిమానం.. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడాలన్న తపన ఉండాలి. ఇక్కడ పనిచేయడం బరువుగా భావించేవారికి విధులు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలి. ఈ విభాగాన్ని 'పనిష్మెంట్ వింగ్'గా జల వనరుల శాఖ, ఇంజనీరింగ్ అధికారులు కూడా భావిస్తుండడంతో.. కేంద్ర శాఖలతో చర్చల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదు' అని అభిప్రాయపడుతున్నారు. ఇంకోవైపు.. జలశక్తి శాఖ అధికారులతో సంప్రదింపులకు ఢిల్లీ వెళ్లేందుకు రాష్ట్ర ఆర్థిక శాఖ విమాన చార్జీలకూ నిధులివ్వడంలేదని జల వనరుల శాఖ అధికారులు గుర్రుగా ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం, అధికార గణం నిత్యం ఢిల్లీలోని మంత్రులు, జలశక్తి అధికారులతో టచ్‌లో ఉంటూ లాబీయింగ్ చేస్తూ ఉంటే.. తమకు టికెట్లకే డబ్బులివ్వని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. దీనిపైనా ప్రభుత్వం దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈఏసీ క్లియరెన్సు.. బనకచర్ల ప్రాజెక్టు ప్రణాళిక ముందుకు వెళ్లేందుకు దోహదపడే 'గేట్ పాస్'గా వారు అభివర్ణిస్తున్నారు.

అధికారులతో సాయిప్రసాద్ భేటీ

సీఎంవో ఆదేశాలతో జలవనరుల శాఖ ప్రత్యేక సీఎస్ సాయిప్రసాద్ మంగళవారం అత్యవసరంగా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. నీటి లెక్కల కోసం జలసంఘంపై ఒత్తిడి తీసుకురావడం మంచిదన్న అభిప్రాయం ఈ సందర్భంగా వ్యక్తమైంది. దాని నుంచి హైడ్రాలజీ క్లియరెన్స్ సాధిస్తే ఈఏసీ వద్ద గట్టిగా వాదనలు వినిపించవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇదే సమయంలో పర్యావరణ అనుమతుల కోసం సమాంతరంగా ప్రయత్నాలు సాగించాలని నిర్ణయించారు.

బీఆర్‌ఎస్‌ను బతికించుకునేందుకే బనకచర్ల!

బాబును, నన్ను భూతంగా చూపే యత్నం: రేవంత్



హైదరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ చచ్చిన పాము.. ఆ పామును బతికించుకునేందుకు గోదావరి-బనకచర్ల వివాదాన్ని వాడుకుంటున్నారు. నీళ్ల సెంటిమెంట్‌ను వాడుకుని.. ఆ సెంటిమెంటే పార్టీని బతికిస్తుందని అనుకుంటున్నారు.. దానికి పక్క రాష్ట్రం ముఖ్యమంత్రిని, నన్ను భూతంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు' అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. క్షుద్రపూజలు చేసే ఫామ్‌హౌస్ నాయకుడికి ఇదొక్కటే జీవనాధారంగా మారిందని. ప్రభుత్వాన్ని బద్‌నాం చేసే కుట్రలు చేస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. అబద్ధాలతోనే బీఆర్ఎస్ 2023లో అధికారం కోల్పోయిందన్నారు. 2024లో డిపాజిట్లు కూడా కోల్పోయిందని.. 2025 ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు దొరకలేదని ఎద్దేవా చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించడానికి మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. జలవివాదాలపై కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలని.. కానీ వివాదాలు సృష్టించి.. ఇద్దరి జుట్లు పట్టుకుని ఆడించవచ్చనేదే దాని విధానమని ఆరోపించారు. 'మన ఫోకస్ అంతా బీజేపీపై పెట్టాలి. పరోక్షంగా బీఆర్ఎస్‌ను బతికించడానికి ప్రయత్నిస్తోంది. దీనివెనుక ప్రధాన పాత్ర కిషన్‌రెడ్డిదే. ఆయన మాట్లాడే ప్రతి మాటా కేటీఆర్ ఇంటినుంచి వచ్చే ప్రెస్‌నోట్‌తోనే మాట్లాడతారు' అని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో నీళ్ల కోసం చేసిన పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన పదేళ్లలో ప్రాజెక్టులు కట్టకుండా కృష్ణా జలాలను తాకట్టుపెట్టడమే కాకుండా గోదావరి జలాలను కూడా తాకట్టు పెట్టారని విమర్శించారు. 2016 సెప్టెంబరు 21న అప్పటి కేంద్ర జలవనరుల మంత్రి ఉమాభారతి నేతృత్వంలో రెండు రాష్ట్రాల సీఎంలతో జరిగిన సమావేశంలో కేసీఆర్ చేసిన ప్రతిపాదనల ఆధారంగా చంద్రబాబు గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని ప్రతిపాదించారని అన్నారు. కృష్ణా బేసిన్‌కు 1,000 టీఎంసీలు కావాలని.. గోదావరిలో 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని.. ఆ 3 వేల టీఎంసీలు వాడుకోవడానికి ప్రాజెక్టులు చేపట్టాలని కేసీఆర్ నాడు ప్రతిపాదించారని చెప్పారు. కేసీఆర్ రోజా ఇంటికి భోజనానికి వెళ్లి.. గోదావరి జలాలను మీకిచ్చి రాయలసీమను రతనాల సీమగా చేస్తామని చెప్పారని ఆరోపించారు. 3 వేల టీఎంసీలు సముద్రంలోకి పోతున్నాయని రాచపుండు పెట్టింది కేసీఆరే. వాళ్ల జీవిత విజయమంతా అబద్ధాల మీదే ఉంది. ఫ్యామిలీ.. ఫ్యామిలీ ప్యాకేజీ కింద అబద్ధాలు చెప్పి బతకడం నేర్చుకున్నారు. నిజం చెబితే చచ్చిపోతారని శాపం ఉన్నట్లుంది. ఈ వ్యవహారంపై ప్రత్యేక శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేద్దాం.. ఒకరోజు కృష్ణా, ఒక రోజు గోదావరి జలాలపై చర్చ చేద్దాం. గత పదేళ్ల కాలంలో వచ్చిన ఒక్కో జీవో, పేపర్ చదివి వినిపిద్దాం..' అని సవాల్ విసిరారు. గోదావరి-బనచకర్లకు పర్యావరణ అనుమతి తిరస్కరించడం ఒక్క కామా మాత్రమే... ఫుల్‌స్టాప్ కాదని స్పష్టంచేశారు. 'వాళ్లు లేవనెత్తిన అనుమానాలను నివృత్తి చేసి, మళ్లీ పర్యావరణ మంత్రిత్వ శాఖకు ఇస్తారు. ఎందుకంటే మోదీ మనుగడ చంద్రబాబు మీద ఉంది. చంద్రబాబు మనుగడ బనకచర్లపై ఉంది. ఇందులో రాజకీయ అనుసంధానం ఉంది' అని చెప్పారు. కృష్ణా, గోదావరిపై అన్ని ప్రాజెక్టుల నీటి కేటాయింపులు, అన్ని వివాదాలు పరిష్కారమైతేనే మిగులు జలాల లెక్క తేలుతుందని రేవంత్ స్పష్టం చేశారు. దీనిపై తొలుత అధికారుల స్థాయిలో.. తర్వాత నీటిపారుదల మంత్రుల స్థాయిలో చర్చ జరిగిన తర్వాత.. అంతిమంగా సీఎంల స్థాయిలో జరిగే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయాలు జరుగుతాయని తెలిపారు. బీఆర్ఎస్ అసమర్థత, కక్కుర్తి వల్లే గోదావరి, కృష్ణాలో సమస్యలు తలెత్తాయని తెలంగాణ నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా ఆరోపించారు.

వల్లభనేని వంశీకి బెయిల్

- నకిలీ ఇళ్ల పట్టాల కేసులో మంజూరు.. నేడు జైలు నుంచి విడుదల?

నూజివీడు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ ఏలూరు జిల్లాలోని నూజివీడు కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అన్ని కేసుల్లో వంశీకి బెయిల్ వచ్చినట్లయ్యింది. గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి సహా పలు కేసుల్లో అరెస్టు అయిన వంశీ ప్రస్తుతం కృష్ణా జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న వంశీని ఈ ఏడాది ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. 2024 ఫిబ్రవరి 20న గన్నవరం టీడీపీ కార్యాలయంపై అప్పటి గన్నవరం ఎమ్మెల్యేగా ఉన్న వంశీ అనుచరులు, వైసీపీ నాయకులు దాడి చేసి నిప్పుపెట్టారు. కార్యాలయ ఫర్నిచర్‌ను ధ్వంసం చేసి, అక్కడున్న కొందరు టీడీపీ నేతలనూ గాయపరిచారు. వాహనాలనూ తగులబెట్టారు. ఆ కార్యాలయ ఆపరేటర్ ముదునూరి సత్యవర్ధన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వంశీ అనుచరుల, వైసీపీ కార్యకర్తలు మొత్తం మీద 71 మంది ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఆ కేసులో వంశీకి ఇప్పటికే బెయిల్ మంజూరైంది. బుధవారం ఆయన విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జైలు నుంచి కృష్ణంరాజు విడుదల

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంత మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో ప్రధాన నిందితుడు వాడపల్లి వెంకట రాధాకృష్ణంరాజు మంగళవారం గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు. హైకోర్టు సోమవారం ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయడంతో పూచీకత్తులు సమర్పించి మంగళవారం రాత్రి జైలు నుంచి బయటకు వచ్చారు. అమరావతి.. వేశ్యల రాజధాని అని ఇటీవల సాక్షి చానల్ లైవ్ డిబేట్‌లో కృష్ణంరాజు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయగా.. యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు వాటిని ప్రోత్సహించినట్లుగా వ్యవహరించారు. ఈ వ్యాఖ్యలు దుమారం రేపడంతో.. రాజధాని ప్రాంత దళిత జేఏసీ నేత కంభంపాటి శిరీష ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో కృష్ణంరాజును ప్రధాన నిందితుడు(ఏ1)గా, కొమ్మినేని శ్రీనివాసరావును ఏ2గా, సాక్షి యాజమాన్యాన్ని ఏ3గా చేర్చారు.

నందిగం సురేష్ బెయిల్‌పై విడుదల

- గుంటూరు జిల్లా జైలులో 40 రోజులుగా రిమాండ్‌లో



గుంటూరు జిల్లా జైలు నుంచి బయటకు వస్తున్న సురేష్

గుంటూరు, జూలై 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎంపీ నందిగం సురేష్ మంగళవారం బెయిల్‌పై విడుదలయ్యారు. టీడీపీ కార్యకర్తపై దాడి, హత్యాయత్నం కేసులో ఆయనకు గుంటూరు జిల్లా కోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. గత మే నెలలో రాజధానిలోని ఉద్దండరాయునిపాలెంలో నందిగం సురేష్, ఆయన భార్య బేబీలత, సురేష్ సోదరుడు వెంకయ్య అలియాస్ వెంకటేశ్, మరో ఏడుగురు అనుచరులు టీడీపీ కార్యకర్త ఇసుకపల్లి రాజుపై దాడికి పాల్పడి, హత్యాయత్నం చేశారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు తుళ్లూరు పోలీస్‌స్టేషన్లో కేసు నమోదైంది. నందిగం సురేష్‌ను పోలీసులు మే 19న అరెస్టు చేసి మంగళగిరి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు. దీంతో గత 40 రోజులుగా ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. సురేష్ భార్య బేబీలతకు కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. ఇదే కేసులో వాయిదా ఉండటంతో మంగళవారం ఉదయం మంగళగిరి కోర్టుకు హాజరైన నందిగం సురేష్.. రాత్రికి గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలయ్యారు.

మళ్లీ పాదయాత్ర చేస్తా

- వైసీపీ బలోపేతానికి జిల్లాల్లో పర్యటన
- కడప జిల్లా టూర్ తర్వాత పాదయాత్ర: జగన్
- యువజన విభాగానికి జోన్ల వారీగా వర్కింగ్ ప్రెసిడెంట్లు



అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): యువజన విభాగాన్ని, వైసీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు జిల్లాల్లో పర్యటిస్తానని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. కడప జిల్లాలో పర్యటన తర్వాత మళ్లీ పాదయాత్ర చేపడతానని ప్రకటించారు. మంగళవారం తాడేపల్లి ప్యాలెస్‌లో యువజన విభాగం నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా చెప్పారు. యువజన విభాగంలో ఉన్నవారంతా సోషల్ మీడియాలో ఎన్‌రోల్ కావాలని సూచించారు. ప్రజలకు.. వ్యక్తిగతంగా జరిగే అన్యాయాలను సెల్‌ఫోన్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టాలన్నారు. యువజన నేతల చేతిలో సెల్‌ఫోనే ఒక ఆయుధమని చెప్పారు. వైసీపీలో యువ ఎమ్మెల్యేలు ఎక్కువగా ఉన్నారంటూ.. వారికే యువజన విభాగం బాధ్యతలు అప్పగిస్తానని ప్రకటించారు. అంతలోనే దిద్దుకుని.. మాజీ ఎమ్మెల్యేలు ఎక్కువ మంది యువకులేనని.. వారికి అప్పగిస్తానని అన్నారు. ఈ విభాగానికి ఉత్తరాంధ్ర, కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి, రాయలసీమ.. ఇలా జోన్లవారీగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తున్నట్లు చెప్పారు. కడప లోక్‌సభ ఉప ఎన్నికలో తాను 5.45 లక్షల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచానని.. దాంతో కాంగ్రెస్ తనపై పగపట్టిందని జగన్ వ్యాఖ్యానించారు. 2011లో పార్టీని స్థాపించినప్పుడు తనతో పాటు అమ్మ (విజయలక్ష్మి) మాత్రమే తోడుగా వచ్చిందన్నారు. అప్పట్లో ఎవరూ లేరని.. క్రమంగా పార్టీని బలోపేతం చేశానని చెప్పుకొచ్చారు.

చంద్రబాబు ప్రభుత్వంపైన అవిశ్వాస తీర్మానం పెట్టా!

- కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వానికి టీడీపీ సపోర్టు చేసింది!!
- జగన్ మాటలతో విస్తుపోయిన వైసీపీ నేతలు

'అప్పట్లో కరెంటు చార్జీలను చంద్రబాబు విపరీతంగా పెంచిన నేపథ్యంలో బాబు ప్రభుత్వం మీద అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాం. ఆశ్చర్యం ఏమిటో తెలుసా.. టీడీపీ అప్పట్లో కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వానికి సపోర్టు చేసింది. 294 స్థానాలకు 148 ఎమ్మెల్యే స్థానాలు హాఫ్ వే మార్కు అయితే.. అప్పట్లో చంద్రబాబు పార్టీ సపోర్టు చేయడంతో కిరణ్‌కుమార్‌రెడ్డి గట్టెక్కారు. బాబు, కాంగ్రెస్ ఇద్దరూ కుమ్మక్కయ్యారు' అని జగన్ పేర్కొన్నారు. ఆ మాటలు విని యువజన విభాగం నేతలు విస్తుపోయారు. 'జగన్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడమేంటి? 2011లో అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వంపై టీడీపీ కదా అవిశ్వాసం పెట్టింది.. జగన్‌తో ఉన్న 16 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ తీర్మానానికి మద్దతిచ్చారు. ఆ తీర్మానం ఓడిపోయింది. పైగా... కాంగ్రెస్ ప్రభుత్వంలో చంద్రబాబునాయుడు విద్యుత్ చార్జీలు పెంచడం ఏమిటి' అని జుత్తుపీక్కున్నారు. అయితే ఆర్గనైజేషన్‌లో ఉన్నప్పుడు బుర్ర ఉండాలన్న జగన్ గీతోపదేశం గుర్తుకొచ్చి చప్పట్లు కొట్టారు.

సింగయ్య మృతి కేసులో తదుపరి చర్యలు నిలుపుదల

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

- నిలుపుదలపై ఏజీ తీవ్ర అభ్యంతరం

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ గుంటూరు జిల్లా రెంటపాళ్లలో పర్యటించిన సమయంలో ఆయన కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందిన కేసులో తదుపరి చర్యలను నిలిపివేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జగన్ సహా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, జగన్ పీఏస్ కె. నాగేశ్వర రెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజనీలపై చర్యలను నిలుపుదల చేసింది. కౌంటర్ దాఖలుకు ప్రాసిక్యూషన్‌కు 2 వారాల సమయం ఇస్తూ విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ప్రాథమికంగా నమోదైన ఎఫ్ఐఆర్‌లో పిటిషనర్లను నిందితులుగా చేర్చలేదని తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా లభ్యమైన ఆధారాలు, వీడియో ఫుటేజ్ ఆధారంగా పిటిషనర్లను పోలీసులు నిందితులుగా చేర్చారని పేర్కొన్నారు. వాహన ప్రమాదానికి డ్రైవర్‌ను బాధ్యుడిని చేయాలి తప్ప వాహనంలో ప్రయాణిస్తున్న వారిని బాధ్యులను చేయడానికి వీల్లేదని కోర్టు అభిప్రాయపడుతున్న నేపథ్యంలో అన్ని ఆధారాలు, వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామన్నారు. ఆ తర్వాత క్వాష్ పిటిషన్లపై విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అరెస్ట్ నుంచి పిటిషనర్లకు రక్షణ కల్పించిన నేపథ్యంలో వ్యాజ్యాలపై అత్యవసర విచారణ జరపాల్సిన అవసరం లేదన్నారు. కౌంటర్ దాఖలుకు వీలుగా విచారణను రెండువారాలకు వాయిదా వేయాలని కోరారు. జగన్ తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. గుర్తు తెలియని వాహనం ఢీకొని సింగయ్య మృతి చెందినట్లు మొదట ఎఫ్ఐఆర్ నమోదు చేశారని, జిల్లా ఎస్పీ సైతం ఇదే విషయాన్ని చెప్పారని తెలిపారు. వాహనం ఢీకొన్న అనంతరం సింగయ్య 40 నిమిషాలు ప్రాణాలతోనే ఉన్నారన్నారు. అంబులెన్స్ వచ్చిన తర్వాత ఆసుపత్రికి తరలించారని, కారును సీజ్ చేసి జగన్‌ను అవమానించారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా వీడియో డౌన్‌లోడ్ చేసినట్లు చెబుతున్నారని, కృత్రిమ మేధ వినియోగించి వీడియోలను సృష్టించడం ఈ రోజుల్లో చాలా సులభంగా మారిందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీ నాయకుడి పర్యటనలో రోప్ పార్టీని ఏర్పాటు చేయలేదన్నారు. జగన్ సెక్యూరిటీ విషయంలో ఇప్పటికే రెండు రిట్ పిటిషన్లు దాఖలు చేశామని వివరించారు.

జగన్.. పోలీసుల మాట వినలేదు: ఏజీ

పోలీసుల ఆదేశాలను జగన్ ఎన్నడూ పాటించలేదని ఏజీ అన్నారు. పిటిషనర్లు కోర్టుకు సమర్పించిన వీడియోను పరిశీలించాల్సి ఉందన్నారు. ఎవరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎస్పీ అలాంటి ప్రకటన చేయాల్సి వచ్చిందో దర్యాప్తు అధికారి తేల్చాల్సి ఉందన్నారు. డ్రోన్‌తో వీడియో రికార్డు చేసిన వ్యక్తికి సమన్లు జారీ చేసి వీడియోను తెప్పించుకునేందుకు సమయం పడుతుందన్నారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రాసిక్యూషన్‌కు 2 వారాల సమయం ఇచ్చారు. కాగా, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంపై ఏజీ అభ్యంతరం తెలిపారు. ఏలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని గట్టిగా వాదించారు.

మద్యం స్కాం నిందితులకు రిమాండ్ పొడిగింపు

- వర్చువల్‌గా కోర్టులో హాజరు పరిచిన అధికారులు
- ఆస్తుల జప్తునకు అనుమతి కోరిన సిట్

విజయవాడ, జూలై 1(ఆంధ్రజ్యోతి): మద్యం స్కాం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఈ కేసులో మొత్తం 9 మందిని సిట్ అరెస్టు చేయగా, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, అతని స్నేహితుడు చెరుకూరి వెంకటేష్ నాయుడు సిట్ కస్టడీలో ఉండడంతో మిగిలిన నిందితులను అధికారులు మంగళవారం వర్చువల్‌గా కోర్టులో హాజరుపరిచారు. ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య, దిలీప్, ధనంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్ప, సజ్జల శ్రీధర్‌రెడ్డిలకు ఈ నెల 15వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి పి.భాస్కర రావు ఉత్తర్వులు ఇచ్చారు. జైలు నుంచే వర్చువల్‌గా హాజరుపరచడంతో నిందితుల తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా ఇలా వర్చువల్‌గా హాజరుపరచడం సరికాదన్నారు. దీంతో న్యాయాధికారి భాస్కరరావు వారికి రూల్ బుక్‌ను చూపించారు. కొత్త నిబంధనల ప్రకారం నిందితులను వర్చువల్‌గా హాజరుపరచవచ్చన్నారు. కాగా, వందల మంది అనుచరులు కోర్టు వద్దకు రావడంతో సిట్ అధికారి ఆర్.శ్రీహరిబాబు అభ్యంతరం తెలిపారు. 'నిందితులను కలవడానికి కుటుంబ సభ్యులు రావడంలో ఎలాంటి అభ్యంతరమూ లేదు. వారితోపాటు వందల మంది కోర్టుకు వస్తున్నారు. నిందితులకు భద్రత కల్పించాల్సిన బాధ్యత మాపై ఉంది. వారికి ఏమైనా జరిగితే సిట్ అధికారులతోపాటు ఎస్కార్ట్ సిబ్బంది ఇబ్బంది పడతారు' అన్నారు. దీన్ని న్యాయాధికారి సమర్థించారు. సిట్ అధికారుల వాదనలో వాస్తవం ఉంది కదా అని నిందితుల తరఫు న్యాయవాదులను ప్రశ్నించారు.

ఆస్తుల జప్తునకు అనుమతి ఇవ్వండి..

మద్యం కేసులో నిందితుల ఆస్తులను జప్తు చేయడానికి అనుమతి ఇవ్వాలని సిట్ అధికారులు ఏసీబీ కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. సుమారు రూ.30 కోట్ల ఆస్తులను జప్తు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. దీనికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున కోర్టు అనుమతి ఇవ్వాలని కోరారు.

విక్రాంత్‌రెడ్డి ఎల్‌వోసీపై హైకోర్టు స్టే

- విచారణ నాలుగు వారాలు వాయిదా

అమరావతి, జూలై 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ పోర్టు, కాకినాడ సెజ్ వాటాల బదిలీ వ్యవహారంలో నమోదైన కేసులో వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిపై సీఐడీ అధికారులు జారీ చేసిన లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ)పై హైకోర్టు స్టే విధించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. తనపై జారీ చేసిన ఎల్‌వోసీ కొట్టివేయాలని కోరుతూ విక్రాంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విక్రాంత్‌రెడ్డి తరఫున న్యాయవాది వై. నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ... ఎల్‌వోసీ అమలును నిలుపుదల చేయాలని కోరారు. సీఐడీ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నీలోత్పల్ స్పందిస్తూ.. వివరాలు తెప్పించుకొని, వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.